
# మనసున మనసై



ఆలేటి నాగమణి

## తను ప్రేమించిన అమ్మాయి
## తనను ప్రేమించిన అమ్మాయి
## అతని జీవితం ముడిపడింది ఎవరితో?




ఆలేటి నాగమణి

పొట్టినవల

ఏ షామ్‌కి తన్‌హాయియా ఐసే మే తేరాగమ్ – చల్లటి సాయంకాలం నీలాకాశం నిర్మలంగా నిండుగా వుంది. గాలి తెరలు తెరలుగా వచ్చి మృదువుగా స్పర్శించిపోతోంది. గాలి అలల్లో తేలి తేలి మృదుమధురంగా విన్పిస్తోంది లతామంగేష్కర్ పాట. తల క్రింద రెండు అర చేతులు పెట్టుకుని ఇసుకలో వెల్లకిలా పడుకొని రేడియో పాటకు తోడుగా కూని రాగం తీస్తున్న విజయ్ చాలా దగ్గర్లో గాజుల చప్పుడుకు కళ్లు తిప్పి చూశారు.

శాంతి! చెక్కిన శిల్పంలా కూర్చొని వుంది. రెండు మోకాళ్ళను రెండు చేతులతో చుట్టేసి మోకాళ్ళ మీద చుబుకాన్ని ఆనించి చూస్తోంది. రెండు క్షణాల పాటు మైమరచి చూశాడు.

"ఎంత సేపైయింది శాంత" అన్నాడు.

"యిప్పుడే" అన్నట్టు రెప్పలు మూసి తెరచింది

"నీ కిష్టమైన పాట" అన్నాడు.

"ఊఁ" అంది.

పాట అయిపోయింది. ట్రాన్సిస్టర్ కట్టేసి లేచి కూర్చొని, "ఇక చెప్పండి" అన్నాడు.

"శాంతీ ఐ వాంట్ టు సీ హిమ్" రావు గారి మాటలు గుర్తుకు వచ్చాయి శాంతికి.

"ఏమిటివాళ...శాంతి మరి ప్రశాం వుంది భోరున వర్షం రాదు కదా?" అన్నాడు విజయ్.

"శాంతీ అతను నాకు నచ్చాలి"

"తప్పకుండా"

"అఫ్‌కోర్స్ ప్రేమిస్తున్నానంటున్నావ్ కాబట్టి నీకు నచ్చడంలో గొప్పేం లేదు.



నాకు నచ్చాలి. అలా జరగక పోతే నువ్వు నామాట విని తీరాలి"

శాంతి ఉలిక్కిపడింది.

"శాంతీ! ఏమిటోయ్. వచ్చినప్పటి నుండి ఈ మౌన సంగీతం" విజయ్ మాటలకు తల ఎత్తి చూస్తూ "డాడి నిన్ను చూడాలంటున్నారు" అంది.

"ఓ.కె ఇప్పుడు రానా మీ ఇంటికి" అన్నాడు. శాంతి వెంటనే జవాబివ్వక పోయేసరికి "ఏం నా అవతారం బావులేదా ?" అన్నాడు.

"బావుంది"

"మరి ఎందుకు సందేహిస్తున్నావ్"

"నువ్వు డాడికి నచ్చాలిట"

"నీ కళ్ళు పెట్టుకు చూడమను" అన్నాడు తేలిగ్గా నవ్వుతూ.

"అదికాదు విజయ్"

"నాకు అర్థమైంది శాంతీ! తనకు నచ్చకపోతే మన పెళ్ళి జరగదన్నారు. అంతేనా?"

"అవును"

"ఓహ్" అంటూ శాంతి చేతిని తన చేతిలోకి తీసుకొని నా మనసులో మాట మామూలుగా చెప్పనా? లేక పాత చింతకాయ పచ్చడిలా సినిమా డైలాగు చెప్పనా?"

"ఎలా చెప్పినా నాకు అర్థం అయితే చాలు" అంది

"మన ప్రేమ చాలా పవిత్రమైనది శాంతి మన ప్రేమను కాదనే హక్కు, కలిసిన మన మనసులను విడదీసే అధికారం మీ నాన్నకే కాదు. మీ నాన్నను పుట్టించిన ఆ బ్రహ్మదేవుడి తరం కూడా కాదు. మన ప్రేమ వర్థిల్లాలి. మన ప్రేమ వర్థిల్లాలి- ఇది సినిమా డైలాగు"

"ఇక నేను చెప్పాలనుకుంది, శాంతి ఐ లవ్ యూ. ఐ వాంట్ యూ అంతే" అన్నాడు శాంతి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

"నాన్నకు చాలా కావాలి విజయ్. కులం, డబ్బు, హోదా" అంది శాంతి.

"నీకవసరం లేదుగా. అది చాలు"

"కాని..."

"ఇంకేం చెప్పకు శాంతి! ఐ డోంట్ కేర్ యువర్ ఫాదర్! అలాంటి విషయాలు పట్టించుకునే వ్యక్తిని నేను అసలు కలుసుకోను. కలిస్తే జరిగే పర్యవసానం ఏమిటో నాకు తెలుసు. అలాంటప్పుడు కలుసుకోకుండా వుండడం మంచిది"

"కాని...డాడి నిన్ను చూడాలన్నారు"

"ఊహుం...నాకు మీ డాడిని కలుసుకోవాలని లేదు. అచ్చా, లీవ్ దట్!" అన్నాడు.

శాంతి అయోమయంగా చూసింది.

ఆమె చూపులోని అర్థాన్ని గ్రహించి చిన్నగా నవ్వి, "శాంతీ! నీకు కావలసిందేమిటో నీకు బాగా తెలుసు కావాలంటే మరోసారి ఆలోచించుకో! నువ్వు బాగా ఆలోచించి నీకై నువ్వు నన్ను కాదంటే భరించి, మౌనంగా వెళ్ళిపోగలనుకాని మూడో వ్యక్తి ఏమన్నా నేను భరించను. నిన్ను వదులుకోను. పద వెళ్దాం!" అన్నాడు యిక మళ్ళీ శాంతి మాట్లాడే అవకాశం యివ్వకుండా.

శాంతి అనుసరించింది.

కాని—

ఆమె మనసంతా ఆందోళనగా వుంది! తండ్రి తెచ్చిన సంబంధం కాదంది. ఒప్పుకున్నాడు. విజయ్‌ని ప్రేమించానంది. విజయ్ వివరాలు తనకు సంతృప్తిని కలుగ చేస్తే పెళ్ళి జరిపిస్తానన్నాడు. కాని...తాను ప్రేమించిన విజయ్ గురించి పూర్తిగా తనకేం తెలీదు. అతడు ఒంటరివాడు. పేదవాడని, స్కాలర్‌షిప్ డబ్బులతో చదువు కుంటూ, ట్యూషన్స్ చెప్తే వచ్చే డబ్బుతో హాస్టల్‌లో వుంటున్నాడని, చాలా మంచివా డని, మనసున్న మనిషని తప్ప అతని వ్యక్తిగత విషయాలు తెలీవు తనకు. తాను అడగలేదు. నిజానికి ఆ విషయాలు తనకు అవసరం అన్పించలేదు. కాని యిప్పుడు... తండ్రి....

శాంతి ఆలోచిస్తూనే యిల్లు చేరింది.

శాంతి విజయ్‌ల పరిచయం చాలా గమ్మత్తుగా జరిగింది.

ఆరోజు—

"నమస్తే! నా పేరు శాంతి. మీ పేరు విజయ్‌కదూ!

ఆమె మాటలకు ఉలిక్కిపడి బిత్తరపోతూ, "నమస్తే!" అన్నాడు విజయ్. ఆమె చిరునవ్వు...అందంగా అప్పుడే విచ్చిన మందారంలా నిండుగా, స్నిగ్ధంగా, ముగ్ధ మనోహరంగా వుంది, కాటుక దిద్దిన కళ్ళలో అతని రూపం నిండుగా.


"కూర్చోండి" అన్నాడు చేతిలోని నోట్‌బుక్ మూసి సరిగ్గా కూర్చుంటూ.

ఆమె కుర్చీలో కూర్చుని గదినంతా ఓసారి కలయజూసింది. బ్రహ్మచారి గదైనా, చాలా నీట్‌గా వుంది

ఆవిడెవరో తెలీక సతమతమైపోతూ, ఆవిడెందుకొచ్చిందో అర్థంకాక, యింతకూ ఆవిడ వచ్చింది తనకోసమా లేక తన రూమ్మేట్ శ్యాంగురించో అర్థంకాక-ఆ విషయం ఎలా అడగాలో అసలు తెలీక, ఇబ్బందిగా చూడసాగాడు. ఆమెను ఎక్కడా ఎప్పుడూ చూసిన గుర్తులేదు

---

## కాస్ట్ ఆఫ్ లివ్వింగ్



"నాన్నా! ఈవేళ నుండి మీరు నా పాకెట్ మనీ పెంచాల్సిందే!" కాలేజీలో చదివే కుమార రత్నం తన తండ్రికి విలదీశాడు

"ఎందుకు పెంచాలా?"

"కాస్ట్ ఆఫ్ లివ్వింగ్ బాగా పెరిగిపోయింది నాన్నా

—జూపిటర్

"గదిలో మీరు ఒక్కరేనా ? లేక..."

"శ్యాం వుంటాడండి. ఇప్పుడే బయటికి వెళ్ళాడు. కాసేపట్లో వచ్చేస్తాడు" అన్నాడు గబగబా

కారిడార్ లోనుండి వెడుతూ, ఎవరో లోపలికి తొంగిచూసి వెళ్ళారు. మరో నిమిషానికి విజిల్ శబ్దం విన్పించింది.

అంతే–

నిమిషానికి ఒకరు చొప్పున కారిడార్‌లోనుండి తిరుగుతూ తొంగిచూస్తున్నారు.

విజయ్‌కు మహ యిబ్బందిగా వుంది. తలుపువంక, ఆవిడవంక చూస్తున్న విజయ్ మొహంలో రంగులు మారసాగాయి. ఆమెనేదో అడగాలని పెదవి కదపబోయాడు

ఆమె ఫక్కున నవ్వేసింది. ఆమె ఎందుకు నవ్విందో కారణం తెలీక, అయోమయంగా చూశాడు.

"నా పేరు శాంతి" అంది. విజయ్ విసుగ్గా చూశాడు.

"శ్యాంకోసం వచ్చాను" అంది తిరిగి.

విజయ్ ఓసారి తలపంకించి, ఎదురుగావున్న నోట్ బుక్ వంక చూడసాగాడు.

విజయ్ రూమ్మేటు శ్యాంకు చాలామంది అమ్మాయిలతో పరిచయం వుంది. వాడికి పరిచయంవున్న ఏ ఒక్క అమ్మాయితో తనకు పరిచయంలేదు. అసలు వాళ్ళెవరో తను గుర్తించలేదు. కాని వాళ్ళందరికి తాను విజయ్‌గా తెలుసు. తన గురించి శ్యాం వాళ్ళతో చెబుతాడు, చాలాసార్లు తాను మందలించాడు కూడా "నీ గర్ల్‌ఫ్రెండ్స్‌తో నాగురించి చెప్పటం ఎందుకురా ? అసలు మీ యిద్దరి సంభాషణలో నా గొడవెందుకు ?" అని.

తన మాటలకు శ్యాం అదోలా నవ్వి "నాతో ఎప్పుడైనా నిన్నుచూసి అడుగుతారు కద్రా ! అందుకని అయినా నీగురించి నేను చెడ్డగా చెబుతాన్రా ! నువ్వెంతో బుద్ధిమంతుడువని మంచివాడివని వొట్టి మొద్దావతారానివని"

"నేను గదిలో లేకున్నా కాసేపు వెయిట్‌చెయ్యి నా రూమ్మేట్ వొట్టి బుద్ధావతారం. వాడి గురించి నువ్వేం భయపడకు" అని శ్యాం చెప్పిన మాటలు గుర్తుకు రావడంతో నోట్ బుక్ వంకచూస్తూ మవునంగా కూర్చున్న విజయ్‌ని చూస్తుంటే శాంతికి ముచ్చటవేసింది

"అబ్బాయి చాలా బుద్ధిమంతుడు" అనుకుంది.

ఇంతలో శ్యాం వచ్చాడు.

"హలో శాంతి ! ఎంతసేపైందివచ్చి ?" అన్నాడు.

"అరగంట అయింది" అంది

శ్యాంరావడంతో విజయ్‌కు ఏమిటో అంతవరకూ గదిలో గాలి ఆడనట్టు ఇబ్బందిగా ఇరుకుగా వున్న వాతావరణం మారిపోయి మామూలు వాతావరణం ఏర్పడినట్టనిపించింది.

"శాంతీ ! వీడు విజయ్. ఎం.ఎ ఫైనలియర్ నాకున్న మంచి, గొప్ప స్నేహితుడు" అంటూ విజయ్‌ని,

"విజయ్ ! ఈవిడ శాంతి అని మా బాబాయ్‌గారి కూతురు నిన్న నీతోచెప్పాను ఇవాళ వస్తుందని" అన్నాడు.

విజయ్ బిక్కమొహం వేసుకొని చూసాడు అంతలోనే కోపంవచ్చి- 'ఎప్పుడు చెప్పావ్ !' అని నిలదీసి అడగాలనిపించి ఆడపిల్లముందు అల్లరెందుకని మౌనంగా వుండిపోయాడు

విజయ్ అప్పుడప్పుడు కవితలు... కథలు రాస్తాడు శాంతి కాని ... అచ్చువలేదు ఎందుకో తెలుసా పత్రికలకు వీడసలు పంపించడు.

"తిరిగి వచ్చేస్తాయనేనా ?" శాంతి మాటలకు విజయ్ 'మరె' అన్నట్టుగా నవ్వాడు

శాంతి మరి కాసేపు కూర్చుని వెళ్ళిపోయింది.

"రేయ్ ? ఆడపిల్లముందు తెగకోతలు కోస్తున్నావ్. ఆ అమ్మాయి గదికొస్తుందని చెప్పావా నాతో. చెబితే నేనసలు గదిలో వుండేవాణ్ని కాదు" అన్నాడు విజయ్ !

"ఓర్నాయనో... నీమీద ఒట్టురా విజయ్. నీతో చెప్పాను శాంతి వస్తుందని. మరిచిపోయావేమో బాగా గుర్తుచేసుకో ?" అన్నాడు శ్యాం.

"నిజంగానా ?"

"నామీద ఒట్టురా"

"మరి నాకెందుకు గుర్తులేదు ?"

## భార్య ఖరీదు !




మహాభారతంలో పాండవులు ద్రౌపదిని జూదంలో ఓడిపోయినట్లుగానే.... బంగ్లాదేశ్ లోని రంగాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన భార్యను తాను చేసిన నూట ఇరవయి రూపాయల అప్పు తీర్చలేక అమ్మివేశాడట ! అయితే ఆ ఇల్లాలు భయంతో వణికిపోతూ పారిపోయి ఇరుగుపొరుగు వారికి విషయాన్ని మొరపెట్టుకొంది చుట్టుపక్కల వారంతా రంగంలోకి దిగి, చందాలువసూలు చేసి ఆ నూట ఇరవై రూపాయల అప్పునూ తీర్చివేసి పుణ్యం కట్టుకొన్నారట ! అలా ఈ కథ సుఖాంతమయింది.

-జూపిటర్

"ఎందుకంటే-"

"ఊఁ..."

"తిట్టకూడదు..."

"ఊహుఁ..."

ఇటువంటి విషయాల్లో నీమైండ్ కొంచెం టూబ్ లైటులా పనిచేస్తుంది. "రేపు శాంతి వస్తుంది అని నేను చెపితే- ఇప్పట్లో రాదు అన్నావు నువ్వో" అన్నాడు

విజయ్ నోరు తెరిచాడు.

"హాయ్ విజయ్!"

లైబ్రరి మెట్లు ఎక్కుతున్న విజయ్ ఉలిక్కిపడుతూ ఆగిపోయి పిలుపు విన్పించినవైపు చూసాడు.

శాంతి

లేత నీలిరంగు పూలున్న పంజాబిడ్రస్సులో ముద్దుగావుంది. మెడలమీదుగా ముందుకు వేసుకున్న దుపట్టాను గుండెలమీదుగా సర్దుకుంటూ, చెంగుచెంగున మెట్లన్ని ఎక్కి పైకి వచ్చి.

"లైబ్రరికేనా?" అంది.

"ఊఁ" అన్నాడు విజయ్.

"పదండి!" అంది.

మౌనంగా మెట్లెక్కుతున్నాడు విజయ్.

"మీకు ఏమాత్రం టైం దొరికినా, లైబ్రరిలో గడుపుతారని శ్యాం చెప్పాడు" అంది.

'అయితే ఏమిటన్నట్టుగా' కళ్ళెత్తిచూసాడు.

"లైబ్రరికి తప్ప మరెక్కడికి వెళ్ళాలన్పించదా మీకు?" అంది.

"ఊహుఁ" అన్నాడు.

"బి.సి" అంది మెల్లిగా.

"ఊఁ..." అన్నాడు విజయ్ విన్పించినా విన్పించనట్టు.

"గుడ్ బయ్..." అంది.

"మీ పూర్తిపేరు విజయ్‌రాముడు కదూ!" అంది.

"కాదు..."

"కాని అయితే బావుండేది"

"ఎందుకు?"

"రాముడు చాలా బుద్ధిమంతుడుకదా!"

"ఎవరు చెప్పారూ?"

"నేనే అంటున్నాను"



"శ్యాంకు మీరొక్కరేనా చెల్లీ"

"ఊఁ అవును" అంది తల ఎగురవేస్తూ.

"ఓ..." అన్నాడు తలపంకిస్తూ.

"ఏం ?"

"మా చెల్లి శూర్పణఖ అంటేనూ" అంటూ తలెత్తి చూసాడు.

శాంతి కోపంగా చూస్తూ ఆగిపోయింది.

విజయ్ ముందుకు వెళ్ళిపోయాడు.

"నీమీద ఒట్టు! నేనెప్పుడలా వాడితో నీగురించి చెప్పలేదు. అసలు వాడి

గురించి అందరికీ చెప్పడం తప్ప యింకెవరి గురించి వాడితో చెప్పను, వాడసలు వినడు. విన్నా గుర్తుండదు" అన్నాడు శ్యాం, శాంతితో.

"అయితే అతను అబద్ధాలకోరై వుంటాడు" అంది.

"కాదు వాడు హరిశ్చంద్రుడికి తాతలాంటివాడు"

"మరి..."

"నిన్ను వొదుల్చుకోవాలని అలా అనివుంటాడు తప్ప"

"ఊఁ...అయితే నేను శూర్పణఖనన్నమాట" అంది కోపంగా.

"నువ్వేమన్నావ్ వాడిని? అయినా వాడసలు ఉత్తినే నోరుజారడు...మరి నిన్ను ఎలా అన్నాడో ఏమిటో?" అన్నాడు అమాయకంగా.

"ఎలా అనడం ఏమిటి? మొహంమీద ఈడ్చికొట్టినట్టు అన్నాడు" అందికసిగా,

"నువ్వేమీ అన్లేదా?" భయపడుతూనే అడిగాడుశ్యాం.

"ఊహుఁ అతడు చాలా బుద్ధిమంతుడన్నాను అంతే" అంది.

"అదీ సంగతి! ఆ అనేదేదో మామూలుగా అన్నావా? వ్యంగ్యంగా అన్నావా?"

"అంటె—" కోపంగా చూసింది.

"అలా చూడకె శాంతీ! అయినా అతని జోలి నీకెందుకు? నువ్వసలు అతడితో ఎందుకు మాట్లాడ్డం" అన్నాడు.

"నేనేం అతని జోలికెళ్ళలేదు ఒకటికి రెండుసార్లు నువ్వే అతని గురించి చెబితె పలకరించాను తప్పా?"

"తప్పా తప్పున్నరా? వాడేం జులాయివెధవ, అల్లాటప్ప వెధవ అనుకున్నావా? ఆడపిల్ల పలకరించగానే వంకర్లుతిరిగిపోడానికి వాడు విజయ్. నా ఫ్రెండు. ఫ్రెండంటె ఫ్రెండ్ వాడికి సాటి రారెవరు!" అంటూ శ్యాం మొదలుపెట్టేసరికి ఆ వాక్ప్రవాహం యిప్పుడప్పుడే ఆగదని తెలిసి చిరాకుపడిపోతూ వెళ్ళిపోయింది శాంతి.

మరోసారి.

"హలో విజయ్!" అంది శాంతి.

చింతచెట్టు నీడలో పచ్చటి గడ్డిమీద వెల్లకిలా పడుకుని రెండు అరచేతులను తలక్రింద దిండులా పెట్టుకొని, కళ్ళు మూసుకొని, ఆలోచిస్తున్న విజయ్ కళ్ళు తెరచి చూసాడు.

ఎదురుగా శాంతి.

"హలో..." అన్నాడు.

"నేను కూర్చోవచ్చా" అంది.

"ఊఁ" అన్నాడు.

"ఇవాళ లైబ్రరి కెళ్ళలేమా?" అంది ముందుకుపడ్డ రెండు జడలను వెనక్కి వేసుకొని సర్దుకుని కూర్చుంటూ.

"ఊహుఁ"

"ఏం..."

"ఏ.సిలో వుందామని" అన్నాడు నిన్న తనని బి. సి. అనడం గుర్తుకొచ్చి

"అంటె"... అంది గతుక్కుమంటూ.

"చల్లటి ఈ గాలిలో కాసేపు"

"ఓహో"

"మీరేమిటి యిలావచ్చారు"

"రాకూడదా ?"

"ఊహుఁ" అంటూ చటుక్కున లేచి కూర్చుంటూ—

"ఎందుకు రాకూడదూ... రావొచ్చు" అంటూనే లేచి నిలబడుతూ, క్రింద పడివున్న తన పుస్తకాలు అందుకుంటూ, "వస్తానండి" అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు.

అతని ప్రవర్తనకు విస్తుపోతూ చూసింది శాంతి.

"హాయ్ శాంతీ !"

---

## చల్ల కోసం సంగీతం



పద్మనాభం సత్‌బ్రాహ్మణ కుటుంబంలో పుట్టినవాడవ్వడం వలన చిన్నప్పటినుంచీ భజన కార్యక్రమాల్లో పాల్గొంటూ వుండేవాడట. ఎక్కడ ఏదయినా పురాణ కాలక్షేపం జరిగినా, గోష్ఠి కార్యక్రమాలు జరుగుతున్నా తప్పకుండా హాజరయ్యేవాడట ఎండాకాలంలో మజ్జిగ (చల్ల) కోసం ఎవరింటికయినా వెళితే అందరూ పద్మనాభంని పాట పాడమని పట్టుపట్టేవారట. పద్మనాభం పాట భజన కార్యక్రమాల్లో పాల్గొంటే ఆరోజు భజన హుషారుగా, దీర్ఘకాలం పాటు కొనసాగేదట

చేసేదిలేక నాలుగుపద్యాలు రెండుపాటలు పాడేసి, వాళ్ళను పరవశుల్ని చేసి, ఒక కుండనిండా మజ్జిగతో బయటపడేవాడట. అలా ప్రతిరోజు చల్లను సంపాదించేవాడట 'చల్ల' కోసం సంగీత సాధన విరివిగా చేసేవాడట. అలా సంగీతం పట్టుపడి, కర్ణాటక సంగీతంలో నిష్ణాతుడుగా మనగలిగిన కీ॥ శే॥ రఘురామయ్యగారి శిష్యరికం సంపాదించేడట! గుడ్‌లక్—సంగీత సాధకుడు అంచెలంచెలుగా హాస్యరస చక్రవర్తి అయ్యేడు! ఎంతవింతగ ?

—క్రికెట్

---

"హలో బ్యూటీ ?'' ఎవరెవరో పలకరించడం చూసి తనూ లేచి బయలుదేరింది.

"మీ ఫ్రెండుకు నేనంటే భయం'' అంది శాంతి గర్వంగా నవ్వుతూ.

శ్యాం పెదవి విరుస్తూ ''కాదు ఆడవాళ్ళంటేనే భయం అన్నాడు"

"నేనంటే మరీ ఎక్కువ అంది"

"శ్యాం ! నీతో ఓ విషయం చెప్పాలిరా !'' అన్నాడు విజయ్ మంచంమీద పడుకున్న శ్యాంతో

"ఏమిటి ?"

"మీ చెల్లాయికి కొంచెం వెర్రి... అదే వేపకాయంత పిచ్చి వుందని నా అనుమానం. కొద్దిగా వున్నప్పుడే మంచి డాక్టరుచేత పరీక్ష చేయిస్తే మంచిదని నా అభిప్రాయం" అన్నాడు.

శ్యాం విజయ్ మొహంలోకి పరీక్షగా చూసాడు.

సీరియస్‌గా చెబుతున్నాడు విజయ్.

"ఎందుకు ?" అన్నాడు అసలు విషయం అర్థంకాక అయోమయంగా.

"నాకూ అనిపిస్తోంది ఆ అమ్మాయి ధోరణి చూస్తే !" అన్నాడు.

"ఒరెయ్ పిచ్చిగా వాగకు. శాంతి చాలా మంచి అమ్మాయి"

"నేను చెడ్డదని అన్లేదు''

"పిచ్చిది కూడ కాదు" అన్నాడు శ్యాం.

"పూర్తిగా కాదు కొంచెం"

"ఆ కొంచెం నీలో కూడా వుంది."

"ఆ కొంచెంలో ఓ రెండు మోతాదులు ఎక్కువ నీలో వుంది. రోజూ ఆ అమ్మాయితో నా గురించి చెప్పడం ఎందుకు ? ఆ అమ్మాయికే కాదు, చాలా మందితో నా గురించి చెబుతావు ఎందుకు ? ఏం వుంటాయి నా గురించి చెప్పడానికి ?"

"నువ్వు చెప్పావే అనుకో ! చాలామంది అమ్మాయిల్ని విని వూరుకోక, పనిగట్టుకొని పరిచయం పెంచుకోవాలనుకునే వారంటే నా కిష్టం వుండదు. మీ చెల్లాయి పలకరిస్తోంది కాని చాలామంది అమ్మాయిలు నన్ను వింత మనిషిలా చూడ్డం. నా కిష్టం వుండదు" అన్నాడు.

శ్యాం మాట్లాడలేదు.

అతనికి ఆశ్చర్యంగా వుంది.

ఇంత చిన్న విషయానికి అతనంతలా బాధపడతాడని అనుకోలేదు "టూ సెన్సిటివ్" అనుకున్నాడు.

ఇవాళ నీ ప్రోగ్రాం ఏమిటా విజయ్? శ్యాం ప్రశ్నకు గడ్డం గీసుకుంటున్న విజయ్ "ఊహూం" అన్నాడు ఏమీ లేదన్నట్టుగా.

"గదిలోనే వుంటావా?"

"ఊఁ...ఏంటి"

"నేను బయటికి వెళ్తున్నాను. సాయంత్రానికి కానీ రాను" అన్నాడు

"సరే" అన్నాడు అద్దంలోకి చూస్తూ, రెండోసారి బుగ్గలకు సబ్బు రాసుకుంటూ.

"రాగిణితో పిక్నిక్‌కు వెళ్తున్నాను!" అన్నాడు.

"ఊఁ...పరీక్షల ముందు ఏం పిక్నిక్‌రా?"

"పరీక్షలు మరో రెండు నెలలున్నాయ్ బ్రదర్! కావాలంటే నువ్వు చదువు. క్లాసుకోసం ప్రాకులాడేవాడివి. నేను ప్యాసయితే పదివేలు" అన్నాడు హడావిడిగా లేస్తూ.

విజయ్ గడ్డం చేసుకోవడం పూర్తిచేసి, స్నానంచేసి వచ్చేసరికి శ్యాం దిగులుగా కూర్చున్నాడు


"వెళ్ళవేరా?

"నీతో ఓ అర్జంటు విషయం. ముఖ్యంగా మాట్లాడాలి. కాదు కాదు ముఖ్యమైన విషయం అర్జంటుగా మాట్లాడాలి" అన్నాడు

"ఏమిటో"

"ఒక్క ప్రశ్న వేస్తాను. చాలా సూటిగా చెప్పెయ్యాలి సుమా! ముందు అలా కూర్చో" అన్నాడు

తడి తలను టవల్‌తో తుడుచుకుంటూ, "నిలబడే ఫర్వాలేదు నిలబడే వింటాను కాని ముందు చెప్పు" అన్నాడు విజయ్.



"నేనేదో జోక్ చేస్తున్నాననో మరేదన్నా అనుకోకు. ఈ రోజు...కాకపోతే రేపు నువ్వీ సమస్యను ఎదుర్కోవాలి. అందుకే నువ్వు ఆలోచించుకోవడానికి టైమ్ ఇస్తున్నాను" అన్నాడు.

"సరేగాని ఆ చెప్పేదేదో సూటిగా చెప్పి ఏడువ్వ?" అన్నాడు విజయ్!

శాంతిపట్ల నీ అభిప్రాయం ఏమిటి?" అన్నాడు.

"మంచి అమ్మాయి. తొందరపాటెక్కువ. ఆలోచన తక్కువ. అంతే. అంతకు మించి మరేం లేవు"

"మరేం అంటె..."

"భయం, సిగ్గు లాంటివి" అన్నాడు.

"కాని...శాంతికి నీపట్ల ఓ అభిప్రాయం వుంది.

"నాకు తెలుసు"

"ఏమిటి? ఏం తెలుసు?" గాబరాగా అడిగాడు శ్యాం.

"ఆవిడంటె నాకు భయం అని, నేనొక పుస్తకాల పురుగునని, అపర ప్రవరుణ్ణని"

"కాదు..."

"మరి..."

"శాంతి నిన్ను ప్రేమిస్తోంది" శ్యాం చటుక్కున చెప్పాడు.

విజయ్ చేతిలోని టవల్ జారిపోయింది.

"అవున్రా విజయ్! ఎన్నాళ్ళుగానో బాబాయ్ శాంతికి చేయాలనుకుంటున్న సంబంధాన్ని కాదంది శాంతి. అసలు తనకు మరే సంబంధాలు చూడవద్దని ఖచ్చితంగా బాబాయ్‌తో చెప్పింది తాను ఓ అబ్బాయిని ప్రేమిస్తున్నానని, అతణ్ణితప్ప మరెవ్వరిని పెళ్లాడనని చెప్పింది. ఆ అబ్బాయి ఎవరో చెప్పమంటె మాత్రం-ఆ అబ్బాయికి తన పట్ల గల అభిప్రాయం ఏమిటో కనుక్కొని అప్పుడు చెబుతానంది. ఆ అబ్బాయి ఎవరో బాబాయి గ్రహించకపోయినా నేను అర్థంచేసుకోగలను ఆ అబ్బాయివి నువ్వే నిజంరా విజయ్! పైకి నిన్ను ఆట పట్టించాలని అలా మాట్లాడినా, మనసులో మాత్రం నీ పట్ల ఆరాధన, అనురాగం అపై నీ యిష్టం"

"శాంతి గురించి నేను అంతగా చెప్పడం బాగుండదు కాని ఒక్క విషయం. శాంతికి తొందరపాటు ఎక్కువ, ఆలోచన తక్కువ అని అన్నావు. నిజమే. కాని, నీ విషయంలో కూడా అలాగే తన అభిప్రాయాన్ని తీసుకుందని మాత్రం అనుకోకు."

"శాంతి చాలా మంచి అమ్మాయి. అల్లరితోపాటు అమాయకత్వం వున్నాయ్. దాన్ని మించిన మొండితనం వున్నాయ్! నువ్వు కాదంటే, శాంతి భరించలేదు. వాళ్ళింట్లో వాళ్ళు ఒప్పుకోకపోయినా సహించదు"

"అందుకే శాంతి విషయంలో నువ్వొక నిర్ణయానికి వచ్చేముందు, బాగా ఆలో

చించుకో! బాబాయ్‌కి ఒక్కగానొక్క కూతురు. బాబాయ్ కాదనడు. ఒకవేళ అన్నా, శాంతి ఎదురుతిరుగుతుంది."

"యిక నీ గురించి శాంతికి నేనంతా చెప్పాను. అంతా తెలిసే, తను ఈ నిర్ణయానికి వచ్చింది."

"నేను వెళ్తారా! ఇప్పటికే చాలా ఆలస్యమైంది. ఇవాళంతా ఒంటరిగా వుంటావు కదా అని నీ మనసుకు మెదడుకు మేత పెట్టి మరీ వెళ్తున్నాను. వస్తా!" అంటూ శ్యాం వెళ్ళిపోయాడు.

విజయ్ చాలా సేపటివరకూ తేరుకోలేకపోయాడు.

శాంతి తత్వం ప్రవర్తన చూసి, తనను అల్లరి పెడ్తుందనుకున్నాడే తప్ప... యిలాంటి పరిస్థితి తాను ఎదుర్కోవాల్సి వస్తుందని అనుకోలేదు.

నిజానికి శాంతిపట్ల తనకు ఎలాంటి అభిప్రాయంలేదు. ఒక్క శాంతేకాదు... అసలు ఏ ఆడపిల్లపట్లలేదు. ప్రేమ అన్న భావన, పెళ్ళి గురించి ఆలోచన తనలో రాలేదు దానిక్కారణం... తన భావిమీద తనకున్న కోర్కె ... ప్రస్తుతంలో తాను ఉన్న పరిస్థితి.

"హాయ్! విజయ్!" చెవి ప్రక్కనే విన్పించడంతో, సీరియస్‌గా చదువుకుంటున్న విజయ్ ఉలిక్కిపడ్డాడు. లైబ్రరిలో నిశ్శబ్దం రాజ్యం చేస్తోంది అందుకే చాలా మెల్లగా చెవిదగ్గర పిలిచింది శాంతి.

విజయ్ ప్రక్కనే కుర్చీలో కూర్చుంటూ– "ఏం చదువుతున్నారూ?" అంది.

విజయ్ పుస్తకం వంక ఓసారిచూసి, ఆమెవైపు తిరిగాడు.

"ప్చ!" అంటూ నిట్టూర్చి–"మీతో మాట్లాడాలి అలా ఓసారి బయటకు వస్తారా?" అంది.

---

## పూర్




విదేశాలనుండి వచ్చిన ఓ మిత్రుడికి హిందీ సినిమా తారల గురించి చెబుతున్నాడు చిన్మయానందం.

"రాజ్‌కపూర్, రిషికపూర్, శశికపూర్, షమ్మీ కపూర్..." అని చెబుతున్న చిన్మయానందకి అడ్డుపడి

"మీ ఇండియా ఎంత పూర్ కంట్రీ అయితే మాత్రం పేర్ల చివర్న అలా పెట్టుకోవాలా?" ప్రశ్నించాడు ఆ విదేశీ మిత్రుడు

– [illegible] (కర్నూలు)

---

విజయ్ గుండె ఎందుకోగాని వేగంగా కొట్టుకోవడం మొదలుపెట్టింది.

"మీ కిష్టం లేకపోతే రావొద్దు !" అంది.

"అదికాదు..."

"ఓహ్...అయితే రావాలనేవుంది కాని ఆలోచిస్తున్నానంటారా ?"

"ఊహుఁ..."

"దెన్...కమాన్ యూ..." అంటూ చనువుగా విజయ్ చేతిని అందుకుని దారి తీసింది

విజయ్ అనుసరించాడు.

అతనెప్పుడూ కూర్చునే చెట్టుక్రిందకి వెళ్ళారు.

"ఊఁ...చెప్పండి" అన్నాడు రెండు చేతులు కట్టుకుని కూర్చుంటూ. "రేడీయేనా !" అంది విజయ్ ధోరణిచూసి.

"ఊఁ..." అన్నాడు ఓ నిర్ణయానికి రాని ఆలోచనలతో.

"ఎల్లుండి మేమంతా పిక్నిక్ వెళ్తున్నాం! మీరు మాతో వస్తున్నారు" అంది.

"ఇదేనా మీరు చెప్పాలనుకున్నది"

"ఊఁ...కాక మరేమిటనుకుంటున్నారు !" అంది నవ్వుతూ.

"మేమంతా అంటె ఎవరెవరూ?"

"నేను, శ్యాం...రాగిణి, మీరు"

"ఓహ్...శ్యాంగాడి ప్రోగ్రామా! ఆరోజు నాకు"

"నో...నేను శ్యాం పందెం వేసుకున్నాం! రెండొందలు నేను ఓడిపోవడం మీకిష్టమైతే రాకండి. లేదా వస్తారు! ఎల్లుండి తొమ్మిదింటికి...ఉదయం రెడీగా వుండాలి" అంటూ వెళ్ళిపోయింది.

శాంతి వెళ్ళిపోయాకా చాలాసేపటి వరకు తన ఆలోచనల్నుంచి తేరుకోలేకపోయాడు విజయ్

ఆరోజు...శ్యాం చెప్పింది నిజమేనా? లేకా...తనను ఓ ఆట ఆడించాలని అలా అన్నారా? శాంతి ధోరణి చూస్తే అలా లేదు. తనమీద ఆ అమ్మాయికి ఎలాంటి అభిప్రాయం వున్నట్టులేదు

వెర్రివాడా! అలా అయితే పిక్నిక్కు నన్నెందుకు పిలిచినట్టు! శ్యాంతో ఏ ధైర్యంతో పందెం వేసింది? నువ్వు రావని తెలిసికూడా ఎంత చొరవగా వచ్చి అడిగింది వాళ్ళు ముగ్గురె ఎందుకు వెళ్తున్నారూ? వెళ్తూ నిన్నెందుకు రమ్మన్నారూ ఆలోచించవేం? అంది మనసు

ఏమో! ఊరికే...స్నేహంగా...ఆ స్నేహాన్ని శ్యాం మరోలా అర్థం చేసుకో లేదు కదా!

అలాంటప్పుడు పెళ్ళి సంబంధాన్ని ఎందుకు కాదన్నట్టు?

మరెవరినైనా...

అయితే అతణ్ణి పిక్నిక్‌కు పిలవక నిన్నెందుకు పిలుస్తుంది?

మరి...

అది అంతే. అంది మనసు నోరుమూస్తూ.

విజయ్ తిరిగి ఆలోచన్లో పడ్డాడు. విజయ్ పిక్నిక్‌కు వెళ్ళలేదు.

"రేపు శాంతి బర్త్‌డే! పార్టీకి నువ్వు రావాలి" అన్నాడు శ్యాం! బయటికి వెళ్ళిపోతున్న విజయ్‌తో.

విజయ్ మాట్లాడలేదు.

"మాట్లాడవేరా?"

"సారి శ్యాం! రేపు సాయంత్రం నేను అర్జంటుగా ఓ చోటుకు వెళ్ళాలి?" అంటూ వెళ్ళిపోయాడు.

అతను రాడని ముందుగానే శ్యాంకి తెలుసు. అందుకె ఎక్కువగా బలవంతం చేయలేదు. విజయ్ తత్వం ఎలాంటిదో తెలిసిన శ్యాం అతను రాకపోవడానికి అంతగా బాధ పడలేదు కాని, శాంతి మాత్రం లోలోవె బాధపడిపోయింది.

"విజయ్‌కి నేనంటె కోపం అనుకుంటాను అన్నయ్యా!" అంది.

"...వాడు చాలా మంచివాడు శాంతి! వాడికి కోపం రాదు. నువ్వన్న ఏ మాట ... మనసులో పెట్టుకొని ఉండడు కాని, వాడి తత్త్వమే అంత! ఎవరితో



## పాపం....చైనా

చైనా దేశం జనాభాసమస్యతో సతమతమవుతోంది. ప్రస్తుతం ఆ దేశ జనాభా వందకోట్లను దాటింది. ప్రస్తుత జనాభా పెరుగుదలను బట్టి 2000వ సంవత్సరానికి ఆ దేశ జనాభా 130కోట్లను దాటుతుందట! కనీసం ఆ సంఖ్యను 120కోట్ల వద్దనయినా ఆపడానికి ఆ ... కష్టపడ్తోందట! అంటే ప్రస్తుతం ప్రతి నెలా పుడ్తున్న పదిహేడు మిలియన్‌ల పిల్లల సంఖ్యను పదిన్నర మిలియన్‌లకు తగ్గించాలనే ధ్యేయంతో చైనా అధికార్లు ఉన్నారు! చైనాలోని కుటుంబ సంక్షేమ సంస్థలూ, స్థానిక ప్రభుత్వ సంస్థలూ గర్భవతిగా ఉన్నస్త్రీలను గుర్తించి వారికి తీసికోవలసిన జాగ్రత్తలు చెప్పడం కుటుంబ నియంత్రణ వల్ల కల్గే లాభాలను నూతన దంపతులకు తెలియజేయడం చేస్తున్నారట! చూశారా ఎన్ని కష్టాలో చైనా ప్రభుత్వానికి!

-జూపిటర్

కలవడు. నలుగురి మధ్య ఉండలేడు. ఒంటరిగా ఉండడానికి ఎక్కువగా యిష్టపడతాడు. యిలాంటి పార్టీలు అవి అంటె వాడికి ఇంటరెస్టు వుండదు. అంతే తప్ప వాడు నీమీద కోపంతో కాదు. రావడం మానుకోవడం" అన్నాడు.

శాంతి కెందుకో అతని మాటలు నిజమనిపించినా, మనసులో ఏమూలో అతడు రాని లోటు, రాలేదన్న బాధ కలిగి కనిపించసాగాయి.

ఆ మర్నాడు అతడ్ని వెతుకుతూ బయలుదేరింది. ముందుగా లైబ్రరీకి వెళ్ళింది. అక్కడ కన్పించక పోవడంతో, అతను ఎప్పుడూ కూర్చునే, చెట్టుక్రింద చూసింది కన్పించలేదు. రెండు రోజులు వరసగా కన్పించలేదు విజయ్.

మూడో రోజు ఆదివారం కావడం వల్ల, మెల్లిగా అతని గదికి వెళ్ళింది.

వెళ్ళేసరికి శ్యాం లేడు

విజయ్ ఎక్కడికో వెళ్ళడానికి తయారవుతున్నాడు శాంతిని చూస్తునే, పలకరింపుగా చూసి, "కూర్చోండి శ్యాం! వచ్చేస్తాడు" అంటూ తయారవసాగాడు.

"మీరు...ఎక్కడికైనా"

"అం...ఫర్వాలేదు మీరుండండి! శ్యాం వచ్చేస్తాడు"

"నేను మీతో మాట్లాడాలని వచ్చాను" అంది శాంతి.

విజయ్ ఉలికిపాటుగా చూస్తూ, "నాతోనా?" అన్నాడు.

"ఊం...నేనంటే మీకు చాలా కోపంకదూ!" అంది.

"ఊం...ఊహుం...మీరు ఎందుకలా అనుకుంటున్నారు?" అన్నారు ఆమెవంక చూస్తూ.

"మొన్న మావెంట పిక్నిక్‌కు ఎందుకు రాలేదూ?" అంది.

"ఓహ్...అదా...నేను ముందే చెప్పాను, నాకు వీలుకాదని. శ్యాంతో రావడం కుదరదని చెప్పాను"

"అయినా నేను రమ్మనేకదూ చెప్పాను" అంది ఎంతో అధికారం వున్నట్టుగా.

విజయ్ అర్థం కానట్టు చూశాడు.

"నాపట్ల మీకు మంచి అభిప్రాయం వున్నట్టులేదు" అంటె టేబుల్‌మీద చేతో రాస్తూ.

"ఆహా...అలాంటిదేం లేదండి" తత్తరపడుతూ అన్నాడు.


"మరి...నామీద మీ అభిప్రాయం ఏమిటి?" అంది నిలదీస్తున్నట్టుగా.

"ఊం...ఊహుం..."

"ఏంలేదూ?" అంది వణికే కంఠంతో.

విజయ్ కళ్ళుతిప్పి చూశాడు. శాంతి కళ్ళలో పలుచటి నీటితెరలు.

ఎందుకు? శ్యాం చెప్పిందే నిజం. తన ఊహ. ఆలోచన అంతా అబద్ధం. శ్యాం చెప్పినట్టుగానే శాంతికి తానంటే ఇష్టం. మరి తన అభిప్రాయం...



శాంతి...మీరంటే నాకు...నాకుకూడా ఇష్టమే! అంటూ చెప్పబోయాడు.

కాని అప్పటికే శాంతి వెళ్ళిపోయింది

గదిలో ఒంటరిగా మిగిలిపోయాడు విజయ్.

* * *

ఆ మర్నాడు-

తనను చూసికూడా లైబ్రరి మెట్లుదిగి గబగబా వెళ్ళిపోయి శాంతిని పిలిచారు విజయ్

''నన్ను పిలిచారా... ఎక్కడో పిడుగుల వర్షం పడుతుంది'' అంది శాంతి

జవాబుగా నవ్వాడు

నా మీద కోపంగా వుందా మీకు ?

ఊహు అంది శాంతి ఉందన్నట్టుగా.

ఊహూం అంటూ, ఉందన్నట్టు తలాడించడం అర్థంగాక, రెండు జవాబుల్లో ఏది సరైందో అర్థంకాలేదు విజయ్‌కు

మీతో ఓ విషయం చెప్పాలి

చెప్పండి అంది

యిక్కడేనా

ఊం... విజయ్ చుట్టూ ఓసారి చూసి

"మీమీద నా కెలాంటి అభిప్రాయం వుందో నిన్న సరిగ్గా చెప్పలేక పోయాను"

"ఓ. కె యిప్పుడు చెప్పండి"

"నేను చెప్పేలోగానే మీరు వెళ్ళిపోయారు"

"ఏది నేను వెళ్ళంది" అంది చిలిపిగాచూస్తూ

"శాంతి ! ఐ లవ్ యూ'' అన్నారు చటుక్కున

శాంతి కళ్ళు పెద్దవిచేసి ''ఎంత ధైర్యం'' అంది.

విజయ్ బిక్కమొహం వేసి శాంతి కళ్ళలోని అల్లరిని చూసి, నవ్వేసారు

ఆ రోజునుండి వారిద్దరి మధ్య స్నేహం పెరిగి పెరిగి చివరికి నెలలోగానే పెళ్ళి వరకు వచ్చింది. ఈలోగా పరీక్షలు అయిపోయాయి.

సాయంత్రం ఆరు గంటలు కావొస్తోంది.

వేసవికాలం కావడం మూలానా యింకా వెలుగుగానే వుంది. బీచ్‌లో అందరికి దూరంగా ఇసుక మీద వెల్లకిలా పడుకొని, "ఆజారె....అబీ మేరాదిల్ పుకారా" అంటూ ముకేష్ పాటను మెల్లగా పాడుకుంటున్న విజయ్ ఎవరో వచ్చి తనకు దగ్గరగా నిలబడ్డట్టు అన్పించడంతో కళ్ల తిప్పిచూసి ఏమిటన్నట్టుగా కనుబొమలు ఎగురవేసాడు.

అతను-

ఫుల్ సూట్‌లో హుందాగా వున్నాడు. అతని కళ్ళజోడు మొహానికి గంభీరతను

పెంచితే అతని పెదవుల మధ్య వున్న సిగార్ మరింత హుందాతనాన్ని పెంచుతోంది. అతని మొహంలో, చూపుల్లో ఏ మాత్రం మృదుత్వం కన్పించలేదు

'ఊం...విజయ్ అంటే నువ్వేనా?'

'నా పేరు విజయ్! కాని...మీకు కావల్సిన విజయ్‌ని నేనో కాదో నాకు తెలీదు. ఎందుకంటే నేనెప్పుడు మిమ్మల్ని చూళ్ళేదు-'' విజయ్ జవాబుకి అతడు చిత్రంగా కనుబొమలు ఎగురవేస్తూ-''అతి తెలివి చూపించకు. మా శాంతికి తెలిసిన విజయ్‌వి నువ్వేనా!''

'ఓ...శాంతి...ఊహూఁ-నేనే...ఏం కావాలి?'' అన్నాడు అలాగే పడుకొని.

''నాతోరా...'' రెండడుగులు వేసాడు.

విజయ్ అలాగే పడుకుని చూస్తున్నాడు అటువైపు

''కమాన్...''

'నేనేం మీ నౌకరుననుకున్నారా? లేక పెంపుడు కుక్క ననుకున్నారా? మర్యాద తెలీని పెద్ద మనిషివి...ఎదుటి వ్య క్తిని పిలిచే తీరు తెలీదు...అలాంటి నీ వెంట పిలవగానే వస్తాననుకున్నావా?'' మఠం వేసుకుని కూర్చుంటూ అడిగాడు విజయ్

అతనవేం పట్టించుకోకుండా ''నాతోరా'' అంటూ కదిలాడు

అతను జవాబు చెప్పకుండా గబగబా ముందుకు సాగాడు. విజయ్ కదలకుండా

---

## పెళ్ళికంటే ఫోను బిల్లే ఎక్కువ?



రాధిక ప్రతాప్‌పోతన్‌ని పెళ్ళి చేసుకొని ఈ మధ్యనే రిసెప్షన్‌కి పిలిచింది అందరికీ స్వీటు, హాటు పెట్టి, స్వీటుస్వీటుగా నవ్వుతూ జోక్స్ కట్ చేయ సాగింది.

ప్రతాప్‌పోతన్ కూడా వచ్చీరాని మాటలతో తెలుగులో పచ్చిపచ్చిగా మాట్లాడుతూ ఎంటర్‌టైన్ చేయ సాగాడు

"రిసెప్షన్ గ్రాండ్‌గా ఎరేంజ్ చేశారు? ఎంత ఖర్చయింది?" అని అడిగాను అందుకామె పువ్వులా నవ్వుతూ.

రిసెప్షనకి రాధిక ఎలా 'ప్రతాప్‌ని' ప్రేమించేందుకు ఫోను బిల్లులకయిన ఖర్చు నాలుగయిదు లక్షలుంటుంది. నిజం చెప్పాలంటే మా మనసులు కలిసింది ఫోనుల్లోనే!" అంది అర్ధమయినట్టు పెళ్ళికొడుకు పోజులో నవ్వేశాడు ప్రతాప్‌పోతన్

— కటిక్

---

నిలబడి అతనివంక చూడసాగాడు. విజయ్ తనని అనుసరించడం లేదని తెలిసి అతను వెనక్కి తిరిగి చూసాడు. విజయ్ నిర్లక్ష్యంగా చూస్తూ-

"మీరెవరో తెలీకుండా మీతో నేను వస్తానని ఎలా అనుకున్నారు?" అన్నాడు విజయ్.

"శాంతి ఎవరో తెలుసుకునే మరీ ప్రేమించావా? లేక ప్రేమించానాని అన్నాకా తెలుసుకున్నావా?" తీక్షణంగా అడిగాడు.

"ఓ...ఎమ్.ఎమ్ మీరేనన్నమాట. గ్లాడ్ టూ మీట్‌యూ సార్," అన్నాడు చేయి ముందుకు చాస్తూ. అతను చేయి అందించలేదు సరికదా విజయ్‌వంక తిరస్కారంగా చూసాడు

"శాంతిలో ఏంచూసి ప్రేమించావ్?"

"నాలో ఏంచూసి మీరంత కోపంగా మాట్లాడుతున్నారు?" ఎదురు ప్రశ్నించాడు.

"ప్రశ్నకు ప్రశ్నకు ప్రశ్నే సమాధానం కాదు"

"నిజమే! కాని కొన్ని ప్రశ్నలకు ప్రశ్నలే జవాబులవుతాయి."

"ఊం...తెలివిగా జవాబు యిస్తున్నాననుకుంటున్నావా?"

"మీరు తెలివిగా ప్రశ్నిస్తున్నాననుకుంటున్నారా?"

"షటప్!"

"ఆమాట నేనూ అనగలను కాని...మీకు డబ్బుందన్న అహంవుంది సంస్కారం తప్ప. నాకు నేను మనిషినన్న గర్వంతోపాటు సంస్కారం సభ్యత వుంది" అన్నాడు.

"నాకు తెలుసు! దిక్కు మొక్కులేని వాడంటే ఇలాంటి తిక్కవాడు, రౌడీవెధవ జులాయి అయివుంటాడని. నిజంగా కాలేజిలో చదివావా లేక అబద్ధాలు చెప్పావా?"

"ఆ అలవాటు మీకుందేమో...కాని నాకు లేదు" అన్నాడు

"ఇంతకీ నా ప్రశ్నకు సమాధానం"

"యింతసేపు మాట్లాడినా అర్థంకాలేదా! నాలో ఏంచూసి శాంతి ప్రేమించిందో. అర్థం కాకపోతే అది మీ ఖర్మ... బై" అంటూ విజయ్ వెళ్ళిపోయాడు.

పరీక్షలు అయిపోయాయి. విజయ్, శాంతిలు బాగానే వ్రాశారు. మరో వారం రోజులకు, విజయ్, శాంతిల వివాహం రిజిస్ట్రారు ఆఫీసులో చాలా నిరాడంబరంగా జరిగిపోయింది. కాలేజి స్నేహితులు కొందరు ఆ పెళ్ళికి పెద్దలయ్యారు.

వాళ్ళిద్దరి పెళ్ళి దగ్గరుండి జరిపించి మరీ తన ఊరు వెళ్ళిపోయారు శ్యాం.

విజయ్‌కి ఓ పత్రిక ఆఫీసులో ఉద్యోగం దొరికింది. ఆతని అభిరుచికి తగిన వుద్యోగం. జీతం తక్కువే అయినా విజయ్ సంతృప్తిపడిపోయాడు. ఆ సమయంలో ఆ చిన్న ఉద్యోగమే వాళ్ళ జీవితాలకు ఆధారమైంది.

రెండు నెలలు చాలా ఆనందంగా, హాయిగా గడిచిపోయాయి శాంతితో తన జీవితం యింత మధురంగా ఆనందంగా వుంటుందనుకోలేదు విజయ్ చిన్నప్పటినుండి ఒంటరిగానే

పెరిగాడు  విజయ్ పుట్టగానే తల్లిపోయింది. కొన్నాళ్ళకు లారీ యాక్సిడెంటులో తండ్రి పోవడంతో  అనాథ అయిన  విజయ్ తన స్వశక్తితో,  స్వయంకృషితో చదివి పైకి వచ్చాడు

ఒకప్రక్క ప్రయివేట్లు  చెబుతూనే మరోప్రక్క  కష్టపడి చదివి ప్రతిక్లాసులో మంచి మార్కులు తెచ్చుకుంటూ, స్కాలర్‌షిప్‌లు సంపాదించుకుంటూ ఎమ్.ఎ. పూర్తి చేసాడు విజయ్ జీవితంలో అతనికి చాలాదగ్గరగా సన్నిహితంగా అతని చదివేపుస్తకాలు, ఆ తరువాత శ్యాం, శాంతి వచ్చారు.

కష్టపడి ఉన్నదానిలో  తృప్తిపడడం విజయ్‌కు  ఆలవాటైపోయింది  అందుకే చిన్న ఉద్యోగంతో, అతను తృప్తిపడిపోయాడు. డిగ్రీలు చేతబట్టుకొని నిరుద్యోగులుగా తిరిగే చాలామందికంటె అతను అదృష్టవంతుడని అనుకునేవాడు.


రిజల్ట్సు వచ్చాయి. విజయ్ క్లాసుతో ప్యాసయ్యాడు. శాంతి పరీక్ష పోయింది.

నాకు తెలుసోయ్ శాంతి! నువ్వు మరో పెద్దపరీక్షకు ప్రిపేర్ అవుతూ చదవడం మానేస్తావని...యిప్పుడైనా చదువు పెద్దపరీక్ష ప్యాసయ్యావో ఇదో పెద్ద లెక్క అన్నాడు విజయ్

'ఊహుఁ యిక చదివే ఓపికలేదు'' అంది శాంతి

విజయ్ బలవంతంచేయలేదు

విజయ్, శాంతి అందంగా  అమర్చుకున్న  వాళ్ళ చిన్న  సంసారం...కలతలు



లేకుండా సాగిపోతోంది. వాళ్ళు అద్దెకుండే ఒకే గది విశాలంగా గాలి వెలుతురు వచ్చేలా వుండేది ఇంటావిడ సావిత్రమ్మ విధవ. ఇద్దరమ్మాయిలు ఓ కుర్రాడు ఆవిడ సంతానం.

పెద్దమ్మాయి కళ్యాణికి ఇరవై మూడేళ్లు తరువాత అమ్మాయి కరుణ ఇరవంై వేళ్ళుంటుంది. ఆ తరువాత ఆరేళ్ళ తరవాత రాజు పుట్టాడావిడకు

కళ్యాణి గవర్నమెంటు ఆఫీసులో టైపిస్టుగా పన్జేస్తోంది. కరుణ ఇంకా చదువుతుంటోంది. రాజు స్కూల్ ఫైనల్ ఓసారి తప్పి మళ్ళీ పరీక్షకెళ్ళకుండా రోడ్లు సర్వే చేస్తుంటాడు

కళ్యాణి, కరుణలూ కాంతితో స్నేహంగా మాట్లాడేవారు. విజయ్, కాంతి ప్రేమించి పెళ్ళి చేసుకున్నారని తెలిసి. సావిత్రమ్మ ముక్కుమీద వేలేసుకున్నా, కళ్యాణికి మాత్రం ఆ విషయం ఓ అద్భుతంలా అడ్వెంచర్ అన్పించేది. ఎప్పుడు చూసినా అతి గంభీరంగా వుండే విజయ్ అంటే కళ్యాణికి ఎంతో గౌరవం

మాస్టారూ! అంటూ ఆత్మీయతగా పిలుస్తూ, చాలా మర్యాదగా మాట్లాడే కళ్యాణి ఆత్మీయత, కరుణ అభిమానం విజయ్, కాంతిలకు తోడుగా అన్పించేది. స్నేహంగా తిరిగే వాళ్ళంటే వాళ్ళిద్దరికి అభిమానమే

మరో మూడు నెలలు గడిచాయి విజయ్ పనిచేస్తోన్న పత్రిక, ఆగిపోయింది. ఫలితంగా విజయ్ ఉద్యోగం పోయింది తిరిగి విజయ్ ప్రయివేట్లు వెతుక్కున్నాడు. ఉద్యోగం పోయినందుకు విజయ్ బాధపడ్డా, అంతలోనే మరో ఉద్యోగం వెతుక్కోవడం కష్టమని తెలిసి ప్రయివేట్లు కుదుర్చుకుని జీవితంతో రాజీపడ్డా కాంతికి మాత్రం-విజయ్‌కి పెద్ద ఉద్యోగం దొరక్కపోగా ఉన్న చిన్న ఉద్యోగం కూడా పోయినందుకు బాధ కలిగింది. విజయ్‌లా ఆమె ఆ జీవితంతో రాజీ పడలేకపోయింది

సరిగ్గా అలాంటి క్షణంలోనే ఆమెలో సంఘర్షణ మొదలైంది.

విజయ్‌కి పెద్ద ఉద్యోగం దొరకకపోవడం విజయ్ ప్రయత్నలోపం అనుకుంటే తప్పు—వాస్తవాన్ని పరిస్థితిని అర్థం చేసుకోలేకపోయింది వాళ్ళమధ్య కలతలు ప్రారంభమయ్యాయి

భార్యాభర్తల మధ్య వుండాల్సిన ప్రేమా, అభిమానం, ఒకొరినొకరు అర్థం చేసుకునే సహృదయత లోపించిపోయాయి

అక్కడికి విజయ్ సహనంగా, కాంతి కోపాన్ని, అకారణ ద్వేషాన్ని, అలకను భరించేవాడు. అతనలా సహనంగా భరించడం కాంతికి అతని గొప్పతనంగా కాక, అసమర్థతగా, బలహీనతగా, చేతకానితనంగా కన్పించేది.

ప్రతిక్షణం ఎదుటి మనిషితో వాళ్ళ జీవితం తనను పోల్చుకుంటూ, విజయ్‌ని పోలుస్తూ బాధపడే కాంతిలో అసహనం, అశాంతి పేరుకుపోయాయి

రానురాను విజయ్ ఉనికి భరించనట్టు, ఆ గది ఇరుకుగా నరకంగా అన్పించసాగింది.

శాంతి యిలా ఎందుకు మారిపోతోందో అర్థం అయి బేలగా నవ్వుకున్నాడు విజయ్.

ఇదేనా ప్రేమంటే—యింతేనా? అన్పించేది అతనికి.

పుస్తకాల్లోని ప్రేమ, ఆరాధన...నిజజీవితంలో వుండవేం? పుస్తకాలకే అంకితమా? డబ్బుకు ప్రేమకు లంకె వుందా? అన్పించేది.

ఆస్తినికాదని, అంతస్తును విడిచి, తండ్రిని వొదిలి తనను పెళ్ళిచేసుకోవడానికి సిద్ధపడిన శాంతిలోని ఆనాటి ప్రేమ వెదకినా కన్పించేదికాదు విజయ్‌కు. కలగా, మధుర స్మృతిగా మిగిలిపోయిందా గతం

ప్రేమ నిరంతరం సాగే జీవనదిలాంటిది. ఆకర్షణ అలా కాదు. చిన్న గిన్నెలో నిండుగా పాలుపోసి పొంగించినట్టు, నెలరోజుల్లో స్నేహం ప్రేమ, పెళ్ళి జరిగి ఆవేశం ఆరాటం కలిపివేసిన ఆ బంధానికి...ఆయువు...ఎంత?

చిన్నగిన్నెలో ఎక్కువ పాలు ఎలా వుండకుండా పొంగిపోతాయో ఇది అంతే అయింది

శాంతికి సుదర్శనం పరిచయం అతిసామాన్యంగా జరిగినా ఆమె జీవితాన్ని మరో మలుపు తిప్పింది.

సుదర్శనం డాక్టరు. ఆ వీధిలోనే క్లినిక్ వుంది. వీళ్ళ గదికెదురుగా వుండే ఆ క్లినిక్‌ను ఒంటరిగా గదిలో వున్నప్పుడు ఏంతోచక చూసేది శాంతి.

ఓసారి రెండుసార్లు తలనెప్పి వస్తే వెళ్ళి మందు కూడా తెచ్చుకుంది. యింటి కెదురుగా వుండడంవల్లకాబోలు, శాంతి అందం, అమాయకత్వం ఆకర్షించి కాబోలు సుదర్శనం పరిచయం పెంచుకున్నాడు

....మాటల్లో అతని సానుభూతి, జాలి... తనపట్ల అభిమానంవ్యక్తం చేయ

---

**ఫీజు**



"కోడిపిల్లను కుక్క తింటే నష్ట పరిహారం ఎంత ఇవ్వాలండీ! లాయర్ పార్వతీశాన్ని అడిగాడు గజేంద్ర.

"కోడిపిల్ల ఖరీదు చెల్లిస్తే చాలు!"

"అయితే పది రూపాయలు ఇవ్వండి! మీ కుక్క మా కోడిపిల్లను తినేసింది!"

"మీరే నాకు పది రూపాయలు ఇవ్వాలి! ఎందుకంటే నా కన్సల్టేషన్ ఫీజు ఇరవై రూపాయలు!"

—జూపిటర్

---

డంతో, శాంతికి అతడు ఆత్మీయుడై పోయాడు. తన కష్టసుఖాలు అతనితో చెప్పు కునేది. అతని ఓదార్పు ఆమెకెంతో ఉపశమనాలు కలిగించేదికూడా.

కాని- ఈ సమాజం... ముందు వాళ్ళ స్నేహం, ఆత్మీయత... సబబైందిగా తోచలేదు అందుకే ఏవేవో అనుకునేవారంతా రానురాను... మొహంమీదే అనసాగారు.

విజయ్ విన్నా పట్టించుకునేవారు కాదు. అతనికి శాంతి మీద ప్రేమకాదు నమ్మకం కూడా వున్నాయ్. లోకంమాటలకు విలువిచ్చేవాడుకాదు

కాని- శాంతి ఆ నమ్మకాన్ని వమ్ముచేసేసింది.

ఆరోజు—

సాయంత్రం ప్రయివేటు నుండి తిరిగొచ్చిన విజయ్‌కి టేబుల్ మీద శాంతి రాసి పెట్టిన వుత్తరం పిడుగులా తోచింది. నమ్మలేకపోయాడు. కాని నమ్మకతప్పిందికాదు.

జరిగిందానికి కారణం- శాంతికాదు. నేనే...నేనే...అంటూ బాధపడిపోయాడు. అతని బాధను ఆవేదనను పంచుకున్న వ్యక్తులు ఇద్దరే. కళ్యాణి- కరుణ.

*  *  *

"విజయ్ బాబూ!" ఎవరో పిలవడంతో గది తలుపు తాళం తీస్తున్న విజయ్ వెనక్కి తిరిగి చూసాడు. పక్కింటి యజమాని...తను పత్రికాఫీసులో పనిచేస్తుండగా వార వారం పత్రిక చదవడం కోసం, తనతో పరిచయం చేసుకున్న పెద్ద మనిషి.

"కనిపించడంలేదూ?" అన్నాడు.

జవాబుగా చిన్నగా నవ్వాడు.

యింట్లో కూడా అమ్మాయి కనిపించడంలేదు...అన్నాడు అదోలా చూస్తూ. విజయ్‌కి అతని ప్రశ్నలోని అంతరార్థం తెలుసు. ప్రశ్నకు జవాబు తెలిసికూడా అతను ప్రశ్న వేస్తున్నాడంటే-"ప్చ్...ఏం మనుషులో" అనుకుంటూ-నిశ్శబ్దంగా నిలబడి పోయాడు

అమ్మాయి తరుచూ డాక్టరు దగ్గరికెళ్ళి మాట్లాడుతూ వుంటె అప్పుడే నాకెందుకో అనుమానం వచ్చింది బాబూ! కాని...చెబితె చాదస్తం క్రింద జమకడతావేమోనని... అయినా యివేం బుద్ధులు ...ఆడదన్నాక ఆ మాత్రం బుద్ధి వుండకూడదూ? కష్టాలు వచ్చాయని కట్టుకున్నవాడిని వొదిలి వెళ్ళిపోవడమేనా? అసలు నువ్వు ఆ అమ్మాయిని నమ్మడం

ప్లీజ్ మాస్టారూ! వెళ్ళిపొండి...అంటూ గది తలుపులు తెరిచి గదిలోకెళ్ళి తలుపులు మూసుకున్నాడు.

పెళ్ళాం మరో పురుషుడితో లేచి పోయిందంటే-ఓ ప్రక్క జాలి చూపిస్తూనే మరో ప్రక్క దెప్పిపొడిచె హింసించె ఈ మనుషులను ఏం అనగలం? వాళ్ళ నోళ్ళెలా మూయించగలం?

ఎదుటివాడి పెళ్ళాం లేచిపోయిందంటే, సంతోషించి, వాడి పెళ్ళాం అలా వెళ్ళ

దానికి వాడి అసమర్ధతే కారణం అని, నిందిస్తూ నలుగురిలో తానే మగాడినని తోటి మనిషి గురించి హీనంగా మాట్లాడి సంతోషిస్తారు కొందరు. వాళ్ళ సంస్కారానికి ఓ నమస్కారం పెట్టాలనిపిస్తుంది.

జారిపడిన వాడిని లేవదీయాలని చూడకుండా, వారు మళ్ళీ లేవకుండా రాళ్ళు విసురుతుంది సమాజం. అయిన గాయాన్ని కాకిలా పొడుస్తూ మరింత పెద్దగా చేయాలని చూస్తుంది. లేవాలని, లేచి నిలబడాలని ప్రయత్నించేవాడికి ధైర్యాన్నిచ్చి, చేయూత నివ్వడం ఈ సమాజం యిప్పట్లో నేర్చుకోదు

సమాజం నేర్చుకోదు. గుడ్డిది, చెవిటిది అయిన ఈ సమాజం, నిజాన్ని చూడ లేదు వినలేదు మాస్టారూ! అలా అని నిజం చెప్పడం మానేస్తారూ? ఓడిపోయిన మనిషికి గెలిచే అవకాశం అది ఇవ్వదని అసలు ప్రయత్నమే చేయకుండా మానుకుంటారా మాస్టారూ? సమాజానికి తెలియపని, మనం చేయడం మానుకుంటామా?

ఊహుఁ...అలా ఎప్పుడూ కాదు మాస్టారూ! మనిషి ఆశాజీవి. మనిషి ఊపిరి ఆశ...నిరాశ, పిరికితనం, నిర్లిప్తత మనిషిని ఎదగనీయవు, బ్రతకనీయవు మాస్టారూ! జీవితం మనతో రాజీ పడనప్పుడు మనమే జీవితంతో రాజీపడాలి.

మాస్టారూ! లోకం సుడిగాలి లాంటిది. భయపడినంతవరకు మనలను చుట్టుకొని గిర్రున తిప్పేస్తుంది. కాని ఎదురుతిరిగి గట్టిగా నిలబడితే, మనచుట్టు అది తిరుగుతుంది అంతే—



## ఉన్నత విద్యలో స్త్రీలు

మనదేశంలో మూడు దశాబ్దాల క్రితంలో... స్త్రీలు ఇంట్లోంచి బయటకు రావడానికి ఎంతగానో బిడియపడే వారు. అందువల్లే అప్పట్లో స్త్రీలు ఉన్నత విద్యను చదవడం అతి అరుదుగా సంభవించేది. కానీ... మూడు దశాబ్దాల అవిరళ కృషితో... మన దేశంలో ఉన్నత విద్యను అభ్యసించేవారిలో స్త్రీల శాతాన్ని నలభై అయి దుకు పెంచగల్గాం. ఇది నిజంగా అద్భుతమైన విషయమే. మనదేశంలో ఉన్న నాలుగు వందల పన్నెండు జిల్లాలలో తొమ్మిది జిల్లాలలోని స్త్రీలు అతిఎక్కువగానూ... 70 జిల్లాలలో ఎక్కువగానూ, 137 జిల్లాలలో మామూలుగానూ, మరో 137 జిల్లాలలో తక్కువగానూ, 59 జిల్లాలలో అతి తక్కువగానూ ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారట. కేరళ, మణిపూర్, తమిళనాడు, మిజోరామ్, పాండిచేరి, అరుణాచల ప్రదేశ్‌లకు చెందిన తొమ్మిది జిల్లాలలోని స్త్రీలు అతి ఎక్కువగా ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారట!

—జూపిటర్

ఎవరో ఏదో అన్నారని, అంటారని బాధపడకండి మాస్టారు. మిమ్మల్ని అర్థం చేసుకోకుంటె అనేవాళ్ళు అమాయకులని క్షమించండి. తెలిసి అనేవాళ్ళని మూర్ఖులని వొదిలేయండి–

కళ్యాణి మాటలకు, ఓదార్పుకు విజయ్ మనసుకు ప్రశాంతత చిక్కినా ఏమూలో శాంతి చేసినపని మనసును పుండులా తొలిచేది. కళ్యాణి అభిమానం, ఆరాధనగా మారి పోయింది

కళ్యాణి అతి చేరువకు రావడం, జాలి, సానుభూతి అయితే భరించలేరు. ప్రేమ అనుకుంటె–నమ్మకం పోయింది. ఆరాధన అంటే అంతా ట్రాష్... ఆకర్షణ..., మోజు అంటే సబబుగా వుంటుందేమో!

కాని కళ్యాణివి అవేంకావు ట్రాష్‌కాదు. కాని-తనకా అర్హత లేదు. తన చేరువులో కళ్యాణి సుఖపడదు. శాంతి సుఖపడిందా? లేదు. కళ్యాణి అంతే. తన నీడలోకి వచ్చాకా బాధలు, కష్టాలు, కన్నీళ్ళు తప్ప తానేం ఇవ్వలేదు. రద్దు చేసిన పొరపాటు మళ్ళీ చేయడు తను. తన మనసు అంగీకరించలేదు. అందుకే కళ్యాణికి చెప్పకుండానే బయలుదేరాడు విజయ్.

"వెళ్ళిపోతున్నారా మాస్టారూ ?"

గదిలోవున్న తన కొద్దిపాటి సామాను సూటుకేసులో సర్దుకుంటున్న విజయ్ తలెత్తి చూసాడు

సాయంకాలపు నీరెండలో గుమ్మంలో నిలబడ్డ కరుణ నీడ పొడుగ్గా పడుతోంది. కరుణ కళ్ళలో అమాయకత్వంతోపాటు కరుగుతున్న పలుచటి కన్నీటిపొర ... ఆ చూపులో జాలి...భరించలేనట్టుగా తల తిప్పుకుంటూ "ఊఁ..." అన్నాడు.

"ఎక్కడికి మాస్టారూ ?"

తలెత్తి తీక్షణంగా చూడబోయాడు విజయ్. కాని కరుణ ఎదురుగాలేదు. తలుపు కటు ప్రక్కగావున్న కిటికీలోనుండి బయటకు చూస్తోంది.

తనకే జవాబు తెలియని ప్రశ్న అది. గమ్యం నిర్ణయించుకోకుండానే ప్రయాణానికి సిద్ధమయాడు. అలాంటప్పుడు కరుణకు ఏం చెబుతాడు ?

"ఎందుకు వెళ్ళిపోతున్నారు మాస్టారూ ?" ఈసారి కరుణ ప్రశ్నకు ఉలిక్కిపడ్డాడు జవాబు తెలిసిన ప్రశ్న కాని చెప్పలేదు. చెబితే కరుణ నవ్వుతుందేమో!

"శాంతికోసం- శాంతిని వెదుక్కుంటూ వెళ్ళిపోతున్నాడు ఎంతదూరమైనా సరె వెళ్ళిపోవాలి. శాంతిలేని ఆ యింట్లో, ఆ పరిసరాల్లో తానొక్క క్షణమైనా ఉండలేడు.

ఆ యింట్లోనేకాదు, ఆ పరిసరాల్లో శాంతి లేదు.

కాని...

తన జీవితంలో శాంతి వుందా ?



తన మనసులో శాంతి వుందా

అందుకని మనసు లేదనుకోగలడా? జీవితాన్ని కాదనుకోగలడా?

జవాబు చెప్పుకోలేని ప్రశ్నలు

ప్చ్. తల విసురుగా విదిలించి లేచి నిలబడ్డాడు విజయ్.

కరుణ యిటువైపు తిరిగాడు

"మాస్టారూ! మీరు వెళ్ళిపోతే ఈ గది ఎంత బోసిపోతుందో... ఎంత కళా విహీనంగా

"శాంతిలేని నా జీవితంలా!" అని అనుకుంటూ నవ్వాడు.

"గది ఖాళీచేసి మీరు వెళ్ళిపోతున్నారు మాస్టారూ! మీరు లేనిలోటు గదికి ఏనాడు తీరకపోవచ్చు కాని... అలా అని మరొకరికి ఆశ్రయం యివ్వకపోతుందా!

మీరు లేని లోటును మరిచిపోయి తప్పకుండా మరొకరికి ఆశ్రయం యిస్తుంది మాస్టారూ!" అంది కరుణ అతని మొహంలోకి చూస్తూ.

విజయ్ కళ్ళెత్తి చూసాడు.

"జీవితం అంతే మాస్టారు"

"అవును. కాని...జీవితానికి స్వార్థం లేకపోవచ్చు. కాని మనిషికి స్వార్థం తెలుసు కరుణా?"

"కాని...మీరుకూడా..."

"నేను... మామూలు మనిషినే" అంటూ, సూట్ కేస్ అందుకొని గుమ్మంవైపు అడుగులు వేస్తూ, టేబుల్ మీద ఉన్న పుస్తకాల దగ్గర ఆగి—

"కరుణా! ఈ మంచం, గిన్నెలు, టేబుల్. యివన్నీ అమ్మితే, మీకు నేనివ్వాల్సిన ఒక్కనెల అద్దె డబ్బు వస్తుందనుకుంటా! ఈ పుస్తకాలు...నా జ్ఞాపకంగా నీదగ్గిరే వుంచు మీ అమ్మగారితో నేను వెళ్ళిపోయానని చెప్పు" అంటూ గుమ్మం దాటిన విజయ్ ఎందుకో ఒక్కసారి వెనక్కి తిరిగి చూసాడు

కరుణ కళ్ళలోని నీళ్ళు చెక్కిళ్లను తడుపుతున్నాయి.

"కరుణా! కన్నీళ్ళకు విలువ కట్టడం నాకు చేతకాదు కాని...నాకోసం కన్నీరు కార్చడానికి నువ్వున్నావనే విషయం నేను తప్పకుండా గుర్తుపెట్టుకుంటాను" అంటూ దగ్గరగా వచ్చి, "కన్నీళ్లు తుడిచి వెళ్తాను కరుణా! రైలు అందకపోతే, మరోసారి నేను ఓడిపోవాల్సి వస్తుంది. యిక ఓడిపోవడం నాకు ఇష్టంలేదు కరుణా" అంటూ గబగబా అడుగులు వేస్తూ ముందుకు వెళ్ళిపోయాడు విజయ్.

"అతను వెళ్ళిపోయాడా?" కరుణ లోపలికి రాగానే అడిగింది సావిత్రమ్మ. కరుణ జవాబు చెప్పి వంటింట్లోకి వెళ్ళిపోయింది.

"యింటి అద్దె యిచ్చాడా?"

"ఆఁ..."

"హమ్మయ్యా!" అంది సావిత్రమ్మ. కరుణ జాలిగా నవ్వుకుంది.

ప్రపంచం ఎంత విశాలమైనా...ఎంతో ఇరుకుగా ఆలోచిస్తుంది మనిషిలా.

మూడేళ్ళుగా ఆ యింట్లో వుండె మాస్టారూ...పుట్టెడు వొంటరితనాన్ని, గంపెడు ఆవేదనను గుండెల్లో నింపుకొని వెళ్ళిపోయాడు. గడిచిన మూడు నెలల్లో మాస్టారు అనుభవించిన ప్రత్యక్ష నరకం...ఓహ్...అతని గురించి మంచిగా ఒక్కమాట అడగని తల్లి, అతను వెళ్ళిపోయాడనగానే ఎంతో తేలిగ్గా నిట్టూర్చి, అద్దె యిచ్చే వెళ్ళాడని చెప్పడంతో, సంతోషించిన తల్లి గురించి ఆలోచిస్తూ వుండిపోయింది.

"మళ్ళీ ఎవరు వస్తారో ఎప్పుడు వస్తారో" అని అంటున్న తల్లి మాటలను వినిలేనట్టుగా కదలి వెళ్ళిపోయింది కరుణ

"అమ్మ ఎప్పుడూ ఇంతే. సహజ గా తప్ప సమంజసంగా ఆలోచించదు" అని అనుకుంది కరుణ.

"అలా ఆలోచించి నువ్వు మాత్రం ఏం చేయగలిగావ్? నీజాలికి, సానుభూతికి కనీసం నీ ఓదార్పు మాటకు కూడా ఎదురుచూడకుండా వెళ్ళిపోయాడతను" అంది మనసు

"అవును మరి...మాస్టారూ అందరిలా మామూలు వ్యక్తికాదు"

"కరుణా!" తల్లి పిలుపుకు విసుగ్గానే బదులు పలికింది కరుణ.

"రేపు యిల్లంతా శుభ్రంగా కడిగి..." తల్లి ఆత్రుతను అర్థం చేసుకొని తలూపింది కరుణ

"ఈసారి అద్దె ఓ ఇరవై రూపాయలు పెంచి చెప్పాలి" అంది.

"ఊఁ"


"మాస్టారూ వెళ్ళిపోతారని నాకు ముందే తెలుసమ్మా. అందుకే అవధాని గారికి చెప్పి వుంచాను. రేపు శుక్రవారం ఎవరో వస్తారని చెప్పాడు" అంది అబద్ధం ఆడుతూ.

"ఆహాఁ..." సావిత్రమ్మ సంతృప్తిగా తలూపింది.

"ఇంతకూ...ఈ అబ్బాయి ఎక్కడికివెళ్ళినట్టు?" ఆలస్యంగానైనా అడిగినందుకు కరుణకు సంతోషం వేసింది. కాని జవాబు బహుశా మాస్టారుకు కూడా తెలీదేమో!

"అయితే ఆవిడ దగ్గరికి కాదా!"

"తెలీదమ్మా!"



"నిజమే! ఆవిడ దగ్గరికి వెళ్ళి ఇతనిప్పుడు చేసేదేమిటి? ఆవిడ వెళ్ళి మూడు నెలలు కావొస్తోంది కదూ!"

"ఊఁ..."

"ఆవిడెంతో అమాయకురాలిలా వుండేది కాని... మా ం చి కథకురాలేనన్న మాట..."

"అమ్మా! కాసేపు ఆలోచించకుండా పడుకో అమ్మా!" అంది విసుగ్గా.

కూతురు విసుగుకు కారణం తెలీని సావిత్రమ్మ ఏదో అనబోయి కరుణ మొహం చూసి మౌనంగా కూర్చుండిపోయింది.

"రాజు ఏడీ? యింకా రాలేదూ?"

"వస్తాడేమో!" అంటూ బయటకు ఓసారి చూసి, అక్కయ్య వచ్చే వేళయింది. నేను కాఫీకి నీళ్ళు పెడ్తాను. నువ్వు కాస్సేపు పడుకో అమ్మా అంటూ వంటింట్లోకి వెళ్ళింది కరుణ.

"అక్కా!" అంటూ వచ్చాడు రాజు.

"ఆకలిగా వుంది. టిఫిను ఏమైనా పెట్టవే!" అన్నాడు.

"ఆఁ ఆఁ...పనిపాట లేకుండా నువ్వు ఊరంతా తిరిగి, వేళకు వస్తే వండి వడ్డించడానికి ఇక్కడెవరు దాసీలు లేరు. ఇది సత్రం కొంపకాదు" అంది సావిత్రమ్మ కోపంగా.

రాజు వికటంగా సినిమాలోని విలన్లా నవ్వాడు.

"దాసీలు సత్రం కొంపలో వుండరు. అయినా అడ్డమైన రోడ్లన్నీ తిరిగి వేళకు యింటికి వస్తారుకాని...వేళకానివేళ వెళ్ళేది సత్రం కొంపకు. పైగా సత్రం కొంపల్లో టిఫెన్లు పెట్టరు" అన్నాడు.

"రాజూ! నోరు మూసుకొని వెళ్ళి కాళ్ళుచేతులు కడుక్కొని రా" అంది కరుణ.

"ఊఁ... ఉప్మా తిన్నట్టుకాదు. గదిఖాళీ అయింది. రోడ్లు సర్వే చేయడం కాదు. మంచివాళ్ళను అద్దెకు తీసుకురా" అంది సావిత్రమ్మ. మొహం, కాళ్ళు, చేతులు కడుక్కొని వచ్చి కరుణ యిచ్చిన ఉప్మా తింటున్న రాజుతో.

"యిక్కడెవరూ కమీషన్ ఏజెంట్లులేరు" అన్నాడు రాజు యిందాకా తల్లి సత్రం కొంప అన్నందుకు బదులుగా.

"చూసావుటె కరుణా! వాడి తిక్క సమాధానాలు" సావిత్రమ్మ యింకేదో అనే లోగానే కరుణ విసుగ్గా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ప్రతిరోజు జరిగేదే అయినా ఆరోజెందుకో కరుణకు ఆ వాతావరణం, విసుగ్గా, చిరాగ్గా అన్పించసాగింది. నిశ్శబ్దంగా తన పనేదో తాను చేసుకుంటూ ఆలోచిస్తూ గడిపే యాలనుకుంటున్న కరుణకు సావిత్రమ్మ మీద తొలిసారిగా విసుగు రాసాగింది.

కాఫీ తల్లికిచ్చి, కళ్యాణికోసం ఫ్లాస్కులో పోసి, రాజుకిచ్చి తాను తాగేసింది.

కాఫీ తాగుతూనే మళ్ళీ బయలుదేరాడు రాజు.

"మళ్ళీ ఎక్కడికి?" సావిత్రమ్మ కేకవేసింది.

"ఫస్ట్‌షోకి" వెక్కిరింతగా అని వెళ్ళిపోయాడు రాజు.

"కళ్యాణి యింకా రాలేదేం" తల్లి ప్రశ్నకు జవాబేం చెప్పకుండా, వంటింటి తలుపులు మూసి డాబా పైకి వెళ్ళిపోయింది

"ఏం పిల్లో... జవాబుకూడా చెప్పదు" అని గొణుక్కుంటున్న సావిత్రమ్మ చాలా సేపటివరకూ తను కూర్చోవడం వల్ల నడుం లాగడంతో మంచంమీద పడుకుంది.

మరో అరగంట గడిచాక, కళ్యాణి రావడం గుర్తించి కూడా, కరుణ డాబాదిగి రాలేదు

"కరుణా! మాస్టారు వెళ్ళిపోయారట నిజమేనా?" అంటూ వచ్చిన కళ్యాణి వంక చూడలేనట్టు మరెటో చూస్తూ జవాబు చెప్పింది.

క్షణంలో కళ్యాణి మొహం వెలవెలాపోయింది.

"ఎప్పుడు వెళ్ళారు కరుణా!"

"ఆయన వెళ్ళిన రైలు వెళ్ళిపోయి చాలాసేపైంది అక్కా!" అంది కరుణ.

కళ్యాణి చాలాసేపటివరకు నిశబ్దంగా వుండిపోయింది.

"ఎక్కడికి వెళ్తానన్నారు కరుణా! మళ్ళీ ఎప్పుడైనా..."

కళ్యాణివంక తిరిగిచూస్తూ తలఅడ్డంగా ఆడించింది కరుణ తనకు తెలీనట్టుగా.

"మళ్ళీ వస్తానన్నారా కరుణా! ఆశగా, అమాయకంగా అడిగిన కళ్యాణివంక చూడలేక- యిక మళ్ళీ మాస్టారు మనకు కనిపించరనుకుంటా!" అంది.

కళ్యాణి డాబా చివరకువెళ్ళి నిలబడిపోయింది

వెలుగును తరిమేస్తూ చీకటినిండిపోసాగింది. మౌనంగా, మూగగా తన ఆవేదన కన్నీళ్ళ రూపంలో కరిగిపోతుంటే నిశబ్దంగా నిలబడిపోయింది

[illegible] వాతావరణంలో మార్పువచ్చింది. చల్లటి గాలి, ఈదురుగాలిగా



## సత్ప్రవర్తన

"నీకి ఉద్యోగంరాదు!"—కంపెనీ మానేజింగ్ డైరెక్టర్ అన్నాడు

"ఎందుకని సార్!" సెక్రటరీ పోస్టుకు ఇంటర్వ్యూకు వచ్చిన వీణ కంగారుగా అంది.

"నువ్వు ఇంతకుముందు పని చేసిన ఆఫీసు డైరెక్టరు నీ ప్రవర్తన చాలా మంచిగా ఉంటుందని రాసినందుకు"

—జూపిటర్

మారిపోయింది. నల్లటి మేఘాలతో ఆకాశం అంతా నల్లగా... ఆ చీకటికి పోటీగా మారి పోయింది. వీధిలోని దీపాలన్నీ ఉన్నట్లుండి హఠాత్తుగా కళ్యాణి ఆశలా ఆరిపోయాయి.

ఓడిపోయిన తన అమాయకత్వాన్ని, తన ఆశను చూస్తూ జాలిపడి కన్నీరు కారుస్తున్నట్టుగా... వర్షం మొదలయింది.

తనతో ఒక్కమాట కూడా చెప్పకుండా, కనీసం చివరిసారిగా తనను కలుసుకోకుండా వెళ్ళిపోయిన మాస్టారు మీద కోపం రాలేదు కళ్యాణికి.

తనమీద తనకే కోపం. తన దురదృష్టంపట్ల తనకే జాలివేసింది.

* * *

"ఎవరు బాబూ నువ్వు?"

ఆ ప్రశ్నకు జవాబు చాలాసేపు ఆలోచించాడు విజయ్. అతను మళ్ళీ అడిగాడు. మంచం మీద పడుకున్న అతని మొహంలో అనుభవాల ముడుతలు, ఆ ముడతలలో జీవితంలో అతను తిరిగిన మలుపులు, ఆ మలుపుల్లో అతను నేర్చుకున్న పాఠాలు అనుభవాల గాయాలు-లోతుకుపోయినా చురుకుగా వుండె అతని కళ్ళలో నీలినీడలు ...తన ప్రశ్నకు జవాబు తెలుసుకోవాలన్న జిజ్ఞాస.

"ఎందుకు బాబుగారూ?" విజయ్ ఎదురు ప్రశ్నించాడు. ఆ ప్రశ్నలోనే ఏదో జవాబు వెతుక్కున్న అతను చిరునవ్వు నవ్వి, "ఊరికె...తెలుసుకోవాలని నా ప్రాణాన్ని కాపాడిన నీ గురించి తెలుసుకోవడం నా కనీస ధర్మం బాబూ!" అన్నాడు.

"మీ ప్రాణాన్ని కాపాడింది నేను కాదు. ఈ హాస్పిటల్‌లోని డాక్టర్లు. నేను కేవలం యిక్కడ చేర్చానంతే? మనిషిగా అది నా ధర్మం" అన్నాడు.

"ఓహ్-" అంటూ నవ్వి, "కాలం చాలా విలువైంది బాబు. సరైన టైముకు నన్ను హాస్పటల్‌లో చేర్చావు ఈ డాక్టర్లు బ్రతికించగలిగారు. నేను బ్రతికాను. సమయానికి నువ్వు లేకుంటె-"

"కాలం-విలువ..." సన్నగా గొణుక్కున్నాడు విజయ్.

"హలో..." అంటూ వచ్చాడు డాక్టర్.

"ఎలా వుందండి?" అన్నాడు చెక్ చేస్తూ.

"హాయిగా వుంది" అన్నాడాయన.

"మరో రెండు రోజులు రెస్ట్ తీసుకుంటె చాలు" విజయ్ వైపు తిరిగి చెప్పాడు. డాక్టరు వెళ్ళిపోయాడు.

"నేను మళ్ళీ రేపు వస్తాను బాబుగారూ!" అన్నాడు విజయ్ లేచి నిలబడుతూ. సరె...నీ పేరైనా చెప్పవూ బాబూ!" అన్నాడు.

"జీవితంలో ఓడిపోయిన నా పేరు విజయ్..." అని చెప్పలేక, "విజయ్" అన్నాడు.

రెండు రోజుల తరువాత-



ఆ రోజు డిశ్చార్జ్ చేశారు. హాస్పటల్ బయటకు వచ్చాక అడిగాడు విజయ్ "ఎక్కడికి వెళ్లాలి బాబుగారూ" అని.

"మా అబ్బాయి ఇంటికి" అన్నాడు

విజయ్ ఆశ్చర్యపోయాడు.

వాళ్ళ అబ్బాయి ఈ ఊళ్లోవున్నా, తనతో కబురు పంపించని అతడి మన స్తత్వాన్ని అంచనా వేసుకోలేకపోయాడు

తాను ప్రయాణం చేస్తున్న కంపార్టుమెంటులో గుండెపోటు వచ్చి పడిపోయిన తోటి ప్రయాణీకుడిగా తప్ప అతని గురించి వివరాలేవి తనకు తెలీవు. అడగలేదు.

టాక్సీని పిలిచాడు విజయ్

"మీ అబ్బాయి ఎడ్రస్ చెప్పండి బాబుగారూ! మిమ్మల్ని దిగబెట్టి నేను..."

"నువ్వెక్కడుంటున్నావో?" ఆ ప్రశ్నకు ఉలిక్కిపడి "ఎందుకు బాబుగారూ?" అన్నాడు.

"ప్రశ్నకు ప్రశ్నే బదులు కాదు బాబు" అన్నాడతను.

"నాకు ఇల్లు అంటూ లేదు బాబుగారూ. ఉద్యోగ ప్రయత్నంలో ఇక్కడికి వచ్చాను. ప్రస్తుతం..."

"ఓహ్...నాకు తెలుసు బాబూ" అంటూ నవ్వి "నీ ఇంటికి నన్ను తీసికెళ్ళు లేదా నా ఇంటికి నువ్వయినా రా"

"ఎక్కడికి బాబూ! మీ అబ్బాయి"

"నాకెవరూ లేరయ్యా! ఒంటరివాణ్ణి"

"మరి మీరు..."

"మన ఇంటికి వెళ్తున్నాం. పద" అంటూ టాక్సీ డ్రయివర్‌కు అడ్రస్ చెప్పి విజయ్ చేయి పట్టుకొని కూర్చోబెట్టాడు టాక్సీలో.

"కేవలం రైలులోనేకాదు బాబూ! ఈ ప్రపంచంలో నేను ఒంటరివాణ్ణి. జీవితం యిలాగే ఒంటరిగా ఎక్కడో ఎప్పుడో ముగిసిపోతుందనుకున్నాను బాబూ! కాని... ఈ క్షణంలో—ఆ క్షణం అంటూ వస్తే ఎవరైనా ఒకరు దగ్గరుండాలనిపిస్తోందిబాబూ! ఆశ చిన్నదే బాబూ! తీరుతుందని నమ్మకం నువ్వు కలిగిస్తే ఈ వయసులో వుండాల్సిన మనశ్శాంతి నాకు నువ్విచ్చినవాడవవుతావు"

విజయ్ మాట్లాడలేదు.

"పదబాబూ! నువ్వెవరో నాకు తెలియదు. నేను నీకు అంతే కాని...ఇద్దరం ఒంటరివాళ్ళం. నీ గురించి తెలుసుకోవాల్సిన అవసరం నాకు లేదు. నాకు కావల్సింది నీ పరిచయం, నీ తోడు, ఎక్కడైనా ఉండటానికేకదా! పదబాబూ!" అంటూ, టాక్సీలో కూర్చుని విజయ్ చేయిపట్టుకు లాగాడు.

యాంత్రికంగా ఆలోచనలమధ్య కూర్చున్న విజయ్, ఓ డాబా యింటిముందు కారు ఆగడంతో ఆయనతోపాటు దిగాడు.

తలుపు చప్పుడు వింటూనే తలుపు తీసిన నౌకరు రంగయ్య ఆయన చేతిలోని సూట్ కేస్ అందుకోవాలన్నట్టుగా చూశాడు.

సూట్‌కేసు విజయ్ చేతిలో వుండడంతో అందుకుని, అంతకుముందు విజయ్‌ని ఎప్పుడూ ఎక్కడా చూడని రంగయ్య అతనెవరో ఊహించలేకపోయాడు

"రంగయ్యా! చినబాబుగారికి స్నానానికి ఏర్పాట్లు చూడు" అన్నాడు

"ఆలస్యం అయిందేం బాబుగారు రావడం నాలుగురోజుల్కితమే రావాల్సింది కదూ!" అన్నాడు.

"ఊఁ..." అంటూ జరిగిన సంగతంతా చెప్పాడు.

విజయ్‌వంక కృతజ్ఞత నిండిన కళ్ళతో చూస్తూ— "దేవుడిలా మా బాబుగారిని

కాపాడారు బాబూ! మిమ్మల్ని దేవుడు చల్లగా చూడాలి" అంటూ లోపలికి వెళ్ళాడు.

రంగయ్య మాటలకు నవ్వుకుంటూ, విజయ్‌వైపు తిరిగాడు ఆయన.

"నా పెళ్ళయినప్పటి నుండి ఈ యింట్లో నౌకరుగా వుంటున్నాడు. రంగయ్యకు ఎవరూలేరు ఒంటరితనం మమ్మల్నిద్దరినీ ఒకటిగా చేసింది బాబూ. నేనంటే పంచ ప్రాణాలు నాకు ప్రపంచంలో యింతవరకు ఉన్న ఆత్మీయుడు స్నేహితుడు రంగయ్య ఒక్కడే" అంటూ రంగయ్య గురించి చెబుతున్న ఆయన గొంతు గాద్గదికమైంది.

విజయ్ నిశబ్దంగా వింటూ వుండిపోయాడు.

ఒంటరితనం-

అంత భయంకరమైందా?

ఆ ప్రశ్నకు జవాబు తెలిసి కూడా తనా ప్రశ్న వేసుకోవటం... నవ్వు వచ్చింది విజయ్‌కు.

గడిచిన జీవితంలో తను ఒంటరితనం లేకుండా గడిపింది కొన్ని నెలలు మాత్రమే

దాదాపు ఐదునెలలు

తన వయసు ముప్పయ్... అంటే తనకు ఊహ తెలిసినప్పటినుండి ఒంటరిగానే వున్నాడు. ఒంటరితనం అనేది తనకు ఓ వరంగా లభించినట్టు... మిగిలిపోయింది. మధ్యలో... కొన్నినెలలు... ఎన్ని... మూడునెలలు...కాదు... దాదాపు అయిదు నెలలకాలం తాను ఒంటరితనం అనే పంజరంలో నుండి బయటపడ్డట్టు... గడిచింది.

---



## ఫొటో టెలిగ్రాం

కొన్ని సంవత్సరాల క్రితం నాలుగయిదు గంటలలో వెళ్ళగల్గిన టెలిగ్రాం... ప్రస్తుతం ఒకటి రెండు రోజుల తర్వాత తన స్థావరాన్ని చేరుకొంటోంది. ఈ విషయంలో మనం నిజంగా సిగ్గుపడాలి. అనేక సందర్భాలలో టెలిగ్రాంకంటే పోస్టుకార్డులే ముందుగా గమ్యాన్ని చేరిన సంఘటనలు జరిగాయి. అలాటి పరిస్థితిలో ఈ సంవత్సరం జూన్ ఒకటవ తేదీన బెంగుళూర్ నుండి ఢిల్లీ నగరానికి ఫొటోలను టెలిగ్రాఫిక్ పద్ధతిలో పంపడానికి ఒక సర్వీసు ప్రారంభమయింది. తెలుపు, నలుపు ఫొటోలను ఆరు నిముషాలలో... బెంగుళూర్ నుండి ఢిల్లీకు 'ఫొటో టెలిగ్రాం' ద్వారా పంపవచ్చునట. ముఖ్యంగా జర్నలిస్టులకు ఈ సర్వీస్ బాగా ఉపయోగపడ్తుంది చూద్దాం ఈ ముచ్చట ఎన్నాళ్ళు కొనసాగుతుందో—

—జూపిటర్

---

తిరిగి భూమి గుండ్రంగా వుందన్నట్టు... మళ్ళీ తను తనచుట్టూ గీసుకున్న పరిధిలోకి పంజరంలోకి విసిరేసింది విధి

ఒంటరితనం కొద్దిగా బాధ అన్పించింది. కాని...రానురాను అంత బాధ కలగక పోయినా, ప్రతిక్షణం తను ఒంటరినన్న విషయం మాత్రం గుర్తుకువచ్చేది.

ఎవరైనా స్నేహంగా పలకరిస్తారని ఆశించేది మనసు. బహుశా ఒంటరివాళ్ళం దరూ అలా ఆశిస్తారా?

ఏమో... ఆ క్షణాల్లో ఎవరైనా కొంచెం ఆత్మీయతగా మాట్లాడినా చాలు... మనసు వారిపట్ల కృతజ్ఞతతో నిండిపోతుంది. కాని.

తను -

ఒక్కసారి ఓడిపోయిన తను మళ్ళీ ఒంటరితనాన్ని వొదలలేక దూరంగా దూరంగా వచ్చేసాడు.

ఎందుకు?

హఠాత్తుగా విజయ్‌కు కళ్యాణి రూపం కళ్ళముందు మెదిలింది. ఆమె కళ్ళలో నిండిన జాలి, ప్రేమ ఆర్తి... అన్నీ ఒక్కొక్కటిగా గుర్తుకు వచ్చాయి. తల విదిలించి నిట్టూర్చాడు విజయ్.

"స్నానానికి నీళ్ళు తోడాను బాబూ" అంటూ రంగయ్య పిలవడంతో లేచాడు విజయ్.

అతడు స్నానంచేసి వచ్చేసరికి భోజనం రెడీగా వుంది.

భోజనం అయ్యాకా విజయ్‌ని ఒక గదిలోకి తీసికెళ్ళాడు రాఘవయ్య.

"విశ్రాంతిగా పడుకో బాబూ! సాయంత్రంవెళ్ళి నీసామాన్లు ఎక్కడున్నాయో తెచ్చేసుకో" అంటూ మంచం చూపించాడు.

అపరిచితుడైన ఆ వృద్ధుడి ఆత్మీయత, ప్రేమ చూస్తుంటే విజయ్‌కు ఓ ప్రక్క కళ్ళనీళ్లు నిండినా మరో ప్రక్క భయం దిగులు కలగసాగాయి.

ఈ బంధం ఎన్నాళ్లు?

మనసు ఆలోచిస్తున్నా, శరీరం విశ్రాంతి కోరడంవల్లనేమో, మంచం మీద వాలిన విజయ్ అలాగే నిద్రపోయాడు

సాయంత్రంవెళ్ళి హోటల్‌రూమ్‌లో వున్న తన సూట్‌కేసు తెచ్చేసుకున్నాడు విజయ్

"రేపు ఆలోచించుకోవచ్చు. విశ్రాంతిగా పడుకోబాబూ" రాఘవయ్య మాటలకు విజయ్ కళ్ళుమూసుకున్నాడు.

చాలారోజుల తరువాత మనసునిండా ప్రశాంతత. నిద్రాదేవి వొళ్ళోకి జారిపోతూ "ఎంత చిత్రమైంది జీవితం... మలుపు మలుపులో ఒక్కో కొత్త అనుభవం..." అను కుంటూ కళ్ళుమూసుకున్నాడు విజయ్.

మర్నాడు ఉదయం ఏడుగంటలు దాటాకా మెలుకువ వచ్చింది విజయ్‌కి. అప్పటికే రాఘవయ్య లేచి స్నానాదికాలు ముగించుకొని వరండాలో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

విజయ్ కాలకృత్యాలు తీర్చుకొని వచ్చేసరికి రంగయ్య డైనింగ్ టేబుల్ పైన టిఫెన్‌కు అన్నీ సర్ది పెట్టాడు.

రాఘవయ్య వరండాలోనుండి వచ్చాడు.

"నిదబాగా పట్టిందనుకుంటాను" అన్నాడు విజయ్‌నిచూస్తూ సంతృప్తిగా నవ్వుతూ.

జవాబుగా చిన్నగా నవ్వాడు విజయ్.


టిఫన్ కాఫీ అయ్యాకా యిద్దరూ తీరిగ్గా కూర్చున్నారు.

"నీ గురించి నేనేం తెలుసుకోవాలనుకోవడం లేదు విజయ్! నీకేం కావాలో చెప్పు! ఒకరి జాలి, దయ, సానుభూతిమీద ఆధారపడడం, ఆసరాగా తీసుకోవడం నీకు నచ్చదన్న విషయం నేను అర్థం చేసుకోగలను. అందుకే అడుగుతున్నాను. నీ స్నేహితుడిగా, నీ స్నేహం కోసం, నువ్వునాకు చేసిన సహాయానికి ప్రతిఫలంగా నేనేమి ఇచ్చుకోలేను. కనీసం ఏ చిన్న ఉపకారమైనా నీకు చేయగలిగితే సంతోషిస్తాను" అన్నాడు.

విజయ్ చాలాసేపు ఆలోచన్లో పడిపోయాడు. ఆ వృద్ధుడి మాటల్లో కదిలిన ఆత్మీయతకు తనకు ఏదైనా సహాయం చేయాలనే ఆరాటాన్ని, తనను దూరం చేసుకోకూడ

---

## ఎవరికివారే భయపడాలి !



హాస్యనటుడు పద్మనాభం నాటకమే వండి తగ్గిన తరువాత మానసికంగా స్థిమితం తప్పడం కూడా జరిగింది అపుడు పిచ్చి అన్నారు పరిశ్రమలోని పలువురు దానికే 'దివ్యోన్మాదం' అని పేరు పెట్టాడు పద్మనాభం

అసలు ఆ పిచ్చి ఎందుకు పట్టిందని ఆయనని పర్సనల్‌గా అడిగితే. తన జీవితంలో అతిగా అన్ని విషయాల్లో పోయానని అహంభావ్యత్వం నమ్మి కళ్ళుమూసుకొని ఎవరు ఎక్కడ సంతకాలు పెట్టమంటే అక్కడ సంతకాలు పెట్టడం చేత ఇలాంటి దుర్ఘటన జరిగిందనీ, ఎవరయినా తనను తన ఇమేజ్‌ను చూసి భయపడటం నేర్చుకోవాలని సెల్ఫ్ రెస్పెక్ట్ ఈజ్ మోస్ట్ వాల్యుబుల్ థింగ్ ఇన్ లైఫ్ అని. అయితే ఈ జీవనసత్యాన్ని తెలుసుకొనేసరికి ఆరుదుపదులు దాటిపోయాయని పద్మనాభం అంటాడు

— కేటిక్

---

దనే తపనను అర్థం చేసుకున్నాడు.

"నాకు ఉద్యోగం కావాలి బాబుగారూ" అన్నాడు.

విజయ్ మాటలు వింటూనే రాఘవయ్య మొహం వికసించింది ఆతడాశించింది కూడా అదే

అతడు మరో స్నేహితుడితో కలిసి, బాలానగర్‌లో బల్బులు తయారుచేసే చిన్న పరిశ్రమ పెట్టుకున్నాడు. ఇద్దరూ ముసలివాళ్ళే అంతంత దూరం వెళ్ళలేరు. ఎవరినైనా మంచి మేనేజరును చూడాలనే వాళ్ళ ప్రయత్నం. రాఘవయ్యకు విజయ్ జవాబు చాలా సంతృప్తినే కాదు. వాళ్ళ సమస్యకు పరిష్కారం దొరికినట్టనిపించింది.

రెండు నెలలు గడిచేటప్పటికి విజయ్ ఆఫీసు వ్యవహారాలన్నీ క్షుణ్ణంగా తెలుసుకున్నాడు. ఆతనికి మొదటినుండి వున్న పట్టుదల శ్రద్ధ, ఏకాగ్రత వల్ల, అతడు చాలా త్వరలోనే మెళుకువలన్నీ ఆకళింపు చేసుకున్నాడు

రాఘవయ్యకు నిశ్చింతతో పాటు, మనసులో ఓ విధమైన తృప్తి నిండిపోయింది. విజయ్ పట్ల అభిమానంతో పాటు. తెలియని ఆత్మీయత పెనవేసుకుపోయాయి. ఆతని ఒంటరి జీవితంలో ముసురుకుంటున్న వృద్ధాప్యపు నీడల్లో, విజయ్ తోడు అతనికి పెద్ద ఆసరాగా, ఆధారంగా అయింది

మనిషి ఎంతో డబ్బు సంపాదించినా, ఎన్ని హంగులను సమకూర్చుకున్నా, ఒంటరి తనంలో తోడుగా నిలిచి జీవితపు సంధ్యలో, నీడగా నిలిచే తోడు అవసరం-మరో మనసున్న మనిషి తప్ప డబ్బు తీర్చదు. ఆ మనిషి భార్యే కావచ్చు. మరో మనిషి కావొచ్చు

మనిషి కష్టాల్లో, సుఖాల్లో, జీవితంలో గడిచిపోయి, అనుభవాల అనుభూతులను నెమరువేసుకుంటూ మనసులో మనసై మసిలి, తన కన్నీటిలో కరిగి, చిరునవ్వులో వెలిగేది భార్య అయితే-

అంతకు మించి, స్నేహితుడు అవుతాడు. కాని, ఆ స్నేహితునికి వయసు, మనసు అడ్డురావు జీవితపు ప్రయాణంలో ఎదురుపడిన ఇద్దరు ఒంటరి ప్రయాణీకులు కలిస్తే, వారిద్దరి అనుభవాలు ఒకటి అయినపుడు ఆ యిద్దరి కలయిక, వారిద్దరి మధ్య స్నేహం...ఓహ్...అపూర్వం అన్పించుకుంటుంది.

సరిగ్గా యిలాగే జరిగింది. రాఘవయ్య విజయ్‌లు ఒకరికొకరు బాగా చేరువయ్యారు. ఎక్కడో రైల్లో కలిసిన ప్రయాణీకుల్లాకాక ఎన్నేళ్ళ స్నేహంగానో మరెన్నేళ్ళ అనుబంధంగా మారిపోయింది వారిద్దరి మధ్య వున్న స్నేహం.

కళ్యాణి పెళ్ళి మరో వారం రోజులుంది.

యింటికి సున్నం వేయించారు. పెళ్ళి పనులన్నీ చాలా చురుకుగా సాగిపోతున్నయ్.

మాస్టారూ ఎక్కడున్నారో స్వగతంగాఅనుకోబోయి పెద్దగానేఅనేసింది కళ్యాణి.

కరుణ తలెత్తి చూసింది. కళ్యాణి కళ్ళనిండా నీళ్ళు-పెదవులతో చెప్పలేని మాట లను. మాటలు వ్యక్తం చేయలేని బాధ ఆ నీళ్ళలో కరిగిపోతుంటే కళ్యాణి. కళ్ళ నీళ్ళు కూడా తుడుచుకోవడం మరిచిపోయింది.

కన్నె హృదయం ఎంత కోమలం...ఎంత సున్నితం-మనసిచ్చిన మనిషి గురించి ఎంత ఆవేదన-కాదని వెళ్ళిపోయిన మాస్టారు గురించి అక్క ఎందుకిలా బాధ పడుతోంది?


అయినా మాస్టారూ తప్పేం వుంది?

ఆయన ప్రేమించిన మనిషి ఆయనను మోసంచేసి వంచించి వెళ్ళిపోతే గాయపడ్డ హృదయాన్ని, దగాపడ్డ జీవితాన్ని ఈడ్వలేక ఈడుస్తున్న మామూలు మనిషి.

దేవదాసు కాకపోవచ్చు. కాని...మనిషే కదా! మనసు మమత వుండి ఆలో చించే హృదయం, సంస్కారం వున్న మనిషి. శరీరానికి గాయమైతే మందు వేసుకొని మాన్పుకోవచ్చు. దానికి కొంచెం టైం పడుతుంది. అయినా మచ్చ మానదు.

మనసు-మరీ సున్నితమైంది. గాయం అయితే మందు లేదు. మానడం కష్టం! కాలమే... మాన్పగలిగె గాయాలను కాల వ్యవధి లేకుండా మనిషి కొత్త జీవితాన్ని ప్రారంభించడం...చాలా కష్టం

దగాపడ్డ మాస్టారుకు ఈ సమాజం సానుభూతిని చూపలేదు పైగా అవహేళన చేసి, అవమానించిన ఈ గది నాలుగు గోడల మధ్య ఒంటరిగా మిగిలిపోయిన



మాస్టారుకు తను అభిమానంతో, సానుభూతితో, మనిషిని చేయాలని చూసారు. ఆ ప్రయత్నంలో మాస్టారు మౌనంగా వున్న అక్కయ్య మాత్రం మనసు పారేసుకుంది. మాస్టారు తప్పేంలేదు

మాస్టారు ఏనాడు అక్కయ్యకు ఆ అభిప్రాయం కలిగేలా ప్రవర్తించలేదు. అక్కయ్యతో అసలు ఎక్కువగా మాట్లాడేవాడుకాదు. తనతో రాజుతో అప్పుడప్పుడు మాట్లాడేవాడు కాని ఆ మాటల్లో ఎంతోస్నేహం...మాస్టారుతమతో మాట్లాడుతూంటే అక్కయ్య అలా వింటూ వుండిపోయేది మృధువుగా, గంభీరంగాసాగే, మాస్టారు వాక్ప్రవాహంలోపడి అక్కయ్య ఎక్కడెక్కడికో వెళ్ళిపోయేది

మాస్టారు గురించి అక్కయ్యకు అంతా తెలుసు. తెలిసితెలిసికూడా అక్కయ్య మాస్టారుపట్ల మమత పెంచుకుంది. మనసు విప్పి చెప్పినప్పుడు... మాస్టారూ... జాలిగా నవ్వేసి...వెళ్ళిపోయారు. అతనికోసం దాచిన అక్కయ్య చేయి ఈనాటికి అలాగేవుంది. కాని...మాస్టారు చాలాదూరం...వెళ్ళిపోయారు.

వెక్కిళ్ళు విన్పించడంతో ఆలోచనల్లోంచి తేరుకుంది కరుణ. కళ్యాణి రెండు చేతులతో మొహాన్ని దాచుకుని ఏడుస్తోంది.

"అక్కయ్యా! ఎంత వెర్రిదానివి, ఎంత పిచ్చి తల్లివి" అంది దగ్గరగా వెళ్ళి తల నిమురుతూ

ఆ రాత్రికూడా కళ్యాణి నిద్రపోలేకపోయింది. ఆ క్షణంలోకూడా మాస్టారువచ్చి పిలిస్తే...వెళ్ళాలనే అనుకుంటోంది మనసు. కాని మాస్టారు రారనే సత్యాన్ని మరచిపోలేకపోతోంది మనసు

"కళ్యాణి! ఎంత పిచ్చిదానివి! ఎండిపోతున్న ఈ జీవితంలో ఏం చూసుకొని ప్రవేశించాలనుకుంటున్నావ్? నా మీద జాలితో సానుభూతితో అలా ఆలోచిస్తున్నావేమో...కాని కళ్యాణీ...అన్నీ కోల్పోయిన నా జీవితంలో, ఏమీ లేదనుకుంటున్న నేను నిన్ను అన్యాయంచేయను కళ్యాణి! ఈ ప్రేమ...ఆకర్షణ అనే వాటిమీదపూరిగా నమ్మకం చచ్చిపోయిన నాకు, 'ప్రేమ' అంటూ, నీ అభిప్రాయాన్ని సమర్థించలేను. నీకు నేను తగను కళ్యాణి! నీ కోరికలు, ఆశలు, నీ జీవితం...ఓహ్...నేనెంత దురదృష్టవంతుణ్ణి కళ్యాణి! వద్దు...నా నీడ కూడా నీకు సోకకూడదు" అంటూ వెళ్ళిపోయిన విజయ్ మాటలు పదేపదే గుర్తుకువచ్చాయ్.

సావిత్రిమ్మ తమ్ముడు శేషాద్రి కళ్యానికి ఓ సంబంధం తీసుకువచ్చాడు.

అబ్బాయి గ్రాడ్యుయేటు. ముగ్గురు అన్నదమ్ములలో రఘురాం చిన్నవాడు. బరువుబాధ్యతలు ఏంలేవు. పెద్దవాళ్ళిద్దరికీ పెళ్ళయి కాపురాలు చేసుకుంటున్నారు. ఇతనికి ఉద్యోగంలేదు

"కనీసం అయిదువేలయినా కట్నం యిచ్చి, లాంఛనాలన్నీ జరిపించాలిట" అన్నాడు శేషాద్రి.

"అమ్మాయి ఉద్యోగం చేస్తోంది మరి...అతడు... మొన్న ఇంటర్వ్యూ ఇచ్చి వచ్చాడు. రేపో మాపో ఉద్యోగం వస్తుంది" అన్నాడు శేషాద్రి.

"వస్తుందంటావా అన్నయ్యా" అమాయకంగా అడిగింది సావిత్రమ్మ.

"తప్పకుండా వస్తుందమ్మా! కుర్రాడు తెలివైనవాడు. ఇదికాకపోతే మరోటి. కాని....కుర్రాడు మనకు దక్కాలంటే వెంటనే చూసుకోవడం మంచిది. కట్నం కూడా చాలాతక్కువే అడుగుతున్నారు" అన్నాడు.

సావిత్రమ్మ అంగీకారం తీసుకున్నాక పెళ్ళిచూపులు జరిగాయి. అమ్మాయి అబ్బాయికి నచ్చింది.

"నీకిష్టమే కదూ అక్కయ్యా!" కరుణ మాటలకు కాదని చేసేదేమిలేదని తెలిసి "ఊఁ...." అంది కళ్యాణి.

"మనస్ఫూర్తిగానే ఒప్పుకుంటున్నావు కదూ!" అంది.

కళ్యాణి చిన్నగా నవ్వేసింది.

పెళ్ళి నిశ్చయం అయిపోయింది.

ముహూర్తాలు నిర్ణయించారు.

సావిత్రమ్మకు ఆనందంగావుంది. రఘురాం ఆమెకు నచ్చాడు. కళ్యాణికి తగినట్టుగా వున్నాడనుకుంది ఆ కన్నతల్లి మనసు.

* *

పెళ్ళి వారం రోజులుందనగా శేషాద్రి కుటుంబంతో వచ్చాడు.


కుశలప్రశ్నలు భోజనాలు అయ్యాకా సావిత్రమ్మ శేషాద్రితో అంతవరకు తాను చేసిన పెళ్ళి ఏర్పాట్ల గురించి చెప్పి ఇంకా ఏమేం చేయవలసి వుందో చెప్పింది.

"పెళ్ళి పనులన్నీ దాదాపు అయినట్టేనమ్మా. ఆడ కూతురువైనా చేసుకున్నావ్" అన్నాడు శేషాద్రి ప్రశంసాపూర్వకంగా.

"ఊఁ ఏం పనులయ్యాయని? అసలు చేయవలసినవి చాలా వున్నాయి.

---

## అసలు విషయం!



"మా తమ్ముడు గంటకు కనీసం అయిదారు జతల బట్టల్ని మారుస్తాడు...నీకు తెలుసా?" అన్నాడు రాము వేణుతో.

"మరి అంత ఫ్యాషనా...మీ తమ్ముడికి!"

"కాదురా...వాడికి అయిదు నెలల వయసు!"

అసలు విషయం బయటపెట్టాడు రాము.

-జూపిటర్

---

పెళ్ళి బట్టలు తెచ్చారా? నగలవి చేయించారా?" అంది రత్నమాంబ భర్త వంక కోపంగా చూస్తూ

"సరిగ్గా ఆ రెండు పనులే మిగిలిపోయాయి వదినా" అంది సావిత్రమ్మ.

"ఇవాళ సాయంత్రం బట్టలకు వెడతామన్నారు పిల్లలిద్దరు" అంది తిరిగి.

"అదేమిటమ్మా వాళ్ళకేం తెలుస్తాయి" దీర్ఘం తీసింది రత్నమాంబ.

"పోనీ వాళ్ళతో నువ్వు వెళ్ళవే రత్నా"

"మొన్న మా వూళ్లో మునసబుగారమ్మాయికి పెళ్ళి అయింది వదినా. సంబంధం మీ అన్నయ్యే కుదిర్చాడు. ఓ వారం రోజులు ముందుగా వాళ్ళింటికి పిలుచుకు వెళ్లారు. బయటి పనులన్నిటికి మీ అన్నయ్యను పిలిచి సలహా తీసుకోవడం, ఇంటి పనులన్నిటిలో ఆవిడ...అదే మునసబుగారి భార్య నేనెంత చెపితే అంత. వాళ్ళ అమ్మాయి కాలేజీల్లో చదువుకున్నా వినయం, నిజంగా వదినా! వాళ్లనుచూస్తుంటే ముచ్చట వేసింది అత్తయాని అత్తయ్యా అంటూ ఏ ఒక్క విషయంలోను నా మాట కాదన్లేదు. అంత చదువుకున్న పిల్ల కదా! నా సెలక్షన్ బావుంటుందని బట్టలకు తీసికెళ్లారు. కాని తీరా అంత దూరం వెళ్ళాకా వాళ్లు చేసిన పని చూస్తుంటే నాకు ఎలాగో అన్పించింది" అంది రత్నమాంబ ముసిముసిగా నవ్వుతూ.

"ఏం చేసారూ?" అంతవరకూ నిశ్శబ్దంగా వున్న రాజు కుతూహలంగా అడిగాడు.

"మా ఇంటిల్లిపాదికి బట్టలు తెచ్చారు" అంది శేషాద్రి వంక సాభిప్రాయంగా చూస్తూ అతను ఇబ్బందిగా కదిలాడు.

రత్నమాంబ మాటలకు గతుక్కుమంటూ అక్కడేవున్న కరుణవైపు చూసింది సావిత్రమ్మ.

"మునసబుగారు కదూ అత్తయ్యా. ఆ మాత్రం పెట్టుకపోతే ఏం బావుంటుంది? అందులోనూ మావయ్య పరాయి వాడు. పరులకష్టం ఎందుకు ఉంచుకోవడం అంటూ పెట్టి వుంటారు! మనం అయితే ఒకరికొకరం సాయం చేసుకుంటాం. కాని కూలి ఇచ్చి నట్టు ఇచ్చుకోం కదా" అన్నాడు రాజు.

రత్నమాంబ మొహం వెలవెలా పోయింది:

"కూలి ఏమిట్రా భడవా?" అనుకుంటూ అడిగాడు శేషాద్రి.

"అంతేకదూ మావయ్యా! ఉత్తపుణ్యానికి ఎవరు పెడతారు ఈ కరువు కాలంలో. శుభ కార్యానికి ఏదో సహాయం చేయడం పుణ్యం ఖరీదు కట్టడం తప్పుకదూ! ఆ పుణ్యఫలం దక్కుతుందా మీకూ?" అన్నాడు.

"ఊ పెద్దపెద్ద మాటలు బాగానే నేర్చావ్. ఈ తెలివి చదువులో వెలగబెడితే బావుండు" అంది రత్నమాంబ

"ఆ మాటకొస్తే నువ్వెంతవరకు చదువుకున్నావ్ అత్తయ్యా ఇంత తెలివిగా మాట్లాడుతున్నావ్"

"రాజా! ఏమిటా మాటలు చిన్నా పెద్దా లేకుండా బయటికి వెళ్లు" అంటూ కరుణ అదిలించడంతో కరుణ వంక కోపంగా చూస్తూ లేచి వెళ్ళిపోతూ-

"నేనేం తప్పుగా మాట్లాడాను? సంబంధం కుదిర్చినందుకు పిల్లలతో సహా ఆరుగురికి బట్టలు పెట్టమని పరోక్షంగా అడుగుతోంది అత్తయ్య. ఎవరో పెట్టారని చెప్పడం మనల్ని హెచ్చరించడం కాదూ? అన్నీ అబద్దాలే! ఆ మనసులు కనీసం మూడు రూపాయలు చేసే రవిక గుడ్డకూడా పెట్టిఉండదు ఈవిడ మాత్రం పెద్ద బడాయిలు. తప్పా" అంటూ మెల్లిగా గొణుక్కున్నాడు

అవేం వినపడని రత్నమాంబ తన మామూలు ధోరణిలో పడిపోయింది.

-డంబరంగా కాకపోయినా ఏలోటు లేకుండా కళ్యాణి పెళ్ళి జరిగిపోయింది పెళ్ళిలో రత్నమాంబకు ఓచీర రవికా. శేషాద్రికి ఓ పంచెల చాపు పెట్టించింది సావిత్రమ్మ

"పరాయి వాళ్ళమా వదినా! ఎందుకు యివన్నీ? రాజు అన్నట్టు మీ అన్నయ్య సంబంధం కుదిర్చాడని కూలి"...

"ఛ...వాడు చిన్నవాడు! తెలిసి తెలియక ఏదో అన్నాడు! అతన్ని మనసులో పెట్టుకోకు వదినా!" అంది సావిత్రమ్మ

మరో వారం రోజులకు యింట్లో పెళ్ళి సందడి పూర్తిగా తగ్గిపోయింది యింట్లో కరుణా సావిత్రమ్మ రాజు మిగిలారు

కళ్యాణి పెళ్ళయి పోవడంతో సావిత్రమ్మ గుండెల మీది బరువు కాస్త తగ్గినట్టు అన్పించింది

మరో రెండేళ్ళకైనా కరుణ పెళ్ళి చేయగలిగితే-అప్పటికి రాజుకు పదహారేళ్ళు వస్తాయి. ఆ తరువాత ఓ నాలుగేళ్ళు కష్టపడితే రాజుకేదైనా చిన్న ఉద్యోగం దొరికితె సావిత్రమ్మ ఊహలు అలా అలా సాగిపోతూ ఎక్కడికో వెళ్ళిపోయాయి

---

## నిత్యం వెలిగే ద్వీపం



సముద్రాలలో అనేక ద్వీపాలు ఉన్నాయి. ఆ ద్వీపాలన్నీ ఏదో ఒక దేశ ప్రభుత్వానికి అనుబంధంగా ఉండే ఉంటాయి. అలాటి లక్ష ద్వీపాలు మనదేశంలోని ప్రజలందరికీ... 24 గంటలూ విద్యుత్‌ను సరఫరా చేయగల్గడంలో విజయాన్ని సాధించింది. ఇలా ద్వీపాలలో పూర్తిగా తన ప్రజలకు విద్యుత్‌ను అందించగల్గిన ద్వీపం... భూగ్రహం మీద... లక్ష ద్వీపం ఒకటేనట-శభాష్ లక్షద్వీపం,

-జూపిటర్

భర్త లేని లోటు ఆమెకు యిప్పుడిప్పుడు బాగా తెలిసివచ్చింది. పిల్లలకు తండ్రి లేని లోటు తెలీకుండా పెంచగలిగింది. కాని...రాజు, యింటికి ఉన్న ఒకే ఒక మగ దిక్కు...చదువు సంధ్యా లేకుండా, ఎవరి భయం లేకుండా చాలా నిర్లక్ష్యంగా జులాయిలా తిరగడం...చూస్తుంటే వాడు ఓ ఉద్యోగస్తుడై సంపాదించి, కళ్యాణి పెళ్ళయి వెళ్ళిపోతే, తనకు దిక్కవుతాడన్న నమ్మకంలేదు. పండి రాలడానికి సిద్ధంగా వున్న ఆకులా వుంది తన జీవితం...ప్చ్...

సావిత్రమ్మకు ఏదో వైరాగ్యం... ఆ తిరువాత నిర్లిప్తత పెరిగిపోయి యింటి విషయాలు ఏది పట్టించుకోకుండా ఆ సమానం ఆలోచిస్తూ, గడపడం, పరధ్యానంలో పడిపోవడం జరగడం చూసి కరుణకేం అర్థంకాలేదు.

రఘురాంకు ఓ ఆఫీసులో ఇంటర్వ్యూ వచ్చింది. కాల్‌లెటర్ చూస్తూనే రఘురాం చాలా సంతోషించాడు. యింట్లో వాళ్ళుకూడా సంతోషించారు కళ్యాణి అదృష్టవంతురాలన్నారు, ఆవిడ ఆ యింట్లో అడుగుపెట్టిన వేళావిశేషం అన్నారు.

రఘురాంకు కూడా నిజమే అనిపించింది. కళ్యాణి ఆఫీసు నుండి వచ్చేసరికి ఆలస్యం అవుతుందని, అతను వెంటనే ఆమె ఆఫీసుకు వెళ్ళాడు.

అతను వెళ్ళేసరికి కళ్యాణి చాలా బిజీగా పనిచేసుకుంటోంది హఠాత్తుగా రఘురాం ఆఫీసుకు రావడంతో ముందుగా ఆమెకు ఏం అర్థం కాకపోయినా, ఆ తిరువాత అతను చెప్పిన వార్త వింటూనే సంతోషించింది.

"సెలవు పెట్టి వచ్చెయ్ కళ్యాణి! అలా సినిమాకు వెళ్దాం" అన్నాడు.

అతని ఉత్సాహం ఆనందం చూసి, ఇంటర్వ్యూ కాల్‌కే యితనింత సంబరపడిపోతున్నాడు ఉద్యోగం వస్తే అసలు మనిషిని పట్టుకోలేం అనుకుంటూ, అలాంటివి ఎన్నో ఇంటర్వ్యూలకు వెళ్ళివచ్చిన అతను—ఆ ఉద్యోగం వస్తుందో రాదోనన్న అనుమానం కనపరచక పోవడంతో ఆశ్చర్యం వేసింది.

"అయితే నాకీ ఉద్యోగం రావొద్దని, రాదని అనుకుంటున్నావా?" అన్నాడు రఘు.

"ఛ..."

"ఏమో! నీ మాటలను వింటుంటే నాకూ అలాగే అన్పిస్తోంది!" నిష్ఠూరంగా అన్నాడు

కళ్యాణి అతనివంక అర్థంకానట్టు చూస్తూ— "మీకు ఉద్యోగం వస్తే నాకంటే ఎక్కువ ఎవరు సంతోషిస్తారు చెప్పండి" అంది.

"అవును మరి! అప్పుడు నీ భర్తకూడా సంపాదిస్తాడు నీకు వేయిచాచడు నీకు డబ్బు మిగులుతుంది" అన్నాడు

కళ్యాణి నిర్ఘాంతపోతూ చూసింది.

రఘురాం ధోరణి అర్థం కాలేదామెకు. అతనితో తాను ఎలా మాట్లాడినా తప్పు

గానే కన్పిస్తుందతనికి. ప్రతి మాటకు. తాను అతన్ని కించపరుస్తున్నట్టుగా భావిస్తాడు. నిజానికి తాను అలా మాట్లాడదు.

రేపు ఏదో జరుగుతుందని ఆశలు పెంచుకుని తీరా అది జరగక బాధపడడం నిజంగా అవివేకమే అన్పిస్తుంది. ఆ విషయం తనకు అనుభవపూర్వకంగా తెలుసు.

దాదాపు రెండేళ్ళుగా అతను ఇలాంటి ఇంటర్వ్యూలు ఎన్నింటికో వెళ్ళివచ్చాడు. దాదాపు నిరాశపడిపోయిన అతడు ఇలా హఠాత్తుగా మారిపోయి, ఆశలు పెంచుకోవడం ఆరోగ్యానికంత మంచిది కాదేమో అన్పించింది కళ్యాణికి. అతనిలోని ఉత్సాహాన్ని చంపాలనికాని, అతని ఆశలను కాదనాలనికాని కాదు ఆమె ఉద్దేశ్యం! కేవలం...అతను అతిగా ఆశించి భంగపడకూడదనే—

ఎందుకంటే— పెళ్ళయిన ఈ నాలుగు నెలల్లో అతని మాటల్లో చాలాసార్లు నిరాశ, నిస్పృహ తొంగిచూశాయి. తనే ఎంతో ధైర్యం చెప్పింది. అతనిలో లోపించిన ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని ప్రయత్నించింది. చీకటి తరువాత వెలుగుంటుందన్న నమ్మకం తనకుంది. కాని...ఆ వెలుగు హఠాత్తుగా వస్తే, వస్తుందని ఆశపడితే— ఒక్కసారి కళ్ళు మిరుమిట్లుగొలిపే వెలుగును భరించలేం. కళ్ళు తెరచిచూడలేం. అలా చూడాలని ప్రయత్నించి కళ్ళు పోగొట్టుకోనూ వచ్చు. అలాకాక, అనుకున్న వెలుగు ఆలస్యంగా వస్తే ఓర్పుతో నిరీక్షించలేకపోనూవచ్చు. అందుకే అతణ్ణి అతడి ఆనందాన్ని అదుపులో పెట్టాలనుకుందితప్ప అతనికి ఉద్యోగం రాకూడదని కోరుకుంటుందా? అతడు తనమీద ఆధారపడతాడని ఆలోచించిందా? అలా ఆలోచిస్తే అసలు పెళ్ళికే అంగీకరిం...

ఇంకొంచెం సేపుంటే నన్నుచూసి —
[illegible] పెట్టుకున్నాడు !!



కాని...

పెళ్ళి జరిగిపోయింది...

తన ప్రమేయం లేకుండానా?

కాదు, తన యిష్టంతోనే! మాస్టారును కోరుకుంది. కాని....మాస్టారు అందని పండులా వెళ్ళిపోయారు. తిరిగివస్తారని...తనకోసం చూస్తారన్న నమ్మకంలేక తాను పెళ్ళికి అంగీకరించింది. రాజీపడిపోయింది జీవితంతో.

కాని...

తనకు మిగిలిందేమిటి?

"కళ్యాణీ!" రఘురాం పిలుపుకు ఉలిక్కిపడింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్?"

"ఊఁ...ఏంలేదు. పదండి!"

"ఎక్కడికి?"

"సినిమాకు వెళ్దామన్నారుగా!"

"నా దగ్గిర డబ్బులేదు. ఎలా వుంటుంది? నేను ఉద్యోగం చేయడంలేదు నాకు ఉద్యోగం రాదని నువ్వు..."

"ఛ" అంది కళ్యాణి మధ్యలోనే.

"నన్ను క్షమించండి! నేనా ఉద్దేశ్యంతో అన్లేదు" అంది.

ఒక్కసారి కళ్యాణి మొహంలోకి చూసి, కళ్యాణి మొహంలో కదిలే బాధను చూసి మౌనంగా ఆమెవెంట నడిచాడు.

"మీకు ఉద్యోగం రాగానే నాకు...మంచి...

"పట్టుచీర కొనిపెడ్తాను" అన్నాడు రఘురాం తిరిగి మామూలు ధోరణిలో పడుతూ.

"ఊఁ..." అంది కళ్యాణి అతని చేతిని మృదువుగా నిమురుతూ

"ఒక్కమాట వింటారుకదూ!" అంది ఆ రాత్రి నిద్రపోయేముందు ఏమిటి అన్నట్టుగా చూశాడు.


"ఏ విషయంలోను తొందరపాటు పనికిరాదు" అంది.

"ఊఁ..." అన్నాడు ఆమెను దగ్గరికి లాక్కుంటూ.

కళ్యాణి దురదృష్టం ఏమిటో కాని, రఘురాం ఇంటర్వ్యూ కెళ్ళి వచ్చాడు. ఉద్యోగం రాలేదు దాంతో యింట్లో చిన్న సైజు యుద్ధం జరిగింది.

రఘురాం కిక ఈ జన్మలో ఉద్యోగం దొరకదన్న తీర్మానానికి వచ్చేసారు యింట్లో వాళ్ళు, ఆస్తి పాస్తులేం లేకపోయినా, అన్నదమ్ముల మధ్య మాటామాటా పెరిగి, తల్లి తండ్రి తీరికగా కూర్చొని చేసిన అప్పులను మాత్రం పంచుకొని విడిపోయారు.

అలా జరగడానికి కారణం ఆ యింట్లో ఏ ఒక్కరు కాదు కాని, ..రఘురాంను



మాత్రం యిలా జరగడానికి కారణం తనకుద్యోగం లేకపోవడంఅన్న విషయంతోపాటు యింకా తనకు ఉద్యోగం దొరక్కుండా వుండడానికి తన దురదృష్టం కాక, కళ్యాణి అన్న భావం పెరిగిపోయి. ఆ భావం కోపంగా మారిపోయింది.

అర్థంలేని కోపం.

ఆధారంలేని అనుమానం!

ఉద్యోగం దొరకని నిస్సహాయత.

సంపాదించుకోలేని అసమర్థత.

కళ్యాణి ఉద్యోగంచేస్తూ తనని పోషిస్తుందనే గిల్టీగా ఫీలవడం...

అన్నిటికీ మించి నిరుద్యోగి అయిన తనను కట్నం యిచ్చిమరీ పెళ్ళి చేసుకున్న కళ్యాణి ఒక ఆడది కావడం, కేవలం మగాడి తోడు నీడ కావాలనే తప్ప తన మీద ఆధారపడి బ్రతకడానికి కాదన్న తన ఆపోహ...అన్నీ కలిసి రఘురాంను రోజు

రోజుకు మనిషిగా మిగలకుండా. కుళ్ళిపోతున్నా. సంస్కారంలేని పశువులా హీనంగా మార్పుసాగాయి

అతని ఆలోచన్లో, మాటల్లో, ధోరణిలో ఎంతో మార్పు అది వికృతంగా, హైరాదికంగా

కొన్నాళ్ళకు...

రఘురాంకు హైదరాబాద్ నుండి ఓ కంపెనీలో క్లర్కు పోస్టుగురించి ఇంటర్వ్యూకు రమ్మని ఉత్తరం వచ్చింది

అతడు వెళ్ళడానికి రెండు వందలు తీసుకొచ్చి యిచ్చింది కళ్యాణి

"నువ్వుకూడా నాతో బయలుదేరు" అన్నాడు

"నేనెందుకు? ఈ రెండువందలు నేను ఆఫీసులోని ఒకరిదగ్గర అప్పుగా తెచ్చాను. నేను రావాలంటే ఈ డబ్బు సరిపోదు" అంది.

"ఏం? రెండువందలు యిచ్చినవాడు మరో వంద యివ్వడా?" అన్నాడు.

కళ్యాణి బిత్తరపోతూ చూసింది.

"చెప్పవేం?" గద్దించాడు

"మళ్ళీ అడిగితే బావుండదు!" అంది.

"ఎందుకు బావుండదు?" అంటూ దగ్గరగా వచ్చి. "ఈ డబ్బు. ఆ ఐట్టతల వెధవ...వాడే మీ హెడ్డుగాడిచ్చాడుకదూ?" అన్నాడు.

"ఊం..." అంది కళ్యాణి అతనేమంటున్నాడో. అతని అభిప్రాయం ఏమిటో అర్థంకాక

"నాకు తెలుసు. వాడిదగ్గరే నువ్వు తెస్తావని ముసలివెధవకన్నీ దరిద్రపు బుద్ధులు" అన్నాడు బయటికి వెళ్ళిపోతూ

కళ్యాణికి కొంచెంకొంచెంగా అర్థం కాసాగింది.

వేరు కాపురం పెట్టినప్పటినుండి తనమీద అర్థంలేని కోపం, కసితోపాటు అనుమానం

అతను సంపాదించడంలేదని తాను చులకనగా చూస్తానని, గౌరవించడంలేదని నిందించడం...ఏ పూటైనా ఆఫీసుకు వెళ్ళడం కొంచెం ఆలస్యమైతే 'వెళ్ళేది ఆఫీసుకేనా. లేక ... అంటూ మధ్యలో నాన్చేయడం త్వరగా వెళితే 'ఫ్యానులు కూడా రారుకదా! వెళ్ళి ఏం చేస్తావో ఒక్కదానివి?' అంటూ నిలేయడం సాయంత్రం ఆలస్యంగా వస్తే 'మ్యాట్నీ కెళ్ళావా? ఎలా వుంది?' అని వ్యంగ్యంగా ప్రశ్నించడం...

మొదట్లో తానంతగా పట్టించుకోలేదు కాని అతని అనుమానం ఎవరిమీదో తెలియక 'పోనిద్దూ! తన అసమర్థతను నిందించుకోలేక నన్నిలా అంటున్నాడు. ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు అతనిలో రోజురోజుకూ పెరిగిపోతూ దాంతో తనపైద విరుచుకుపడుతున్నాడని అనుకునేది.

అంతకాదు—

వేరుగా సంసారం పెట్టుకున్న తరువాత యింటిపనంతా తానొక్కత్తే చేసుకో వాల్సి వచ్చింది. ఉదయం వంటంతా చేసి, ఆఫీసుకెళ్ళేసరికి తనకోసం బోలెడంత వర్క్ ఎదురుచూస్తున్నట్టుగా ఫైల్సన్నీ టేబుల్ మీద పడివుండేవి.

తీరా వచ్చేదేది సాయంత్రం యింటికి వచ్చి, పనంతా చేసుకుని పక్కమీదకి చేరేసరికి మత్తుగా నిద్ర ముంచుకొస్తుంటే రఘురాం వేధింపు.

"ప్లీజ్! ఇవాల్టికి వొదిలేయండి అలసిపోయాను" అంటే—

"ఊఁ...బయటనుండే అంతలా అలిసిపోయివస్తే యింట్లోకూడా ఓ మగాడు వున్నాడని మొగుడనేవాడికి నీ అవసరం వుంటుందని తెలీదూ?" అంటూ సాధింపు.

పెళ్ళయి ఆరునెలలు కాలేదు. జీవితంపట్ల పెంచుకున్న ఆశలు, కోరికలు పునాదులతోసహా సమాధిచేసి జీవచ్ఛవంలా బ్రతుకుతోంది. అర్థం లేకుండా కాలం గడిపేస్తోంది. నిర్వికారంగా యంత్రంలా వుండడానికి శతవిధాల ప్రయత్నిస్తోంది. కాని...ఎంత చంపుకున్నా, మనసనేది ఒకటి తనలో ఏ మూలో దాక్కుని తనను నిలేస్తోంది. చచ్చిపోవడానికి సిద్ధంగా వున్న తన ఆత్మాభిమానం ఏ మూలనుండో ప్రశ్నిస్తోంది...కళ్యాణి. ఇంతేనా నీ జీవితం యింతేనా? అని

జవాబు తనకు తెలుసు

తన జీవితం యింతేకాదు. యిలా కాదు. ఎదురైన జీవితంతో రాజీపడిపోయినా, రోజురోజుకు అంపశయ్యలా మారుతున్న జీవితంతో తాను పోరాడుతున్నా. ఏనాడో ఒకనాడు ఏదో ఒక పరిష్కారం దొరుకుతుంది. గెలిస్తే...తన జీవితం నందనవనమౌతుంది

ఓడితే...

## జడ్జిమెంటు



"నాన్నా...అమ్మ కొట్టింది" ఏడుస్తూ లాయర్ పార్వతీశం దగ్గరకొచ్చాడాయన పుత్రరత్నం.

కొడుకు వీపుమీద ఇంకోటి తగిలించి "సుప్రీం కోర్టు జడ్జిమెంటును హైకోర్టు ఏమీచేయలేదురా!" అంటూ బయటకు నడిచాడు పార్వతీశం.

—జూపిటర్

అవును ఓడిపోతే...

తన బ్రతుకు తన చేతులతోనే సమాధి చేసుకుంటుంది.

ఎంత పిరికితనం?

కాదు...ఇది పిరికితనంకాదు. పిరికితనం అయితే ఆనాడు మాస్టారు వెళ్ళిపోయిన నాడే జీవితంనుండి పారిపోయేది. కాని...పెళ్ళిచేసుకునేదికాదు రఘురాంతో జీవితాన్ని ముడివేసుకునేది కాదు ఇష్టంగానే కాపురం ప్రారంభించింది.

కాని...

అతను భర్తలా కాకపోయినా, కనీసం మనిషిలా ప్రవర్తించడంలేదు. అతన్ని మార్చాలి అతనిలో మార్పు రావాలి. అతనికి ఉద్యోగం దొరికితేకాని మార్పు రాదు. అతను మారితేగాని తన జీవితంలో మార్పురాదు

అతను తనను అర్థం చేసుకోవడంలేదు

తాను అతన్ని అర్థం చేసుకుని, అతని ఇష్టం వచ్చినట్టే కొన్నాళ్ళు తిరిగితే...

అవును. అతను తన దారికి రానప్పుడు తాను అతని దారికివెళ్ళడమే మంచిది. ఏనాటికైనా అతని దారి మారకపోదు. కళ్యాణి ఆలోచనలు ఓ ప్రక్కకునెట్టి. అతనితో ప్రయాణానికి సిద్ధపడింది

ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థులను చూస్తూనే రఘురాం గుండె దిగజారిపోయింది. ఉన్నవి రెండు ఖాళీలు. అభ్యర్థులుమాత్రం యాభై మందికిపైగా వున్నారు.

అది ప్రయివేటు కంపెని. పోస్టులకు అప్లైచేసిన వాళ్ళందరిలో ఎక్కువ మార్కులు వచ్చిన మెరిట్ క్యాండిడేట్సునే ఎంచి మరీ పిలిచారు. అందులో కూడా యాభై మందికిపైగా అభ్యర్థులు తేలారంటే-రఘురాంకు తనకు రాదన్న అనుమానం పెనుభూతంలా మారిపోయి, వెనక్కితిరిగి వెళ్ళమని ఆదేశించసాగింది.

"వెళ్ళిపోదాం కళ్యాణీ!" అన్నాడు.

"ఎందుకు?" అంది అర్థంకాక.

"ఎందుకేమిటి? ఉన్నవి రెండే ఖాళీలు. వచ్చినవాళ్ళు యింతమంది ఇందులో రికమండేషన్లు, లంచాలు ఎన్ని ఉన్నాయో! నాకు వస్తుందంటావా?" అన్నాడు.

అతని అమాయకత్వం చూస్తుంటే జాలి కలిగింది కళ్యాణికి.

"ఇంత దూరం ఎలాగూ వచ్చాంకదా! ఇంటర్వ్యూ అయ్యాక వెడదాం. ఉద్యోగం వస్తేవస్తుంది. లేకపోతే లేదు. ఇప్పుడే వెనక్కి వెళ్ళడం ఎందుకు?" అంది నచ్చచెప్పే ధోరణిలో

నిరాశగా అందరివంక చూడసాగాడు రఘురాం.

అతని నిరాశను గమనించి "ఎందుకలా నిరుత్సాహపడతారు?" అంది అనునయంగా.

ఉదయం పదిగంటలకు వెడితే, సాయంత్రం మూడుగంటలకు రఘురాంను

పిలిచారు చివరి క్యాండిడేటుగా రఘురాం ఇంటర్వ్యూ చేసివచ్చాడు.

వాళ్ళు అడిగిన ఏ ప్రశ్నకు కూడా రఘురాం తృప్తికరంగా సమాధానం చెప్పలేకపోయాడు.

ఆఫీసు ఆవరణ దాటి బయటికి వస్తూనే చెప్పాడు రఘురాం, తనకా ఉద్యోగం రాదని కళ్యాణికి ఆ విషయం ఆఫీసు ప్యూనే చెప్పాడు—

"ఈ ఇంటర్వ్యూ అంతా ఒక పార్సు అమ్మగారూ!"

"బాగా చదువుకున్న వాళ్ళకు రావు రికమెండేషనో లంచమో, ఇవ్వాలి. అవి యివ్వలేనివాడు... యిలా ఇంటర్వ్యూలకు డబ్బు తగలేసి అంతంత దూరం నుండి రావడం...అనవసరం యిప్పుడు ఖాళీలున్న ఉద్యోగాలు ఉదయం ఇంటర్వ్యూ మొదలు కాకముందే భర్తీచేయబడ్డాయి ఎవరో మేనేజింగ్ డైరెక్టరుగారి బావమరిదికి ఇంకోటి మంత్రిగారి క్యాండిడేటుకు" అంటూ. రఘురాం లోపలికి ఇంటర్వ్యూకు వెళ్ళినపుడు, అక్కడే కూర్చున్న కళ్యాణితో చెప్పాడు

కళ్యాణికి అప్పుడే తెలిసిపోయింది. అందుకే రఘురాం చెప్పిన మాటలకు నవ్వుతూ, "ఎందుకు రాదూ? వస్తుంది, అంటూ అతణ్ణి నవ్వించడానికి తెగ ప్రయత్నిస్తూ ఏదో కబుర్లు చెబుతూ మామూలు ధోరణికి తేవాలని ప్రయత్నించసాగింది.

చీకటిపడే వరకు తాసేపు పార్కులో కూర్చుని, స్టేషనుకు బయలుదేరారు విజాగ్‌కి హైదరాబాద్ వచ్చేముందు. ఓ రెండురోజులు అంతాతిరిగి చూసివెళ్దామనుకున్నారు కాని, తీరా వచ్చాకా రఘురాం ఆ రాత్రి వెళ్ళిపోదామనడంతో స్టేషన్‌కు వెళ్ళి టికెట్లు తీసుకున్నారు

రైలు గంటలేటని చెప్పడంతో ఇద్దరూ సిమెంటు బెంచిమీద కూర్చున్నారు. ఓ

---

## అమెరికా తాత-మనవడు



తాత, మనవడు... అమెరికా దేశానికి అధ్యక్షుడిగా ఉన్న సంఘటన ఇంతవరకూ ఒకేసారి జరిగింది. 1889వ సంవత్సరం నుండి 1893వ సంవత్సరంవరకూ అమెరికాకు ఇరవై మూడవ అధ్యక్షుడిగా ఉన్న బెంజ్‌మన్ హారిసన్ తాతగారు 1841వ సంవత్సరంలో అమెరికాకు తొమ్మిదవ అధ్యక్షుడిగా ఉన్నారు ఏమయినా అమెరికాలాటి పెద్ద దేశానికి తాత. మనవడు ఇద్దరూ అధ్యక్షులుగా ఉండటం అతి అరుదైన విషయం. వారి తర్వాత ఇంతవరకూ... ఇలాటి చుట్టరికంతో ఎవరూ...అధ్యక్ష పదవిని చేపట్టలేదు

—జూపిటర్

---

పావుగంటగడిచేసరికి విసుగువేసి, రఘురాం. దగ్గిరేవున్న బుక్ స్టాల్ వైపు వెళ్ళాడు.

ఏదో ఆలోచిస్తున్న కళ్యాణి ప్రక్కనే రఘురాం కనిపించకపోవడంతో చుట్టూ చూస్తూ ఉలిక్కిపడ్డట్లుగా లేచినిలబడింది.

రఘురాం కనిపించక కాదు.

తనకు కొంచెం దూరంలో నిలబడి తనవంకే చూస్తున్న అతణ్ణిచూస్తూ.

క్షణంలో గుర్తించింది కళ్యాణి అతణ్ణి.

ఆమె కళ్ళలో సంతోషం, కన్నీళ్ళ రూపంలో నిండిపోయింది. ఆమె పెదవులు అస్పష్టంగా ఎవరి పేరో గొణుక్కున్నట్టు కదిలాయి వడివడిగా ముందుకు నడిచిందామె.

"మాస్టారూ !" సన్నగా వినిపించిన పిలుపుకు ఆమెవంకే చూస్తున్న విజయ్ మనసులో ఏమూలో దాగిన స్మృతి తాలూకూ గుర్తు గుండెపొరలను చీల్చుకుంటూ బయటకు వచ్చింది.

అవును. కళ్యాణే... ఆ పిలుపు కళ్యాణిదే తొలిసారిగా తననలా, పిలిచింది కళ్యాణి ఒక్కతే... ఎంత మారిపోయింది. కొంచెం చిక్కినట్టుగా వుంది మనిషిరంగు కూడా మారింది.

దగ్గరగావచ్చి ఆగిన కళ్యాణి కళ్ళలో వెలుగు. ఆ వెలుగులో కరిగిపోతున్న కన్నటి పొరతెర.

"బావున్నారా మాస్టారూ ?" అంది దగ్గరగావచ్చి ఆగి, అతనివంకే సూటిగా చూస్తూ

సరిగ్గా రెండు సంవత్సరాల తరువాత చూస్తోంది మాస్టారును. చాలా మారిపోయారు. దీనంగా ఏదో పోగొట్టుకున్నట్టు నిస్సహాయంగా నిరాశగా కనిపించే ఆనాటి మాస్టారులా లేరు. నిండుగా, గంభీరంగా వున్నారు ఆ కళ్ళలో ఆత్మవిశ్వాసం నిండుగా కన్పిస్తోంది ఖరీదైన బట్టలో, నిలబడ్డతీరులో హుందాతనం. అతనికి అందాన్ని ఆకర్షణను పెంచింది

"ఊఁ... మీరెలా వున్నారూ ? అమ్మ, కరుణ, రాజు అంతా బావున్నారా ?" అన్నాడు ఆత్మీయతగా. మాస్టారు రూపంలో వేషంలో మార్పు వచ్చినా మాటలో రానందుకు సంతోషిస్తూ-

"ఊఁ... అందరూ గుర్తున్నారా మాస్టారూ !" అంది

"ఆహాఁ" అన్నాడు ప్రక్కనేవున్న రాఘవయ్యను పరిచయంచేసి

"ఆరోజు... అలా వచ్చేసారేం మాస్టారూ ! నాతో చెప్పకుండా" అని అడగాలనిపించింది. కాని అడగలేకపోయింది కళ్యాణి.

"మీరిక్కడున్నారేం ?" అన్నాడు

"మావారికి ఇంటర్వ్యూ వచ్చింది మాస్టారూ" అంది.

"ఓ..."



"మీరు... మీరెలా వున్నారు మాస్టారూ?" అంది కళ్యాణి. అది అడక్కూడని ప్రశ్న అయినా అడిగింది. అడక్కుండా వుండలేకపోయింది.

ఆ ప్రశ్నకు జవాబుగా చిన్నగా నవ్వి, నిశితంగా ఆమెవంక చూస్తూ "బావున్నావ కళ్యాణి" అన్నాడు. అతడలా నిశితంగా చూడ్డంమాని తలదించుకుంది కళ్యాణి.

"కళ్యాణీ! మీరు మారలేదు" అన్నాడు.

ఆమె తలఎత్తి చూసింది.

అతనెటో చూస్తున్నాడు.

రెండు నిమిషాలు ఎవరికివారే మవునంగా నిలబడిపోయారు. ఏదో అడగాలని,

ఎంతో మాట్లాడాలని వుంది కళ్యాణికి కాని... ఏమీ అడగలేని పరిస్థితి. అడిగినా అతను చెప్పలేని స్థితి

"కళ్యాణీ... మీవారు కన్పించరేం?" అన్నాడు ఏదో మాట్లాడాలని

"ఊఁ..." అంటూ తలతిప్పి చూసింది. తమకు దూరంగా నిలబడి తమవంకే తీక్షణంగా చూస్తున్నాడు రఘురాం అతని చూపులకే శక్తి వుంటే. వాళ్ళిద్దరూ కాలి బూడిద అయ్యేవారేమో!

కళ్యాణి విజయ్ వంక ఓసారిచూసి- "రండి మాస్టారూ మావారిని పరిచయ. చేస్తాను" అంటూ దగ్గరగావెళ్ళి రఘురాంను పరిచయం చేసింది

"నా పేరు విజయ్. కొన్నాళ్ళు వీళ్ళ యింట్లో అద్దెకున్నాను" అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"ఊహుఁ..." అన్నాడు రఘురాం.

"రండి.... అలా కాఫీ తాగుదురుగాని" అన్నాడు విజయ్ మర్యాదగా

"వద్దు" అన్నాడు అసహనంగా విజయ్ యింకా అక్కడ నించోవడం అతని కిష్టంలేదని అతని మొహం చెబుతోంది.

"పద కళ్యాణీ వెళ్దాం!" అన్నాడు కళ్యాణి భుజాన్ని గట్టిగా గుచ్చిపట్టుకుంటూ. అతని కోపం అంతా ఆ పట్టుకోవడంలో భుజాన్ని నలుపుతుంటే కెవ్వుమనబోయి బాధను దిగమింగుకుంటూ "వస్తాను మాస్టారూ! సెలవ్!" అంది కళ్యాణి రెండు చేతులు జోడిస్తూ

రైలు వచ్చేసింది.

వాళ్ళు వెళ్ళినవైపే చూస్తూ నిలబడిపోయాడు విజయ్. తన ఉనికిని మరచి ఇక్కడున్నావా విజయ్" అంటూ వచ్చాడు రంగనాధం రాఘవయ్య అతనికి అతని కంపార్టుమెంటు చూపించాడు

రైలు కదలడానికి సిద్ధంగా వుంది. రంగనాధానికి వీడ్కోలుచెప్పి వెనుతిరిగిన రాఘవయ్య

"పద విజయ్" వెళ్దాం అన్నాడు.

విజయ్ నిశ్శబ్దంగా అనుసరించాడు విజయ్‌లో మళ్ళీ ఆనాటి స్థబ్దత...మవునం... ఆలోచనమాస్తి-

"ఏం ఆలోచిస్తున్నావ్ విజయ్! ఆ అమ్మాయి గురించేనా?" అని అడిగాడు.

"అవును మాస్టారూ! ఆ అమ్మాయి కళ్యాణి చాలా మంచిపిల్ల నేనంటే... వెర్రి అభిమానం...ఎందుకో నాకే తెలీదు"

రాఘవయ్య అర్థమైందన్నట్టుగా "నాకు తెలుసు" అన్నాడు చిన్నగా నవ్వి-

"కాని... అతను... ఆ అమ్మాయి భర్త అంత మంచివాడులా అన్పించడం లేదు"

"అవును" అన్నాడు రఘురాం తీక్షణమైన చూపు జేవురించిన మొహాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ

"నేను ఒంటరిగా సర్వం కోల్పోయి అనాధలా ఏకాకిలా మిగిలి చీకటిలో ఆలోచన ముసుగులో దాక్కోవాలని ప్రయత్నిస్తున్న వేళ- ఈ అమ్మాయి తన అభిమానంతో ఆరాధనతో నన్ను చీకట్లోనే మ్రగ్గిపోనీయకుండా వెలుగు చూపించాలని ఎంత ప్రయత్నించింది. ఓడిపోయి వంచనపాలై నమ్మి ప్రేమించిన మనిషి నాకేమీ కాకుండా నన్ను నిర్దాక్షిణ్యంగా వొదిలిపోతే వీళ్ళు అభిమానంతో నన్ను బ్రతికించారు మాస్టారూ. నేను వారికి బదులుగా ఏమీ ఇవ్వలేకపోయాను. కళ్యాణి కోరికను తీర్చలేని అశక్తత నన్ను వాళ్ళకు దూరంగా పారిపోయి వచ్చేలా చేసింది మాస్టారూ! అయినా ఈనాటికి నేనంటే ఆ అమ్మాయి కళ్ళలో ఎంత అభిమానం" సన్నగా గొణుక్కున్నాడు విజయ్.

ఆరాత్రి చాలా సేపటివరకు నిద్రపోలేక పోయాడు విజయ్

గతం చేసిన గాయం మానని పుండులా మిగిలిపోయి అప్పుడప్పుడు తనను వేదిస్తూనే వుంటుంది ఆ వేదనలోనే చల్లని సమీరంలా కళ్యాణి, ఆత్మీయత నిండిన స్నేహం అభిమానం నిండిన కరుణ ఆదరణ...గుర్తుకువచ్చి కళ్ళు చెమరుస్తాయి.

శాంతితో తన స్నేహం ఎంతత్వరగా పెరిగి పెళ్ళివరకు దారితీసింది. జీవితంలో ఆనందం. సంతోషం ఎలా వుంటుందో అర్ధం అయ్యేవేళ.. శాంతి తనను విడిచి వెళ్ళి



పోయింది. ఒంటరితనం తననుకబళిస్తుందనుకునేవేళ, వీళ్ళ ఆత్మీయత అభిమానం తనను ఉక్కిరి బిక్కిరి చేసాయి. వాళ్ళ అభిమానాన్ని అందుకునే అర్హత తనకు లేదనిపించి, దూరంగా వచ్చేసాడు.

తిరిగి రాఘవయ్య ఆదరణ...తనను ఓ మనిషిలా నిలబెట్టాయి. జీవితం సాఫీగా ఏ ఆలోచన లేకుండా ఓ వ్యాపకం ఏర్పడి పోయింది. అయినా ప్రశాంతంగా వుండె సముద్రాన్ని అలలు కల్లోలం పరిచినట్టుగా గతం తాలూకు స్మృతులు తనను కలవర పెడుతూనే వుంటాయి.

మనసు, మొండిబారిపోయినట్టు అలల తాకిడి అలవాటైన మొండి కొండలా నిలబడాలనే ప్రయత్నిస్తున్నారు.

ఈ మధ్య ఆ శక్తి తనలో కలిగింది. ఏ ఆలోచన రాకుండా, మనసును శరీరాన్ని అలసిపోయేలా పగలంతా ఏదో వ్యాపకం కలిగించుకోవడంతో ఒంటరిగా వుండే సమయం తగ్గిపోయింది.

రాత్రి హాయిగా నిద్రపోగలుగుతున్నాడు. కాని చాలా రోజుల తరువాత...మళ్ళి యివాళ... తన కళ్ళమీదికి నిద్ర రావడంతో అలిసి పోయిన శరీరం విశ్రాంతి కోరినా మనసు కోరుకోవడం లేదు.

* * *

"విజయ్" రాఘవయ్య పిలుపుకు ఆలోచిస్తూ టిఫెన్ తింటున్న విజయ్ తలెత్తి చూసాడు.

"టిఫెన్ తినకుండా ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అన్నాడు మందలింపుగా.

"మీరు ఊరికే కంగారు పడతారండి మాస్టారూ" అన్నాడు విజయ్

"రాత్రంతా నిద్రపోనట్టుగా....కళ్ళు సాక్ష్యం చెబుతున్నాయ్. అసలు విషయం ఏమిటి విజయ్! నిన్న రైలు స్టేషన్‌లో కలిసిన అమ్మాయి గురించేనా?"

"కాదు మాస్టారూ! ఏంలేదు" అంటూ లేచి తనగదిలోకి వెళ్ళిపోయాడు

రాఘవయ్య మరేం అనకుండా అతను వెళ్ళిన వైపు చూస్తూ "రంగయ్యా! కాఫీ అక్కడికే తీసికెళ్ళి ఇవ్వు! నాతో తనకు చెప్పాలనిపించినపుడే చెబుతాడు" అంటూ తనుకాఫీ తాగి ఆఫీసు గదిలోకి వెళ్ళిపోయాడు

అరగంట అయ్యాకా, విజయ్ అకౌంట్సు బుక్సు తీసుకొని వచ్చాడు. రాఘవయ్య ఓరగా అతని మొహంలోకి పరీక్షగా చూసాడు

విజయ్ మొహం ప్రశాంతంగా వుంది

కాసేపట్లో ఇద్దరూ రొటీన్ కార్యక్రమంలో పడిపోయారు.

గడిచిపోయిన రెండు సంవత్సరాలలో యిలా జరగడం మామూలు అయిపోయింది.

విజయ్ ఆ ఇంటికి వచ్చిన కొత్తలో చాలా ఉదాసీనంగా కన్పించేవారు.

కాని-రాఘవయ్య స్నేహంలో ఆత్మీయతలో అతను తనపట్ల కనపరిచే శ్రద్ధా భక్తులను చూస్తూంటే అతణ్ణి బాధపెట్టడం యిష్టంలేక. విజయ్ మామూలుగా తిరగ సాగారు రానురాను అది అలవాటుగా మారిపోయింది.

"అతనెవరు?" రఘురాం కటువుగా ప్రశ్నించాడు.

అతను...ఎవరంటె ఏం చెబుతుంది ఈ నాటికి తన గుండెలో ఆలోచన్లో రూపునింపుకున్న మూర్తి అని ఎలా చెబుతుంది తానిప్పుడు ఏంచెప్పినా. ఎలాచెప్పినా రఘురాం అర్థం చేసుకునే తీరులోనే అర్థం చేసుకుంటాడు

"చెప్పవేం? ఏం చెప్పాలని ఆలోచిస్తున్నావా?" అన్నాడు వ్యంగ్యంగా

"ఆలోచించడానికేం వుంది? అతను మా యింట్లో ఓ గదిలో అద్దెకుండే వాడు"

"ఊఁ... ఇంకా..."

యింకా ఏమిటన్నట్టుగా చూసింది.

"ఎన్నాళ్ళున్నాడు అతను మీ యింట్లో?"

"ఓ సంవత్సరం పాటు"

"అతనొక్కడేనా? అతని స్నేహితులు కూడానా!" అన్నాడు ఏదో తెలుసుకోవా లన్నట్టు కళ్యాణిని గుచ్చిగుచ్చి చూస్తూ.

"అతని భార్య వుండేది".

"ఓహో..." అంటూ తేలిగ్గా నిట్టూర్చి... "ఆవిడుండగానే మీరింత చనువుగా వుండేవారా?" అన్నాడు

కళ్యాణి కళ్ళెత్తి చూస్తూ "చనువుగా ఏముంది మామూలుగా మాట్లాడేవాడు" అతను.

"మరి నువ్వు..."

"నేనూ అంతే"

"మరి...అలా వెర్రిదానిలా పిచ్చిచూపులు చూస్తావేం అతనివైపు. అతను



### పర్మిషన్

"సార్! ఇవాళ సాయంత్రం ఓ గంట ముందుగా ఇంటికి వెళ్ళాలి. నా భార్య షాపింగ్‌కు వెడదామంది!"

"సారీ...నీకు పర్మిషను ఇవ్వను!"

"థాంక్స్ సార్! మీరు పర్మిషన్ ఎక్కడిస్తారోనని ఇందాకట్నుంచీ భయపడి చస్తున్నాను!"

—జూపిటర్

వాకంటే అందంగా వున్నాడనా? అతనికి మంచి ఉద్యోగం వుండి వుంటుంది బాగా సంపాదిస్తాడనుకుంటా"

కళ్యాణి ఏం మాట్లాడలేదు.

"కనిపించిన ప్రతి మగాడి వైపు అలా వెర్రిగా చూస్తావెందుకు?" అన్నాడు.

కళ్యాణి అతనివంక ఓసారి తీక్షణంగా చూసి చూపు మరల్చుకుంది.

రైల్లోకూడా కళ్యాణి చాలా మౌనంగా కూర్చుంది.

మాస్టారును చూసినందుకు సంతోషించాలో ఏడ్వాలో అర్థంకాలేదు

మాస్టారు మామూలు మనిషైపోయాడు. ఎంతో మార్పు వచ్చింది. ఈ రెండేళ్లలో...మాస్టారు గతాన్ని మరిచిపోయి హాయిగా వున్నందుకు తనకెంతో సంతోషం వేసింది.

మాస్టారు పెళ్ళి చేసుకుని వుంటారా?

ఏమో? అడగాలని అడగని ప్రశ్న అది.

ఆ ప్రక్కన నిలబడ్డ పెద్దమనిషి ఎవరో?

మాస్టారుకు పెళ్ళయితే-ఆ అమ్మాయి ఎలా వుందో...మాస్టారును గుండెల్లో దాచుకొని ప్రేమించె అమ్మాయే అయి వుంటుంది. అందుకే మాస్టారు సంతోషంగా కన్పించారు

మాస్టారులాంటి ఉత్తముణ్ణి ఏ ఆడపిల్ల గుండెలో గుడి కట్టుకొని పూజించదు. కాని...

ఆవిడ ఎందుకు వెళ్ళిపోయింది?

మాస్టారు మనసును, ప్రేమను అర్థం చేసుకోలేక డబ్బువెంట పరిగెత్తింది. డబ్బు యిచ్చే సుఖం కోసం, దేవుడిలాంటి మాస్టారును వొదిలి వెళ్ళిపోయింది

పిచ్చితల్లి...మాస్టారును భర్తగా పొందగలిగే అదృష్టాన్ని నిలుపుకోలేని దురదృష్టవంతురాలు. ఆమెను ఎంత ప్రేమించేవాడు ఆవిడపట్ల ఎంత అభిమానం.

"ప్చ్..."

"ఏమిటా నిట్టూర్పులు?" గద్దించాడు ప్రక్కనే కూర్చున్న రఘురాం. ఉలిక్కిపడుతూ సర్దుకు కూర్చుని నవ్వుకుంది కళ్యాణి. ఆలోచించడానికి, నిట్టూర్పు విడవడానికి కూడా అధికారం లేదు తనకు.

రఘురాం దురదృష్టమో, కళ్యాణి దౌర్భాగ్యమోకాని రఘురాం హైదాబాద్ వెళ్ళివచ్చిన ఇంటర్వ్యూ కూడా వ్యర్థమే అయింది. రెండు నెలలు గడిచినా పోస్టింగ్ రాకపోయేసరికి, రఘురాంలో నిరాశ నిస్పృహాతోపాటు, ఎదురుగా కన్పించే కళ్యాణి పట్ల అసహనం, విసుగు కోపం, అర్థంలేని ద్వేషం పెరిగిపోసాగాయి. ప్రతి చిన్న

విషయానికి సాధించడం అసహ్యంగా మాట్లాడ్డం, అడుగడుగునా అనుమానించడం ఎక్కువైపోయింది.

కళ్యాణికి జీవితం నరకంగా తయారైంది. మనసు ఎంతగా మొండిబండగా చేసుకున్నా, అభిమానం అనేది ఏమూలో మిగిలిపోయి అప్పుడప్పుడు రఘురాంకు ఎదురు తిరిగేలా చేసింది. దాంతో, రఘురాం రెచ్చిపోయి, కళ్యాణిపై చేయిచేసుకోవడం మొదలు పెట్టాడు.

మనిషిలోని అసమర్థత, నిరాశ, నిస్పృహ, ఎదుటి మనిషిని ఎంతగా హింసించాలో అంతగా హింసించసాగాడు కళ్యాణిని.

కళ్యాణిలో సహజంగా వున్న ఓర్పు, సహనం నెమ్మదితనం రోజురోజుకు నశించసాగాయి.

మొదట్లో అతని అసమర్థతను సహృదయంతో అర్థంచేసుకుంది. అందుకే అతను నిరాశ పడ్డప్పుడల్లా, నిరుత్సాహంగా మాట్లాడినప్పుడల్లా ఓదార్చి, అతడి పరిస్థితిని సానుభూతితో అర్థం చేసుకుంది.

కాని, తన సహనాన్ని, పరీక్షకు పెట్టి, తన అసమర్థతను దాచుకోవడానికి తనను హింసించడంలో, ఆమెలోని ఓర్పు చచ్చిపోయింది. అతనేమన్నా భరించే శక్తి లేకుండాపోయింది.

అతను చేయిచేసుకున్నప్పుడల్లా, కళ్యాణి నోరు పారేసుకునేది. అతని చేతకాని తనాన్ని అసమర్థతను దెప్పిపొడిచేది. కళ్యాణి అన్నిటినీ భరించినా, తన శీలంపట్ల అతను అనుమానించడం మాత్రం సహించలేకపోయింది. ఆమెలో ఎదురు తిరిగే తత్వం రోజురోజుకు పెరగసాగింది.

---



## వెరైటీ

అమెరికాలోని కాలిఫోర్నియాలో ఓ మంగలిషాపు ఈమధ్య కాలంలో ఎంతో ప్రచారానికి నోచుకుంది. ఆ షాపులో క్రాపు చేయించుకొనేవారు ఒక ప్రత్యేకమైన పద్ధతిలో ప్రవర్తించాలి. వారిని ముందుగా ఓ బల్లమీద పడుకోబెట్టి తాళ్ళతో కట్టివేస్తారు. ఆ తర్వాత వారి కాళ్ళు పైకి, తల కిందకీ వచ్చే ఏర్పాటుచేస్తారు. జుట్టు కింద వేళ్ళాడుతోంటే...దాన్ని చాలా తేలికగా, అందంగా, సమానంగా కత్తిరించవచ్చు ననే ఉద్దేశంతో ఆ మంగలిషాపులో ఈ పద్ధతి ప్రవేశపెట్టారట! అయ్యో అదీ సంగతి!

—జూపిటర్

---

సరిగ్గా అప్పుడే కళ్యాణికి కరుణ దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. "అమ్మ ఆరోగ్యం బాగాలేదు ఒక్కసారి వచ్చి వెళ్ళక్కా !" అంటూ. రఘురాంతో చెప్పి బయలుదేరింది

కళ్యాణి అలా ఓ నాలుగు రోజులు తనకు దూరంగా వెళ్ళి ప్రశాంతంగా గడపడం రఘురాంకు ఇష్టంలేదు. ఆమెపట్ల ఎందుకంత కక్ష పెరిగిందో అతనికే అర్థంకాదు. నిజానికి అలాంటి ఆలోచనా ఏనాడు రాలేదతనికి

ముందుగా కళ్యాణిని వెళ్ళడానికి వీల్లేదంటూ అడ్డుకున్నాడు కాని అతని మాట వినిది. అతని ఆజ్ఞను శిరసావహించే స్థితి దాటిపోయింది కళ్యాణి

ఆఫీసులో సెలవు మంజూరు చేయించుకొని బయటపడింది. ఆమె మనసులో మొండి నిర్ణయం రూపుదిద్దుకుంటూ వుంటే, ఆ నిర్ణయానికి ప్రాణంపోస్తూ.

"నా మాట కాదని వెడితే. ఈ యింటి గడప మళ్ళీ తొక్కడానికి వీల్లేదు." అంటూ అరిచాడు రఘురాం, సినిమాలోని సీరియస్ డైలాగులా.

కళ్యాణి నిర్లక్ష్యంగా అతని వంక చూసి నవ్వేస్తూ వెళ్ళిపోయింది.

రఘురాం అహం దారుణంగా ఓడిపోయింది. తన మాటలకు, చేతలకు అణిగి మణిగి పడివుంటుందనుకున్న కళ్యాణి, తన నింత తీవ్రంగా నిరసించి, నిర్లక్ష్యంగా వెళ్ళిపోయిందంటే కారణం ఏమిటి? ఎవరూ?

తనకు ఉద్యోగం లేకపోవడమా?

లేక...కళ్యాణి... తాను అనుమానించినట్టు కాదు... తాను ఊరికే...ఉత్తనే అన్నాడు...కాని...కళ్యాణి అలా చేయదు... అలా చేయలేదుకూడా తను రావొద్దంటే రావంది-కాని...వస్తుంది-తప్పకుండా వస్తుంది.

క్షణాల్లోనే అతనిలోని అలజడి, భయం, దిగులు లాంటివి అతనిలోని మగవాడి నన్ను అహం మింగేసింది

కళ్యాణిని చూస్తూనె సావిత్రమ్మ కళ్ళు నీళ్ళతో నిండాయి. చిక్కిపోయి, నల్లగా అయిపోయిన కూతురిని రెండు చేతులతో దగ్గరకు తీసుకుంటూ.

"ఇలా అయిపోయావేం తల్లీ ఒంట్లో బావుండడం లేదా?" అంది.

కళ్యాణి పేలవంగా నవ్వి "నేను బానేవున్నానమ్మా నీ ఆరోగ్యం ఎలావుంది రమ్మని ఉత్తరం ఎందుకు రాసావ్?" అంది.

"నిన్ను చూడాలనిపించింది తల్లీ! అలా అడుగుతావేం కళ్యాణీ... అల్లుడు ఏమైనా అన్నాడా?" ఆందోళనగా అడిగింది.

"ఆయనేం అన్లేదు ఆయనకు ఇబ్బంది అవుతోందని" అంది.

"అంతేకదా! అతవేం అన్లేదుకదా! ఏమిటో నిన్ను హఠాత్తుగా చూడాలనిపించింది తల్లీ" అంది

"నేనే వద్దామనుకుంటున్నానమ్మా! మిమ్మల్నందరినీ ఓసారి చూడాలనిపించింది

కాని... ఇంత హఠాత్తుగా అనుకోలేదు"

చూడటానికి ఎప్పుడైతే ఏంటే తల్లీ వచ్చావు నిన్ను చూసాను. తృప్తిగావుంది" అంది

"అలా అంటావేం అమ్మా! యిక నన్ను చూడలేననుకున్నావా."

"నువ్వు కన్పించవని కాదుతల్లీ... నేను... నేనే... నిన్ను చూడకుండానే... వెళ్ళిపోతానేమోనని" అంది.

"అమ్మకు మొన్న ఓ కల వచ్చిందిట అక్కయ్యా! ఆ కల్లోనేమో నువ్వు... నీకేదో అయినట్టు" రాజు మాటలకు కోపంగా చూస్తూ-


"ఏదో పాడుకలలే తల్లీ పీడకల యిప్పుడు ఎందుకు? వాడలా ఏదేదో వాగుతాడు కాని... వెళ్ళి స్నానంచేసి భోజనం చేయి. ఈలోగా కరుణ ప్రయివేట్లు నుండి వచ్చేస్తుంది" అంది

"కరుణా! మాస్టారు! కన్పించారు" అంది కళ్యాణి భోజనాలుచేసి అక్కాచెల్లెళ్ళిద్దరు డాబాపైకి చేరాకా.

"ఎక్కడా... ఎలావున్నారూ?" ఆతృతగా అడిగింది కరుణ.

"ఆరునెలల క్రితం... హైదరాబాద్ వెళ్తే.... రైల్వేస్టేషన్‌లో చాలా బావున్నారు. పెళ్ళికూడా అయినట్టు వుంది. పక్కనే ఎవరో ముసలాయన... వున్నారు."

"... ... మాట్లాడారా"



"ఆc..." అంటూ ఆ రోజు జరిగిందంతా చెప్పింది.

"పాపం! మాష్టారు మ:చివారక్కా! దేవుడెప్పుడూ వాళ్ళకి మేలు చేస్తాడు" అంది కరుణ

"ఊc..."

విషయం విన్న సావిత్రమ్మకూడా... "పోనిద్దూ ఆ మాష్టారు క్షేమంగా వున్నారు" అంది.

కళ్యాణి వచ్చి వారం పదిరోజులు దాటిపోయింది తిరిగి వెళ్ళే ప్రయత్నం కన్పించలేదు. సావిత్రమ్మకు అనుమానం వేసింది

"అల్లుడికి ఇబ్బందిగా వుంటుంటి పోనీ...రమ్మని రాయకూడదమ్మా! అప్పుడె నువ్వొచ్చి వారం పదిరోజులైంది" అంది సూటిగా అడగలేక

"ఊc.... ఇబ్బందేంకాదులే అమ్మా!" అంటు అక్కడ నిలబడకుండా లోపలికి వెళ్ళింది

వచ్చినప్పటినుండి కూతురి ధోరణి అర్ధంకాలేదు సావిత్రమ్మకు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టు ముభావంగా వుండె కళ్యాణిలోని మార్పు ఎందుకు అర్ధంకాక అతనికి ఉద్యోగం దొరకనందుకేమో అనుకుంది

అమాటే అడిగితే-"నాకుంది కదమ్మా ఉద్యోగం ఆయనకు దొరకాల్సిన ఉద్యోగం కంటె పెద్ద ఉద్యోగమే చేస్తూ. అక్కడ ప్రతి నిముషం. నన్ను సుఖపెట్టడానికి ప్రయత్నిసున్నారు" అంది అసలు విషయం ఏమిటో అర్ధంకాకుండా

"అలా అంటావేం అక్కయ్యా!" అంది కరుణ రాత్రి నిద్రపోయే ముందు

"కరుణా! నేను....యిక అక్కడికి వెళ్ళను కరుణా నాకు వెళ్ళాలనిలేదు. ఆయనకు ఉద్యోగం దొరకలేదని, సంపాదించి నన్ను సుఖపెట్టడం లేదనికాదు నా బాధ. ప్రతిక్షణం నన్ను అనుమానిస్తూ, శంకిస్తూ, అవమానిస్తూనన్ను బాధపెట్టడమే తన ధ్యేయంగా పెట్టుకొని ప్రవర్తించే ఆ మనిషితో కలిసి నేనిక బ్రతకలేను కరుణా!"

"మనసు చంపుకొని, అతణ్ణి పెళ్ళి చేసుకొని, జీవితంతో రాజీ పడాలనుకొని నేను చేసిన ప్రయత్నమంతా వృధా అయింది. ఉద్యోగం వెతుక్కోవాలనె ప్రయత్నం కంటే నేను ఆఫీసులో ఏం చేస్తుంటాను. ఎవరితో మాట్లాడతాను. వీటి గురించి ఆరాలు తీస్తూ, నలుగురిలో నేనొక బజారు దానికంటె హీనంగా నిలబడెలా చేస్తున్నారు"

"అతను నన్ను ప్రేమించకపోయినా ఫర్వాలేదు. భార్యలా గౌరవించి అభిమానించకపోయినా బాధపడేదాన్ని కాదు. నన్నొక మనిషిలాకూడా గుర్తించడు కరుణా... నామీద బోల్డు అనుమానం"

"హైదరాబాద్‌కు ఇంటర్వ్యూకు వెళ్ళి వస్తుండగా మాస్టారు కలిసారు. మనింట్లో అద్దెకుండేవాడని తెలిసి ఎన్నాళ్ళు వున్నాడు, ఎందుకు వెళ్ళిపోయాడు...నాతో మాట్లాడేవాడా...యివన్ని తరచి తరచి అడిగేవాడు. దాంతో విసిగిపోయి...శాంతి విషయం

కూడా చెప్పాను. అనుమానం తీరుతుందేమోనని"

"అది విని ఆయనేమన్నార్రా తెలుసా...శాంతి అలా చేయడానికి...నేనే కారణమేమోనని..."

"నవ్వాలో ఏడ్వాలో అర్థంకాలేదు కూడా...అమ్మకి విషయం చెప్పకు నేను మాత్రం వెళ్ళను. ట్రాన్స్‌ఫర్‌కు అప్లై చేసాను. వస్తే...వెళ్ళిపోతాను. అమ్మ నేను అతని దగ్గరికే వెళ్ళాననుకుంటుంది ఆవిడ ఆరోగ్యం బాగాలేదు. నా విషయంవిని, మరింత బాధపడి ఆరోగ్యం పాడు చేసుకుంటుంది" అంది.

కరుణ మాట్లాడలేదు

కళ్యాణి, కళ్ళు తుడుచుకొని, నిబ్బరంగా నవ్వుతూ.

"ఒంటరిగా ఎక్కడో.. విహంగలా వుంటాను కరుణా! నాఆత్మను, ఆశలను కోరికలను చివరికి నాఊపిరిలాంటి ఆత్మాభిమానాన్ని చంపుకొని, అతనితో రాజీపడడానికి ప్రయత్నించాను. కాని...మనిషి మంచితనం, రాజీతత్వం, ఎదుటి మనిషికి నిస్సహాయంగా, పిరికితనంగా కన్పించి, మరింత అలుసుకు దారితీస్తుందనుకోలేదు నా సహనాన్ని పరీక్షించి, ఓడిపోయి ఆ ఓటమిని అక్కసుగా మార్చుకొని, మరింతగా హింసించాడు చివరికి...పశువులా నన్ను కొట్టి...ఛ...ఏడుస్తున్నావా కరుణా! వద్దు చెల్లి...జరిగిపోయిన జీవితం—మళ్ళీ ఆ జీవితంలోనికి నేను అడుగు పెట్టదలచుకోలేదు. వాకిక మిగిలింది స్వేచ్ఛా జీవితం..." అంటూ ఏడుస్తున్న కరుణ కళ్ళు తుడిచి. పకపకా నవ్వింది కళ్యాణి.

కరుణ కల్యాణి వంక భయంగా చూసింది. పిచ్చిదానిలా నవ్వుతోంది కల్యాణి.

"నా నవ్వు చూసి భయపడుతున్నవా? నాకు అంత అదృష్టం కూడా వుందా కరుణా" అంది

కళ్యాణి నవ్వినా, కళ్ళలోనుండి కన్నీళ్ళు కారిపోసాగాయి.

---



## లంచం

"ఏమిటీ...నాకే లంచం ఇస్తావా? పోలీసుల్ని పిలవమంటావా...ఆఁ..." మంత్రిగారు ఒంటి కాలి మీద లేచారు.

"మీరు లంచం తీసుకోందే...ఏ పనీ చెయ్యరని మా నాన్న చెప్తేనూ..." గొణిగాడు పీతాంబరం!

"ఆ...ఎవడ్రా మీ నాన్న?"

"మీ దగ్గర పర్సనల్ సెక్రటరీగా పనిచేస్తున్నాడండీ..."

—జూపిటర్

"నేను తప్పు చేస్తున్నానంటావా కరుణా?" అంది.

"లేదు. లేదక్కా! నువ్వు ఎప్పుడు తప్పుచేయవు పిరికిదానిలా జీవితాన్ని చూసి భయపడకుండా ధైర్యంగా బ్రతికాలనుకుంటున్నందుకు—నాకు సంతోషంగానే వుంది" అంది కరుణ

హఠాత్తుగా యింటికి వచ్చిన రఘురాంను చూస్తూనే కళ్యాణి బిత్తరపోయింది. విషయం తెలిని సావిత్రమ్మ మాత్రం రఘురాం రాకను మరోలా ఊహించుకొని-

"అమ్మాయి వస్తానంటే నేనే రెండురోజులు వుండమన్నాను బాబూ!" అంది.

రఘురాం మాటాడలేదు. రెండురోజులు మామూలుగా గడిపి బయలుదేర మన్నాడు.

కళ్యాణి రానంది.

అవును. ఎందుకొస్తావే? ట్రాన్స్ఫర్‌కు ప్రయత్నిస్తావా. ఎవడిస్తాడో చూస్తాను. నీ ఆఫీసుకెళ్ళి నీ సంగతి అందరితో చెప్పేసాను. తలెత్తుకోకుండా చేసాను! వేషాలు వేద్దామనుకుంటున్నావేమో! ఏం.... మొగుడు కాకుండా... ఆఫీసులోని వెధవలు కాకుండా మరో ఊరివాళ్ళు కావాల్సివచ్చారా? ఏం వీళ్ళందరి మీద మోజు తీరిపోయిందా. నువ్వు హైద్రాబాద్‌కు ట్రాన్స్ఫర్ ఎందుకు పెట్టుకున్నావో నాకు తెలుసు నీ పాత ప్రియుణ్ణి కలుసుకోవాలనేగా..." అంటూ అరిచాడు.

"అవును" అంది కళ్యాణి మొండిగా. తన ఆఫీసుకెళ్ళి అతను గొడవచేసాడన్న విషయం వూహించుకుంటేనే. కళ్యాణి సగం ప్రాణం చచ్చిపోయింది. అందుకని కసిగా మొండిగా జవాబిచ్చింది

ఆ జవాబుతో రెచ్చిపోయాడు రఘురాం. సావిత్రమ్మ చూస్తుండగానే కళ్యాణిని గొడ్డును బాదినట్టు బాదసాగాడు.

అడ్డుకున్న సావిత్రమ్మను కరుణను ప్రక్కకు తీసేసి కళ్యాణి పీకను గట్టిగా నొక్కబోయారు. రాజా వెనకనుండివచ్చి, రఘురాంను బలుగుతన్ని లాగి ప్రక్కకు లాగాడు.

రాజా! ఈ బికారి వెధవను బయటకు లాగేయరా? లోఫర్ వెధవ... పెళ్ళాం ఉద్యోగంచేసి సంపాదించే డబ్బు కావాలి. కాని పెళ్ళాన్ని ప్రేమించలేడు. తన చేతకాని తనాన్ని అసమర్థతను యిన్నాళ్లు భరించాను. ఒక ఆడదానిగా. భార్యగా సహించాను. ..

నా సహనం అతనికి అలుసుగా కన్పించింది. పెళ్ళయిన నాటినుంచి-నన్ను హింసించడమే ధ్యేయంగా పెట్టుకొని అనుమానాలతో నన్ను చిత్రహింస చేస్తున్నాడు. యిక నేను భరించలేను. లోకానికి నేను కులటనన్నట్టుగా ప్రతిక్షణం నన్ను నిందిస్తూ, పరిచయంచేస్తూ చివరికి... ఆఫీసుకెళ్ళి నాకున్న పరువును నాశనంచేసిన పిణ్ణి... తరిమేయ్ ..."పిచ్చిదానిలా అరిచింది కళ్యాణి.



కళ్యాణి మాటలను, పిచ్చి అరుపులు, కన్నీళ్ళను చూసి రఘురాం ఆవిడ గొంతు నులిమిన సంఘటన గుర్తుకొచ్చి, రాజు రఘురాంను బయటికి గెంటేసాడు.

సావిత్రమ్మ నెత్తి నోరు బాదుకుంది.

అది వెర్రి ఆవేశంలో అరిస్తే...నువ్వు...అత్తణ్ణి తరిమేస్తావుటా? వెధ వెధవ...మగ దిక్కువై దాని సంసారాన్ని తీర్చి దిద్దాల్సింది పోయి...నువ్వే నాశనం చేస్తావా? అంటూ రాజును కసి తీరా కొట్టింది సావిత్రమ్మ.

తన కళ్ళ ముందే కూతురు నిండు జీవితం నాశనమై పోయింది. సుఖంగా కాపురం చేసుకుంటుందనుకున్న కూతురు జీవితం ఎంత అధ్వాన్నంగా వుందో గ్రహించిన ఆమె గుండె బద్దలై పోయింది.

ఆ రాత్రి ఆ యింట్లో ఎవ్వరూ తిన్లేదు. బయటికెళ్ళిన రాజు తిరిగి యింటికి రాలేదు

ఆ రాత్రి...కళ్యాణి—

జీవితం తనతో రాజీ పడలేదని తెలిసి, తను రాజీపడి, అన్నికోల్పోయి విష[illegible] ఓటమి మిగుల్చుకొని సావిత్రమ్మను కరుణను వొదిలేసి వెళ్ళిపోయింది.

చెట్టంత కూతురు కళ్ళ ముందే కాలి బూడిదై పోవడం చూసిన సావిత్రమ్మ బల హీనమైన గుండె కొట్టుకోవడం ఆగిపోయింది

కిరణ ఒంటరిదై పోయింది.

ఆ రోజు కూడా, రాఘవయ్య హడావుడిగా బయలుదేరతీసాడు.

"మీరు వెళ్ళండి మాస్టారూ! నాకు చాలా పనివుంది అకౌంట్సు చూడాలి" అన్నాడు విజయ్.

"ష్...ఎప్పుడూ ఎకౌంట్సు చూడ్డమేనా! విజయ్! నా అభిమాన హీరో... రెండు విభిన్న పాత్రల్లో కృష్ణుడు దుర్యోధనుడు...ఓహ్...అద్భుతంగా వుంటుంది పద...టికెట్టు తెప్పించాను. ఎన్నాళ్ళ నుండో అనుకుంటున్నాను విజయ్! ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురుచూసాననుకో....తీరా వచ్చాకా టికెట్లు తెప్పించాకా నువ్వు రానంటె...నేను వెళ్ళను" అన్నాడు కుర్చీలో కూర్చుంటూ.

ఆతడు అలిగినట్టుగా కూర్చున్న తీరు చూసాక విజయ్‌కు నవ్వు వచ్చింది.

"తప్పదంటారా?" అన్నాడు.

"ఊహుఁ... తప్పదు"

"పదండి మరీ!" అన్నాడు.

వీళ్ళు వెళ్ళేసరికి మ్యాట్నీ వొదిలెట్టెమైంది టికెట్లు యిచ్చె కౌంటర్ల దగ్గర పెద్ద పెద్ద క్యూలు... ఎక్కడ చూసిన జనం గుంపులు గుంపులుగా వున్నారు.

రాఘవయ్య కనుబొమలెగురవేస్తూ, చిత్రంగా విజయ్‌వంక చూస్తూ.

"చూసావా! ఎంత జనం వచ్చారో... అన్నాడు.

విజయ్ చిన్నగా నవ్వేసాడు.

రాఘవయ్యకు విజయ్ నవ్వు గ్రీన్ సిగ్నల్‌గా అనిపించి చూడబోయె సినిమా గురించి అభిమాన నటుని నటన గురించి చెప్పడం మొదలు పెట్టాడు బోర్‌గా లేక పోయినా విజయ్ ఆసక్తిగా వినలేక చుట్టూరా చూడసాగాడు.

సినిమా హాలులో రష్ చాలా వుంది. ఆంధ్రుల అభిమాన నటుని సినిమా ఆ రోజే విడుదల అయింది. పైగా రెండు విభిన్న పాత్రల్లో నటిస్తున్న సినిమా! రాఘవయ్య రెండు టికెట్లు రిజర్వు చేయించాడు.

విజయ్‌కి మొదటినుండి సినిమాలపట్ల ఆసక్తి తక్కువ అభిమాన నటుని సినిమా. మొదటిరోజే చూడాలన్న ఉత్సాహం మరీ తక్కువ ఆతని ప్రపంచం చిన్నప్పటి నుండి పుస్తకాల చుట్టే అల్లుకొని వుంది. గురజాడ నుండి సినారె వరకు వాళ్ళ కవిత్వం గురించి కవిత్వంలో వచ్చిన మార్పు గురించి అనర్గళంగా మాట్లాడగలడు. అటు శరత్ సాహిత్యం నుండి, రంగనాయకమ్మ వరకు, స్త్రీ పాత్రలు వాళ్ళకు ఆ నాటికి ఈ నాటి సమాజంలో వున్న స్థానం గురించి గుక్క తిప్పుకోకుండా మాట్లాడగలడు చెప్పగలడు. కాని సినిమాలగురించి విజయ్‌కు అంతగా శ్రద్ధాలేదు ఆసక్తిలేదు.

రాఘవయ్య మాత్రం వయసుపై బడ్డా సినిమాల పిచ్చిమాత్రం తగ్గలేదు ఎంత పన్లో వున్నా కొత్త సినిమా వచ్చిందనగానే, చిన్నపిల్లలకంటే అధ్వాన్నంగా ఉత్సాహంతో. రంగయ్యను తీసుకొని వెళ్ళిపోతాడు. విజయ్ వచ్చాకా విజయ్‌తో వెళ్ళిపోవడం.

ప్రతిసారి వెళ్ళడం విజయ్‌కి ఇష్టం వుండేది కాదు ప్రతి చెత్త సినిమాకు రాఘవయ్య బయలుదేరదీసే వాడు. రంగయ్యా వెళ్ళి టికెట్లు తీసుకు వచ్చేవాడు

"మీరిద్దరు వెళ్ళండి మాష్టారూ నేను ... చదవాల్సింది వుంది అని తప్పించుకు చూసేవాడు కాని... రాఘవయ్య —

"పద విజయ్" అంటూ మరేం మాట్లాడకుండా బయలుదేరతీసేవాడు.

"నాకున్న ఒకేఒక వ్యసనం, వ్యాపకం ఇదొక్కటే విజయ్! మనకున్న ఒంటరితనం కాసేపు మరిచిపోవచ్చు పద పద" అంటూ హడావుడి పడిపోయేవాడు.

సినిమా వొదిలారు జనం ప్రవాహంలా వస్తున్నారు. విజయ్ జేబులో ఏదో కదులుతున్నట్టు అన్పించి చటుక్కున జేబును గట్టిగా అదిమి పట్టుకున్నాడు. జేబులోకి దూరిన ఎవరిదో చేయి విజయ్ గుప్పిట్లో బిగుసుకుపోయింది.

విజయ్ వెనక్కి తిరిగి చూసాడు ఎదురుగా పదహారేళ్ళ కుర్రాడు అతని కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయాయి విజయ్‌ని చూస్తునే ఆ కుర్రాడి కళ్ళలో తనను గుర్తించిన ఆశ్చర్యంతో పాటు, సిగ్గు కదిలాయి తల వాల్చుకొని నిలబడిపోయాడు.

"రాజూ... నువ్వు...." విజయ్ ఏదో అనేలోగానే రాజు చేయి విదిల్చికొని జనంలో కలిసి పోవాలని చూసాడు కాని విజయ్ రాజును వొదల్లేదు, అతను రా

## పాపం.... ఆడపిల్ల!



చైనాలో 'ఒక్కరే సంతానంతో తృప్తిపడండి' అనే ప్రభుత్వ ఆదేశంవల్ల అక్కడ పుట్టిన ఆడపిల్లలకు ఎంతో అన్యాయం జరుగుతోంది. 'మగపిల్లలు మాత్రమే తమ కుటుంబాన్ని ఆదుకోగలరన్న మూఢనమ్మకంతో, కొన్ని గ్రామాలలోనివారు ఆడపిల్ల పుట్టగానే, ఆ పిల్లను గుట్టుచప్పుడు కాకుండా చంపుతున్నారట! అంతేకాదు. నాలుగైదేళ్ళ ఆడపిల్లల్ని పసిపాపల్ని... కాలువలో చంపిపారేస్తున్నారట! అలా పుట్టిన ఆడపిల్లను చంపేస్తే ఇంకోసారి వచ్చే ఛాన్సులోనయినా మొగపిల్లవాడు పుడతాడనే ఆశతోనే, ఈ హత్యాకాండ జరుగుతోందట! అలాగే ఆడ సంతానాన్ని కన్న స్త్రీలను హత్య చెయ్యడమో, వారికి విడాకులు ఇవ్వడమో జరుగుతోందటకూడా! కొందరైతే అత్తలు, భర్తల ఆగడాలు భరించలేక ఆత్మహత్యలుకూడా చేసుకుంటున్నారట!

—జూపిటర్

చేయిని గట్టిగా పట్టుకొని రాఘవయ్య వైపు తిరిగి "మాస్టారూ మీరు వెళ్ళి కూచోండి. నేను వచ్చేస్తాను" అంటూ రాజును తీసుకొని జనంలో కలిసిపోయాడు

రాఘవయ్యకేం అర్థం కాలేదు. తరువాత విజయ్ చెపుతాడని అక్కడే నిలబడి పోయాడు.

విజయ్ రాజును దగ్గరగా వున్న హోటల్‌కు తీసుకువెళ్ళాడు.

"ఏం తింటావ్ రాజా?" అన్నాడు.

రాజు అడ్డంగా తలూపాడు ఏమీవద్దన్నట్టు.

"నీకు పూరి అంటే ఇష్టం కదూ!" అంటూ పూరికి ఆర్డరిచ్చాడు. విజయ్ తనవేమైనా అడుగుతాడని లోలోపలే బిక్కచచ్చిపోతూ రాజు తలవంచుకొని కూర్చున్నాడు

టిఫిన్ తినడం పూర్తయింది. కాని విజయ్ ఏమీ అడగలేదు.

"రాజా సినిమా చూస్తావా?" అని అడిగాడు.

"ఊఁ...ఉహూ"

"మరి..."

"వెళ్ళిపోతాను"

"ఏం సినిమా చూడ్డానికి భయం వచ్చింది నువ్వు. పదపద ఆలస్యం అయి పోయింది మాస్టారు మనకోసం ఎదురు చూస్తుంటారు" అన్నాడు.

"మాస్టారూ మరో టిక్కెట్టు కావాలి" అన్నాడు విజయ్

"నాకు తెలుసు. మనకు మరోటికెట్టు కావాలని అందుకే ఇందాకా కొన్నాను"

"బ్లాకులోనా?"

"కాదయ్యా బాబూ! ఎవరో ఆడమనిషి...వాళ్ళాయన రాలేదుట యిచ్చేసింది పద" అన్నాడు

తరువాత కొన్న టికెట్టు నెంబరు మరోటి కావడం వల్ల రంగయ్యను అక్కడికి పంపి, రాజును విజయ్ తన ప్రక్కనే కూర్చోబెట్టుకున్నాడు.

రాఘవయ్య సినిమాను చూసినా, విజయ్‌కు మాత్రం సినిమావైనే చూపువున్నా మనసు ఆలోచనలు ఎక్కడో...

సినిమా వొదలగానే, రాజును తమతో పాటు ఇంటికి తీసికెళ్ళారు.

భోజనాల దగ్గర కూడా మౌనంగా వున్నారు.

రాజుకు తన గదిలోనే మంచం వేయించారు విజయ్.

"గుడ్‌నైట్ రాజా" అంటున్న విజయ్ కాళ్ళమీద వొరిగిపోతూ "నన్ను క్షమించండి మాస్టారు" అంటూ బావురుమన్నాడు

"రాజా నువ్వు దుడుకువాడివని, అల్లరి పిల్లాడివనే అనుకున్నాను. పిల్లలలో అది సహజం. కాని...యిలా...ఇలా దొంగతనాలు కూడా చేస్తావని అనుకోలేదు రాజా. అసలు నువ్వు..."

"మావారికి ఇంటర్వ్యూ వస్తే వచ్చాం మాస్టారు!" అని అంటే "అతనికి ఉద్యోగం లేదు ఇంతవరకు ఇంకా రాలేదు అందుకని..." విజయ్ ఆలోచనలను మధ్యలోనే ఆపేస్తూ

"ఆ...మాస్టారూ! నాకేదైనా పని యిప్పించండి మాస్టారూ! నేను ఇక్కడే మీ దగ్గిరే ఉంటాను. తిరిగి నన్ను వెనక్కి మాత్రం పంపించొద్దు" అన్నాడు.

"అలాగే...నువ్వు నిశ్చింతగా నిద్రపోరాజూ! రాఘవయ్య మాస్టారు చాలా మంచివారు. నేను ఆయనతో చెప్పి నీకు పని ఇప్పిస్తాను సరేనా?" అన్నాడు రాజుకు హామీ ఇస్తూ

ఆ మర్నాడు—

విజయద్వారా రాజు విషయం విన్న రాఘవయ్య, రాజును తమ యింట్లోనే వుండి చదువుకోమని చెప్పాడు. కాని, రాజుకు చదువుమీద శ్రద్ధ ఏమాత్రం లేదని తెలిసి, తమ కంపెనీలోనే పని నేర్చుకోమని చెప్పాడు రాఘవయ్య.

విజయ్ రాజును తనవెంట ఫ్యాక్టరీకి తీసికెళ్ళి చేయాల్సిన పనిచూపించివచ్చాడు.

ఓ వారంరోజులు గడిచాక అడిగాడు, "రాజూ! అమ్మవాళ్ళకు ఉత్తరం రాయవూ?"

"ఊహుఁ"

"ఏం?"

"ఇప్పుడే వద్దు మాస్టారూ! ఇంకా కొన్నాళ్ళు పోయాకా"

ఆశ్చర్యంగా చూశాడు విజయ్

"నా కాళ్ళమీద నన్ను నిలబడనీయండి మాస్టారూ! అంతవరకు నేను నా ఉనికి వాళ్ళకు తెలియకుండా వుండడం మంచిది. మీరుకూడా నాకు తెలీకుండా ఉత్తరం మాత్రం రాయకండి ప్లీజ్!" అన్నాడు.

విజయ్ పరీక్షగా రాజువంక చూస్తూ, "అలాగే నేను రాయను కాని...రాజూ! నీ గురించి తెలియక వాళ్ళు కంగారుపడిపోరూ!"

"ఆ పడడం జరిగిపోయి నెలరోజులకుపైగా అయింది మాస్టారూ!" అన్నాడు.

విజయ్ తల వంచి వుండిపోయాడు.

రాజుమాత్రం చాలా శ్రద్ధగా పని నేర్చుకోసాగాడు. ఇంటికి వచ్చాక ఏమాత్రం సమయం దొరికినా విజయ్ గదిలోని పుస్తకాల బీరువాలోనుండి ఏదైనా పుస్తకం తీసి చదువుకుంటూ గడపటం అలవాటు చేసుకున్నాడు.

* * * *

ఓ నెల గడిచాక—

"మాస్టారూ! నేనోసారి ఊరు వెళ్ళిరానా?" రాజు ప్రశ్నకు ఏదో రాసుకుంటున్న విజయ్ తల ఎత్తి చూశాడు.

"ఇంటిమీదికి గాలి మళ్ళిందా రాజూ!" అన్నాడు. రాజు మాట్లాడలేదు.

"సరే! ఎప్పుడు బయలుదేరుతావ్?" అన్నాడు

"రేపు సాయంత్రం వెళ్ళిరానా?"

"అలాగే!" అన్నాడు.

ఆ మర్నాడే రాజును రైలు ఎక్కించాడు విజయ్.

వారం పదిరోజుల తరువాత వస్తానన్న రాజు మూడోరోజు సాయంత్రమే తిరిగి వచ్చాడు.

విజయ్ ఆఫీసునుండి యింటికి వచ్చేసరికి రాజుతోపాటు కరుణ కన్పించడంతో ఆశ్చర్యపోయాడు.

"బావున్నారా మాస్టారూ!" ఆర్ద్రితగా పలుకరించింది కరుణ

"ఊఁ...నువ్వు...మీరు బావున్నారా?" అన్నాడు.

గడచిన మూడేళ్ళలో కరుణ చాలా పెద్దదైపోయినట్టు ఎంతో ఎదిగినట్టు అన్పించింది పరికిణి ఓణీలు వేసుకునే కరుణ...చీరలో నిండుగా, యువతిలా కన్పించడంతో మన్నించి మాట్లాడాడు.

"ఊఁ..." అంది.

భోజనాలు అయ్యాకా, తీరిగ్గా డాబామీద కూర్చున్నారు రాజు రాఘవయ్యతో బజారు వెళ్ళాడు

"మీ అమ్మగారు, అక్కయ్య బావున్నారా కరుణా?" ఎంతోసేపటినుండి అడగాలంటూనే ఆగిపోతూ, చివరికి అడిగాడు విజయ్.

---

## నిట్టూర్పు



"అయ్యా రెండు సంవత్సరాల క్రితం నాకు అర్థ రూపాయి ఇచ్చేవారు! అది సంవత్సరం క్రిత నుండీ పావలాగా మారింది. ఇప్పుడేమో పదిపైసల్తో సరిపెట్టు కోమంటున్నారు!" దీనంగా అన్నాడో మనిషివాడు

"రెండు సంవత్సరాల క్రితం నేను బ్రహ్మచారిని! సంవత్సర్క్రితం పెళ్ళిచేసుకొన్నాను. నిన్ననే ఓ అబ్బాయి పుట్టాడు! అయినా పదిపైసలిచ్చాను! సంతోషించు" చిరాకుగా అన్నాడు కోదండం.

"అంటే... నాకు ఇవ్వాల్సిన డబ్బుతో మీ కుటుంబ పోషణ చేస్తున్నారన్నమాట!" ఓ నిట్టూర్పు విడుస్తూ ముందుకు సాగాడు ఆ బిచ్చగాడు

—జూ పీటర్

అమ్మా, అక్కయ్యా.... ఇద్దరూ వెళ్ళిపోయారు మాస్టారూ! బ్రతికుండగా ఎప్పుడూ సుఖపడని ఆ జీవితాలు...బహుశా ఇప్పుడు బాగానే వున్నాయేమో!" అంది.

విజయ్ ఉలికిపడుతున్నట్టుగా చూశాడు.

కరుణ కళ్ళలోని నీళ్ళు చెక్కిళ్ళమీదుగా జారిపోసాగాయి.

"ఎలా...ఎలా జరిగింది కరుణా?"

"అక్కయ్య అంటే అతనికి ప్రేమకంటే ద్వేషం, అభిమానంకంటే అనుమానం ఎక్కువ మాస్టారూ! కారణం...అతని నిరుద్యోగం, అతని అసమర్థత. చివరికి అవన్నీ కలిసి అక్కయ్య చచ్చిపోయేలా చేశాయి మాస్టారూ! అక్కయ్య చావును కళ్ళారా చూసిన అమ్మ....నెల తిరక్కుండానే అక్కయ్యను వెతుక్కుంటూ వెళ్ళిపోయింది"

"కళ్యాణి చచ్చిపోయిందా కరుణా?" విజయ్ మెల్లగా గొణుక్కుంటున్నట్టు అడిగాడు. అతని కళ్ళనిండా నీళ్ళు

"మీరు బాధపడుతున్నారా మాస్టారూ! అక్కయ్యపట్ల మీకు జాలి వుందా? మీ కళ్ళలో ఆ నీళ్ళు...ఓహ్...అక్కయ్య తాను అనుకున్నంత దురదృష్టవంతురాలు కాదు మాస్టారూ! తనపట్ల మీ మనసులో ప్రేమ లేకపోయినా, కనీసం జాలికూడా లేదని. అసలు ఎలాంటి అభిప్రాయం లేదని, చివరిక్షణాల్లో కూడా తలచుకుని బాధపడింది మాస్టారూ!" కరుణ మాటలకు విజయ్ పేలవంగా నవ్వాడు

"మీరు కాదన్న తన జీవితంతో రాజీపడిపోయి పెళ్ళి చేసుకుంది మాస్టారు. మనసును మార్చుకుని, అతనికి భార్య అయింది కాని, అక్కయ్యనే అనుమానించాడు. మీరు...మా యింట్లో అద్దెకున్నారని తెలిసి, మీతో ఏదో సంబంధం వుందని సాధించాడు. చివరికి...ఆ అపవాదునే తన నెత్తిన వేసుకుని వెళ్ళిపోయింది" మనసులోనే అనుకుంటూ, కుళ్ళికుళ్ళి ఏడుస్తున్న కరుణనెలా ఓదార్చాలో అర్థం కాలేదు విజయ్‌కు.

ఆ రాత్రంతా కూడా విజయ్ నిద్రపోలేకపోయాడు. మనసులోని బరువు అంతా కన్నీళ్ళ రూపంలో కరిగిపోయినందుకేమో కరుణమాత్రం నిద్రపోగలిగింది.

రెండుమూడు రోజులవరకు విజయ్ బాధపడుతూనే వున్నాడు. విషయం విన్న రాఘవయ్య-జీవితం-నీ పేరేమిటి? అని గొణుక్కున్నాడు

"మాస్టారూ! నాకేదైనా ఉద్యోగం చూడండి" అంది కరుణ ఆరోజు టిఫిన్ తిని లేచిపోతున్న విజయ్‌తో.

విజయ్ సాభిప్రాయంగా రాఘవయ్యవంక చూశాడు.

"నేను మీకేదో బరువని కాదు బాబుగారూ! నాకు యిలా గోళ్ళు గిల్లుకుంటూ యింట్లో గడపడం నాకు బోర్‌గా వుంది" అంది వాళ్ళ చూపుల్లోని భావాన్ని అర్థం చేసుకుంటూ.

"ఊఁ...అమ్మాయి తెలివిగలదే!" అన్నాడు రాఘవయ్య.

విజయ్ నవ్వేసి, ఆ విషయం ఏదో రాఘవయ్య చూసుకుంటాడని బయటికి వెళ్ళిపోయాడు.

కరుణ వచ్చి నెల కావస్తోంది.

రంగయ్య వారంరోజులుగా సెలవు పెట్టి కూతురును చూడ్డానికి ఊరు వెళ్ళాడు.

ఇంటి పనంతా కరుణ ఒక్కతే చూసుకుంటుంది. కరుణకు చేసే పనేం లేకపోవడం అలా చూడ్డం తప్పనిసరి అయింది.

రాఘవయ్యతో చనువు బాగా ఏర్పడింది కరుణకు. ఆడదిక్కులేని ఆ యింట్లో కరుణ తిరగడంతో యింటికే ఓ కొత్త వెలుగు, అందం వచ్చినట్లనిపించింది రాఘవయ్యకు.

"అమ్మా కరుణా!" అంటూ ఆప్యాయతగా పిలిచేవారు.

రాజాకు, విజయ్‌కి కరుణతో మాట్లాడే అవకాశం, సమయం చాలా తక్కువ. వాళ్ళిద్దరు ఉదయం తొమ్మిదింటికి వెళితే రాత్రి ఏడుగంటలు దాటాకా కానీ యిల్లు చేరేవారుకాదు. దాంతో రాఘవయ్యకు ఒంటరిగా ఫీలయ్యే బాధ, కరుణ రాకతో పూర్తిగా తప్పింది. మధ్యాహ్నంవేళ హాయిగా పేకాడుకుంటూనో, క్యారమ్స్ ఆడుతూనో గడిపేవాడు.

మళ్ళీ రెండు నెలలు గడిచిపోయాయి.

విజయ్, రాఘవయ్య కలిసి మందుల సీసాలు తయారుచేసే చిన్న ఫ్యాక్టరీ ఒకటి పెట్టాలనుకొని ఆ ఆలోచనకు ఓ రూపం కల్పించడానికి దాదాపు మూడునెలలుగా విజయ్ చేసిన కృషి, పడ్డ శ్రమా ఫలించాయి.

మరో పదురోజుల్లో ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం అనగా విజయ్ ఆరోగ్యం దెబ్బతింది.

---




## బ్యాంకు డబ్బు!

1981-82వ సంవత్సరాలలో మన దేశంలోని వ్యాపార బ్యాంకులు దాదాపు ఇరవై కోట్ల రూపాయల్ని మోసాల మూలంగానూ, పదహారుకోట్ల రూపాయల్ని అవినీతివల్లా, దోపిడీలవల్ల కోటి రూపాయల్నీ నష్టపోయిందట! మన దేశంలో ఎనభైతొమ్మిది వ్యాపార బ్యాంకులు దాదాపు నలభై వేల బ్రాంచీలతో విరాజిల్లుతున్నాయి. ప్రజాసేవకోసం అనునిత్యం సేవ చేయాల్సిన ఈ బ్యాంకులలో ఇంత ధనం వృథాగా పోయిందంటే ఆలోచించవలసిన విషయమే!

—జూపిటర్

---

ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం నాడు విజయ్ జ్వరంతోనే కార్యక్రమం జయప్రదంగా ముగించి ఇల్లు చేరాడు.

అర్రాత్రి జ్వరం నూటనాలుగు డిగ్రీలుదాటి విజయ్ ఒళ్లెరుగని మత్తులోపడి పోయాడు.

మూడురోజులుగా స్పృహలేకుండా మంచంమీద పడివున్న విజయ్‌ని చూస్తుంటే రాఘవయ్యకు కంగారు ఆందోళనా కలిగాయి.

కరుణమాత్రం నిబ్బరంగా వుండి ప్రతిక్షణం అతణ్ణి కంటికిరెప్పలా కాపాడింది.

మూడోరోజు కళ్లు తెరిచిన విజయ్‌ని చూస్తూ, కళ్ళుతుడుచుకుంటున్న రాఘవయ్యను చూసిన విజయ్ మనసు కృతజ్ఞతతో నిండిపోయింది.

ఏనాటి అనుబంధం భగవాన్ ఇది !

"ఎలావుంది మాస్టారూ?" నీళ్ళునిండిన కళ్ళతో ప్రశ్నిస్తున్న రాజు తలనిమురుతూ.

"చాలా కంగారు పెట్టావా ?" అన్నాడు విజయ్

"కాదు బాబూ మరీ మూడురోజులుగా కళ్ళు తెరవకుండా ఒళ్ళెరక్కుండా పడుకున్నారు" అన్నాడు రంగయ్య గాద్గదికంగా

"ఓహో..." అంటున్న విజయ్ చూపు కరుణమీద నిలిచింది. తనవంకే ఆప్యాయతగా ఆనందంగా చూస్తోంది కరుణ

ఆ తరువాత దాదాపు పదిహేనురోజులు.... విజయ్ బెడ్‌మీదనుండి లేచి తిరక్కుండా పూర్తి విశ్రాంతి తీసుకున్నాడు ఆ పదిహేనురోజులు కరుణ అతనికి టైం ప్రకారంగా మందులు భోజనం, సమకూర్చి పూర్తి ఆరోగ్యవంతుణ్ణి చేసింది

"నీకు చాలా ఋణపడిపోతున్నాను కరుణా !" అన్నాడు విజయ్ అతని ఖరసం తీస్తున్న కరుణతో

"వడ్డీతోసహా తీరుద్దురుగాని మాస్టారూ ! "అంది.

"ఆమె మాటలకు నవ్వుతూ అవకాశం అంటూ రావాలేకాని తప్పకుండా తీర్చుకుంటాను కరుణా !" అన్నాడు.

"మాటతప్పరుగా మాస్టారూ !" అంది చేయిచాస్తూ

"ఊహూ..." అంటూ ఆమె చేయినందుకుని గుప్పెట్లో బిగిస్తూ "ప్రామిస్ !" అన్నాడు. వెచ్చగా తగులుతున్న అతని గుప్పెట్లోని తనచేయి వెంటనే వెనక్కి తీసుకోలేకపోయింది కరుణ

"విజయ్ లేచాడా కరుణా!" అంటూ గదిలోకివస్తున్న రాఘవయ్యను చూసి తన చేయి వెనక్కిలాక్కుంది కరుణ.

"ఎలా వుంది విజయ్ !" అన్నాడు రాఘవయ్య అదేం గమనించనట్టు విజయ్ ప్రక్కనే కూర్చుంటూ.

"రేపటినుండి ఆఫీసుకు వెళ్దామనుకుంటున్నాను మాస్టారూ నాకిప్పుడు కులాసాగానే వుంది" అన్నాడు రాఘవయ్యా ఎదో -నేలోగానే.

"వింటున్నావా అమ్మా!" అన్నారు రాఘవయ్య కరుణవైపు తిరిగి.

ఆయన తమను గమనించాడన్న విషయంతెలిసిన కరుణ. ఎర్రబారిన మొహంతో నిలబడి అతని మాటలకు "ఊఁ" అంటూ గది బయటికి వెళ్ళిపోయింది.

"కరుణ చాలామంచి అమ్మాయి విజయ్! నిన్ను కంటికిరెప్పలా కాపాడుకుంటుంది" అన్నాడు రాఘవయ్య.


విజయ్‌కి ఆమాటల్లోని అంతరార్థం అయ్యే అతనెందుకలా అన్నాడోనని ఆలోచిస్తూ "కరుణపట్ల తాను అలా ప్రవర్తించాడా? అని ప్రశ్నించుకున్నాడు.

* * *

కాలం చాలా గొప్పది అన్పిస్తుంది కొన్నిసార్లు. మనిషి సాధించని మార్పు కొన్నిసార్లు కాలం తెస్తుందనిపిస్తుంది. మనిషి పరిష్కరించలేని సమస్యలకు కాలమే పరిష్కారం చెబుతుంది

విజయ్ తన జీవితం అలాగే గడిచిపోతుందనుకున్నాడు. జీవితంలో ప్రేమ. ఆరాధనకు అర్థంలేదని చోటులేదని కాంతి నిష్క్రమణతోనే అనుకున్నాడు అందుకే కళ్యాణి ఆరాధనను ప్రేమను అర్థంచేసుకొని కూడా దూరంగా వచ్చేసాడు

ఆనాటినుండి బ్రతకడంకోసం జీవిస్తున్నాడు తప్ప. జీవితంలో యింకేదో ఆశించి కాదు కాని... కరుణరాక విజయ్ జీవితంలో వచ్చిన మార్పును ఓ మలుపుతిప్పింది.



విజయ్ కొంచెం మూగగా వుంటే చాలు.

"మాస్టారూ ! నాకోసం కన్నీళ్ళు కార్చడానికి నువ్వున్నావని గుర్తుపెట్టుకుంటాను కరుణా ! అని అన్నారు అలాంటప్పుడు ఇలా మీలో మీరే బాధపడకూడదు మీ బాధ వినడానికి విని అర్థంచేసుకోవడానికి నేనున్నాను" అన్నట్టుగా ప్రవర్తించేది కరుణ.

అతని ప్రతికదలికకు అర్థం చెప్పగలిగేంతగా విజయ్ తత్వాన్ని బాగా అవగాహన చేసుకుంది కరుణ

కరుణ వచ్చాక చాలా విషయాలు కరుణమీద ఆధారపడాల్సి వచ్చింది రాఘవయ్యకు విజయ్‌కు ఆడదిక్కులేని సంసారం. కరుణ రాకతో ఆ లోటు తీరిపోయింది.

విజయ్ పట్ల కరుణ ప్రవర్తన చాలా ఉదాత్తంగా వుండేది.

ఓ పసిపిల్లాణ్ణి ఏమీ తెలియని అమాయకుణ్ణి చేరదేసి బుజ్జగించి అవసరాలన్నటిని అడక్కుండా తీర్చే తల్లిలా విజయ్ అవసరాలన్నీ స్వయంగా దగ్గరుండి చూసుకునేది కరుణ

కరుణ పేరును సార్థకం చేసుకున్నట్టుగా వుండేది. రాఘవయ్యకు ఆ అమ్మాయి మీద చాలా మంచి అభిప్రాయం ఏర్పడిపోయింది.

భార్యపోయాకా ఒంటరివాడైన రాఘవయ్య ఆ యింట్లో నౌకరు రంగయ్యే తోడిదే లోకం అనుకున్నాడు. విజయ్ రాకతో ఆ యింటి వాతావరణంలో ఎలాంటి మార్పురాలేదు. మూగబొమ్మలా మసిలేవారు

కాని... కరుణ వచ్చాకా ఆ యింట్లో మనుషులున్న సందడి మొదలయింది.

ఎప్పుడైనా సినిమాకు బయలుదేరితే విజయ్ ప్రక్కనే నడిచే కరుణనుచూస్తుంటే రాఘవయ్య బుర్రలో మెరుపులాంటి ఆలోచన కదిలేది.

కాని...విజయ ప్రవర్తనలో మాత్రం ఎక్కడా కరుణపట్ల అనురాగం వున్నట్టు కన్పించేదికాదు

తనతో మాట్లాడినట్టే మాట్లాడే విజయ్ కరుణ ఒక ఆడపిల్ల అన్న విషయం గుర్తించాడా లేదానన్న అనుమానం వేసేది.

అది కేవలం రాఘవయ్య అనుమానమే.

కాని—

విజయ్‌లో మార్పు వచ్చింది. ఆలోచన్లో కూడా మార్పు వచ్చింది. కరుణ అంటే అతనికి లోలోపల ఎక్కడో... అనురాగం కలగసాగింది. కాని పైకి చెప్పలేకపోయేవాడు విజయ్

అంతేకాదు—

ఆ అనురాగానికి పెళ్ళి అనే పేరుతో అందాన్ని దిద్దాలని ఆలోచనవచ్చినా—

కరుణకు తనపట్ల ఎలాంటి అభిప్రాయం వుందో—

కళ్యాణిని కాదని తనను కావాలంటె తనను ఎలా అర్థంచేసుకుంటుందో!

ఆనాడు కాంతిని మర్చిపోలేక—
కాంతి చేసిన గాయం మానక—
తనమీద తనకే నమ్మకంలేక—

కళ్యాణిని కాదన్నాడు. అసలు-కళ్యాణి స్నేహాన్ని తాను మరోలా ఊహించలేకపోయాడు. కాంతి వెళ్ళేది అప్పుడే బాధపడే తనకు ఆమె స్నేహం చల్లటి గాలిలా ఓదార్చిందే తప్ప పిచ్చి ఆలోచనలు కలిగేలా చేయలేదు.

కాని ఈనాడు.

కరుణ—

కళ్యాణినికాదని కరుణ కావాలంటె-కరుణ తనను ఎలా అర్థంచేసుకుంటుంది? తన ప్రవర్తననెలా అర్థంచేసుకుంటుంది?

కరుణకు తానంటె కేవలం అభిమానం గౌరవమే అయితే-తాను తొందరపడడు.

కరుణ మనసు మరోలా వుంటె-తాను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తాడు

అప్పుడు—

కరుణ పెళ్ళి తనచేతులమీదుగా జరిపిస్తాడు-ఆలోచిస్తూ వుండిపోయాడు విజయ్.

* * *

"విజయ్! కరుణ చాలా మంచి అమ్మాయ్ అణుకువకలపిల్ల" అన్నాడు రాఘవయ్య విజయ్‌తో.

"ఊఁ"

"ఇరవైయేళ్ళు దాటేవుంటాయ్! రాజు చిన్నకుర్రాడు. ఆ అమ్మాయికి పెళ్ళి చేయాలన్న ఊహ ఆ కుర్రాడికి వస్తుందంటావా యిప్పట్లో"

విజయ్ తలఎత్తి చూస్తూ—

"నిజంగానే మాస్టారూ! రాజు కుర్రాడు. ఆ ఆలోచన వచ్చినా ఏంచేయగలడు. కరుణకు మంచి సంబంధంతెచ్చి మనమే పెళ్ళిచేద్దాం! ఎలావుంటుంది?" అన్నాడు విజయ్

---



## విడాకులు

"విడాకులు తీసికోవాలంటే ముఖ్యమైన కారణం ఏమిటండీ!" ఓ లాయర్ను అడిగింది పిల్ల

"మీరిద్దరూ పెళ్ళి చేసుకొని ఉండాలమ్మా వెంటనే అన్నాడా లాయర్!

— జాని

---

"ఊఁ బావుంటుంది" అన్నాడు రాఘవయ్య.

"కరుణ జీవితం నిండుగా నూరేళ్ళు చల్లగా వుండేలా మంచి కుర్రాణ్ణి చూడండి మాస్టారూ! వాళ్ళ అక్కయ్య జీవితంలా ఆ అమ్మాయి జీవితం కాకూడదు. ఆ అమ్మాయి జీవితంలో ఆస్తి ఐశ్వర్యం లేకపోయినా ఆత్మీయత సుఖశాంతులు వుంటే చాలు" ఆవేశంగా అన్నాడు విజయ్.

"ఈకాలపు కుర్రాళ్ళను నమ్మలేం విజయ్!" అన్నాడు అనుమానంగా మాస్టారు.

"అలా అనకండి మాస్టారూ! మీరు ప్రయత్నిస్తే తప్పకుండా అటువంటి అబ్బాయి దొరకకపోడు మీ పార్టనర్ రంగనాధానికి చెప్పండి"

"వాడికి కొడుకులు లేరన్న సంగతి"

"నాకు తెలుసు మాస్టారూ! కాని కొడుకులున్న తండ్రులు తెలియకపోరు"

"మనం కుర్రాడ్ని చూస్తే కరుణ ఒప్పుకుంటుందా" అన్నాడు రాఘవయ్య

"ఎందుకు ఒప్పుకోదు మాస్టారూ! కరుణకు నచ్చితేనేకదా పెళ్ళి జరుగుతుంది"

"అది పాయింటే...మరి నీకు నచ్చాలిగా"

"అంటే" విజయ్ ప్రశ్నకు నాలిక కొరుక్కున్నాడు రాఘవయ్య.

"అబ్బాయికి కరుణ నచ్చాలిగా"

"కరుణకేం మాస్టారూ! యిందాకేగా మీరన్నారు మంచి అమ్మాయి అణుకువగల పిల్ల అని"

"అందం కావాలి కదోయ్"

"కరుణ...అందంగానే వుంటుంది మాస్టారు! పైగా మంచి మనసున్న మనిషి. ఆత్మీయత అభిమానం తెలిసిన మనిషి మనసుకు తప్ప ఆడంబరాలకు విలువయివ్వని హృదయం వుంది యింకేంకావాలి"

"అలాంటప్పుడు...యింకా ఎక్కడో వెతకడం ఎందుకు విజయ్! నువ్వు చేసుకోవచ్చుగా" రాఘవయ్య మాటలకు విజయ్ చేతిలోని పుస్తకం జారిపడిపోబోయింది.

అది క్రిందపడకుండా అందుకొని, విజయ్ వొళ్ళో పెడుతూ సాభిప్రాయంగా చూసాడు

"నాకా అర్హతలేదు మాస్టారూ! కరుణ నన్ను చేసుకొని సుఖపడుతుందనుకోను".

"ఏం"

"..............."

"విజయ్! నువ్వింకా శాంతికోసం బాధపడుతున్నావంటే నమ్మను. నువ్వు ఆ భ్రమలోనుండి బయటపడు. కాలం మారింది. నువ్వు మారావు. మారలేదని నిన్ను నువ్వు మభ్యపెట్టుకోకు. బాగా ఆలోచించు నీగురించి అంతా తెలిసిన కరుణతో నీజీవితం ప్రశాంతంగా గడుస్తుందనే నా నమ్మకం. నువ్వంటె కరుణకు అభిమానం పెళ్ళయ్యాక ప్రేమగా మారకపోదు. జీవితాలు ముడివేసుకునేముందు ఒకరినొకరు బాగా తెలిసి

వుండడమే కాదు అర్థం చేసుకోవడం ముఖ్యం. అది మీ ఇద్దరిమధ్య వుంది" అన్నాడు రాఘవయ్య. విజయ్ మౌనంగా వుండిపోయాడు.

"ఇంటర్వ్యూకు చాలామంది వచ్చారు" అనుకుంది ప్రియ. ఇంటర్వ్యూ మొదలవడానికింకో పది నిమిషాలుంది. అబ్బాయిలంతా గుంపుగా ఓచోట నిలబడి మాట్లాడుకుంటున్నారు. అమ్మాయిలంతా మరోప్రక్క చేరి ఇంటర్వ్యూ కోసం జనరల్ నాలెడ్జి పుస్తకాలు ఆత్రుతగా తిరిగేస్తున్నారు.

ప్రియ తనకు వచ్చిన కాల్ లెటర్‌ను మరోసారి చూసుకొని ఫైల్లో భద్రపరిచిన సర్టిఫికేట్లనోసారి చూసుకొని పైట సర్దుకొని కూర్చుంది.

దాదాపు పాతికేళ్ళు వుంటుంది. మొహం పీక్కుపోయి కళ్ళక్రింద నల్లచారలు... వెలిసిపోయినట్టున్న చీరలో చాలా సామాన్యంగావుంది. పేదరికం నిస్పృహాయిత ఆమెలో చాలా స్పష్టంగా కన్పిస్తోంది.

"మేనేజరుగారింకా రాలేదు. రాగానే మొదలవుతుంది ఇంటర్వ్యూ" ఎవరో అనడంతో నిలబడి మాట్లాడుకుంటున్నవారంతా సర్దుకొని కూర్చొని తీరిగ్గా మాట్లాడుకుంటూ చదువుకుంటున్నారు.

ఓమూల ఎవరితో మాట్లాడకుండా కూర్చుంది ప్రియ.


"ఇంటర్వ్యూ అయిపోగానే త్వరగా వస్తావుకదూ ప్రియా!" సుదర్శన్ మాటలు గుర్తుకువచ్చాయి.

"తప్పకుండా వస్తాను సుధా!" అంది.

"ఈ ఉద్యోగం అయినా వస్తుందంటావా ప్రియా!"

"కొత్తకంపెనీకదూ! వేకెన్సీలు చాలా వున్నాయ్! అప్లైచేసిన ఉద్యోగం కాకపోయినా. మరే చిన్న ఉద్యోగం అయినా ఇమ్మని అడుగుతాను" అంది

---



రికార్డు

అనేక రంగాలలో రికార్డులు సృష్టించగా లేంది... జుట్టు కత్తిరించడంలో...ఎందుకు రికార్డు సృష్టించ గూడదూ...! అని అన్పించింది, కాలిఫోర్నియాలోని న్యూయార్క్ సెలూన్ యజమాని అయిన 'పీరీ ఓర్టిజ్' గారికి! ఆలోచన రావడమే తరువాయి! 1981వ సంవత్సరం మే పదవతేదీ నుండి ఇరవై ఆరవ తేదీవరకు. అంటే 342 గంటలసేపు ఏకబిగిన కొన్నివందల మందికి క్రాపుచేసి గిన్నీస్ పుస్తక రికార్డులలోకి ఎక్కేశాడు! అదండీ...పట్టుదల అంటే!

—జూపిటర్

"నాకోసం నువ్వెంత బాధపడుతున్నావు ప్రియా! నువ్వు నువ్వు నన్నింతగా ప్రేమిస్తున్నావని నేను ఎప్పుడూ అనుకోలేదు"

సుదర్శన్ మాట పూర్తికాకముందే తను చెప్పులువేసుకొని బయటకువచ్చింది.

"అలా మాట్లాడి, మాట్లాడి చివరిమాటగా అతనేమంటాడో తలచుకున్న ప్రియకు ఆ మాటలు వినాలన్పించలేదు.

"ప్రియా! నేను గుడ్డివాడినని నన్ను వొదిలిపోవు కదూ!"

ప్రియకు ఆ మాటలు గుర్తుకువచ్చి తల గట్టిగా విదిల్చింది.

హఠాత్తుగా తన చుట్టూ నిశ్శబ్దం అలుముకోవడంతో ఆలోచిస్తున్న ప్రియ ఉలిక్కిపాటుగా చూసింది. ఇంటర్వ్యూకువచ్చిన అభ్యర్థులు అందరూ నిశ్శబ్దంగా సర్దుకొని కూర్చున్నారు ఒకరి మొహాలొకరు అదో విధంగా చూసుకుంటున్నారు.

ఇంటర్వ్యూ మొదలైనట్టుగా ప్యూను ఓ అభ్యర్థిని లోపలికి వెళ్ళమన్నట్టుగా చెప్పాడు

యుద్ధానికి వెడుతున్నట్టుగా లోపలికి ధైర్యంగా వెళ్ళాడా అబ్బాయి. ఐదు నిమిషాల్లో తిరిగి వచ్చాడు.

"ఏం అడిగారేం?" తలా ఒకరూ ప్రశ్నించడంతో, ఆ అబ్బాయి పెదవులు విరుస్తూ వెళ్ళిపోయాడు.

ఓ నిమిషం తరువాత రెండో అభ్యర్థి పేరు పిలిచాడు ప్రియ తన కాల్ లెటర్ తీసి నెంబరు చూసుకుంది. యాభై ఆరు అంటే ఐదు నిమిషాలకొకరి చొప్పున పిలిచినా నాలుగు గంటల తరువాత కాని ఇంటర్వ్యూకు పిలుపు రాదనుకుంది.

వొంటి గంట వరకు ఇంటర్వ్యూ జరిగాక, తిరిగి రెండింటికి మిగిలిన వారికి ఇంటర్వ్యూ వుంటుందని, టిఫెన్ చెయ్యాలనుకునే వారు వెళ్ళి రెండు గంటలకల్లా వచ్చేయాలని ప్యూన్ చెప్పడంతో చాలామంది అపురూపమంటూ వెళ్ళారు

ప్రియ చేతి రుమాలులో అరవై పైసలకు మించి లేకపోవడం గుర్తించి, తిరుగుయాత్రలో బస్సులో వెళ్ళడానికి అవి కావాలని గుర్తుకువచ్చి, కూర్చున్న కుర్చీకి అంటిపెట్టుకుని వొరిగి కూర్చుంది.

ఓ గంటసేపు, ఇంటర్వ్యూ గురించి ఆలోచించడం మానేయవచ్చనుకుంటున్న మనసు, ఇతర ఆలోచనలు చుట్టుముట్టాయి

ఈ ఉద్యోగం వస్తే, కనీసం ఓ నాలుగు వందల జీతమైనా వస్తుంది. ఇంటింటికి తిరిగి, సబ్బులు అమ్మడంతో తానేం సంపాదించ గలుగుతుంది? తిరగాలి ఎప్పుడు టోల్డు శ్రమా! అయినా తిరిగినా కడుపునిండని రాబడి పైగా... వెలికిచూపులు. వెకిలి మాటలు... అవమానించాలనే తప్ప ఆదరించాలనుకోని మనుషులు... ఒంటరిగా ఆడది కనిపిస్తే అలుసుగా తప్ప గౌరవంగా చూడని జనం.

ఆలోచిస్తున్న ప్రియ ఉలిక్కిపడింది.

ఎవరో తన ముందు నుండి నడిచి వెళ్ళిపోయారు. ఆ నడక...ఆ అడుగుల చప్పుడు తనకు పరిచితంగా అన్పించసాగాయి ఎవరు...అతనెవరూ?

ప్రియ ఆ మనిషి వెళ్ళినవైపు చూసింది తిరిగి వస్తాడేమోనని.

కాని...కారిడార్ అంతా ఖాళీగా వుంది.

అక్కడే మేనేజరు రూమ్ ముందు . కూర్చున్న ప్యూనును అడగాలనుకుంది. అంతలోనే. అతనేమనుకుంటాడోనని కూర్చుంది.

తిరిగి. ఇంటర్వ్యూ మొదలై తన పేరు పిలిచే వరకు, ప్రియ ఆ అడుగుల చప్పుడు గురించి ఆలోచిస్తూనే వుంది.

భుజాలచుట్టూ కొంగు కప్పుకొని గదిలోకి అడుగు పెట్టింది ప్రియ.

అక్కడ-

టేబుల్ కెదురుగావున్న కుర్చీలో ఇద్దరు వ్యక్తులు కూర్చొని వున్నారు ఒకతను యాభై యేళ్ళు పైబడ్డ పెద్ద మనిషి మరొకతను-యువకుడె.

తలవాల్చుకొని ఏదో రాస్తున్నాడు.


ప్రియ అడుగులు ఎందుకో తడబడ్డాయి.

"కూర్చో అమ్మా!" "ఆ వృద్ధుడి మాటలకు వెళ్ళి కుర్చీలో కూర్చుంది.

"పేరు" అన్నాడు.

"శాంతి ప్రియ"

కాగితం పైన రాస్తున్న యువకుడి చేతిలోని పెన్ను రాయడం ఆగిపోయింది. చటుక్కున తల ఎత్తి చూసాడు



సరిగ్గా...అప్పుడే.

ఆమె కూడా కళ్లు తిప్పి చూసింది.

అంతే-

ఎదురుగా కూర్చున్న వ్యక్తిని విజయ్‌గా గుర్తించిన శాంతి ప్రియ...యిందాకా తాను విన్న అడుగుల చప్పుడు ఎవరిదో...అర్థమైంది.

అతను-

యిక్కడున్నాడేం?...

అప్పటి కంటె బాగా...

నిండుగా. హుందాగా....

పైగా...అతను...తనకు దయతలచి, జాలిపడి, ఉద్యోగం యిచ్చే మేనేజరు...పోస్టులో...భగవాన్...

రూమ్ ముందున్న సైన్ బోర్డులో వి. కుమార్ అంటే ఎవరో అనుకుంది...విజయ్ కుమార్ అన్న మాట...అంటే-విజయ్...యిలా...

కాని...తాను...ఎలా...తల అడ్డంగా ఆడిస్తూ. కన్నీటిని ఆపుకుంటూ...ఒహ్...శాంతి ప్రియ చటుక్కునలేచి, ఒక్క పరుగులో, తలుపు తీసుకొని పరుగెత్తింది.

"విజయ్...ఆ అమ్మాయి"...రాఘవయ్య ప్రశ్నకు విజయ్ గాఢంగా నిట్టూర్చుతూ.

"శాంతి మాస్టారూ!" అన్నాడు యింకేం చెప్పలేనట్టుగా కుర్చీ వెనక్కి వాలి కళ్లు మూసుకొని, కుడిచేత్తో నుదురు రాసుకుంటూ.

"అంటే...అంటే..."

"యస్...ఆ అమ్మాయే"

"ఆ అమ్మాయి...యిక్కడ...యిలా...కాని నువ్వు అతను...డాక్టరని..."

"ఏమో...నాకేం తెలీదు...ఒహ్..." ఆందోళనగా తల అడ్డ గా ఊపుతూ "యిలా ఎందుకు జరుగుతోంది మాస్టారూ...ఎందుకు? ఎ దుకు? దేవుడికి ఏనాటి కక్ష మాస్టారూ నా మీద" అన్నాడు బాధగా.

శాంతి ప్రియ రోడ్డు మీదికి ఎలా వచ్చిందో తెలీదు. యిల్లు ఎలా చేరుకుందో అసలు గుర్తు లేదు కాని-యింటికి వెళ్ళగానే, సుదర్శనం అడిగే ఏ ప్రశ్నకు సమాధానం చెప్పకుండా. గుండెలు పగిలేలా దిండులో మొహం దాచుకొని ఏడ్వసాగింది.

"ప్రియా! ఏం జరిగింది, ఉద్యోగం రాలేదా? ముందే సెలెక్ట్ చేసుకున్నారా! పోనిద్దూ! అయినా...ఈ మాత్రం దానికి యింతగా బాధపడాలా...ఛ...పిచ్చి పిల్లా ఏమిటి? బాగా ఆలోచించు...ఏడిస్తే ఏం వస్తుంది? రాదనుకున్న ఉద్యోగం వస్తుందా? ధైర్యంగా వుండాలి" అన్నాడు దగ్గరగా వచ్చి తల నిమురుతూ.

అతని ఓదార్పు, ఆమెకు మరింత బాధనే కలిగించింది.



ఇంటర్వ్యూకు వెళ్ళిన వాళ్ళందరికీ ఉద్యోగాలు వస్తాయా ప్రియా! వస్తుందని ఆశించి వెళ్ళాలే తప్ప నమ్మకం కలిగించుకొని వెళ్ళకూడదు ముఖ్యంగా ఈనాటి ఉద్యోగాలు రికమెండేషన్లు, లంచాలతో వస్తోంటె, నీకు ఖచ్చితంగా వస్తుందని ఎలా అనుకున్నావో! అలా అనుకున్నావు కాబట్టి ఈ నిరాశను భరించలేకపోతున్నావు! అంటూ, ప్రియ ఏడుపు తగ్గడం చూసి-'' ప్రయత్నం మనది-ఫలితాన్ని అంచనా వేయడం మాత్రం మన వంతు కాదు ప్రియా!

"నువ్వు మొదటినుండీ అంతే-ఆలోచన తక్కువ ఆవేశం ఎక్కువ దేని గురించైనా తొందరగా అంచనావేసి. నిర్ణయం తీసుకుంటావ్...చూసావా! తప్పకుండా వస్తుందనుకున్న ఉద్యోగం రాదనుకునేసరికి తట్టుకోలేకపోయా!''

"ప్రియా... జీవితం... యింతే... అనుకున్నది ఎప్పుడు ఏనాడు జరగదు. జరిగేది తెలియదు ఎవరైనా దానితో తృప్తిపడి బ్రతికితే-ఈ బాధలు కన్పిస్తు వుండవు. ఊరుకో ప్రియా..." అన్నాడు. అతని మాటలు కాంతి ప్రియను వెనక్కి వెనక్కి ఎక్కడికో తీసికెళ్ళాయి.

ఆ రోజు సుదర్శనంతో వచ్చేసింది. విజయ్‌ని వొదిలి.

కష్టాలకు, పేదరికానికి, భయపడి, ప్రేమను మరిచిపోయి కేవలం స్వార్థం తన సుఖం చూసుకొని సుదర్శనంతో వచ్చేసింది.

సుదర్శనం మంచివాడే. తన కన్యాయం చేయలేదు. యిప్పటికీ చేసే అవకాశం లేదు

ఎందుకంటే-

అతనితో వచ్చేసాకా ఓ ఏడాదిపాటు బాగానే వున్నారు తను కోరుకున్న జీవితం లభించింది

ఓ రోజు-

సుదర్శనం స్కూటర్‌ను లారీ ముద్దుపెట్టుకోవడంతో సుదర్శనం తలకు బలమైన గాయాలు తగిలి, నరాలు ఏవో దెబ్బతిని, చూపు శాశ్వతంగా పోయింది.

యింటిలోని ఖరీదైన వస్తువులొక్కొక్కటిగా అమ్మి కాలం గడుపుకొచ్చారు.

ఇప్పుడిక తాను ఉద్యోగం చేయకతప్పని పరిస్థితి వచ్చింది.

ప్రియా! నిన్ను సుఖపెట్టాలని తీసుకొచ్చి, చివరికి నీకే బరువై, ఓ సమస్యగా మిగిలాను నన్ను గుడ్డివాడినని వొదిలి వెళ్ళిపోవుగా! దీనంగా అన్నాడతను

అంటే-పేదరికం భరించలేక, విజయ్ ఉద్యోగం, పోగానే వొదిలి వచ్చానవే కదూ! అతనికి అనుమానంవేసి అలా అడుగుతున్నాడు మంచి మనసున్న విజయ్‌ని కాదని, తను విజయ్‌ని వొదిలి వచ్చినందుకు తగిన శిక్షపడింది. మళ్ళి ఆ తప్పును తాను చేయగలదా? తన మనసు అంత చంచలమైందా? సుదర్శనం తనను అర్థం చేసుకుంది యింతేనా? అసలా భావన అతనికి కలగడానికి కారణం-తానే-మున్ముందుకి తనే-వెక్కి వెక్కి ఏడ్చింది ప్రియ.

ఆ రాత్రి విజయ్ భోజనానికి రాలేదు. రాఘవయ్య డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని చాలా సేపు ఎదురు చూసాడు. రాత్రి పదిగంటలు దాటినా విజయ్ యింటికి రాలేదు

"ఏం జరిగింది బాబుగారూ!" అంది కరుణ.

రాఘవయ్య జరిగిన సంగతంతా చెప్పాడు.

"శాంతి కన్పించిందా?" విభ్రాంత పోయింది కరుణ.

"అవునమ్మా!"

"మాస్టారూ మాట్లాడారా?"

"లేదమ్మా ఆ అమ్మాయి అసలు అవకాశం ఇవ్వలేదు. విజయ్‌ని చూస్తూనే నిర్ఘాంతపోయి, వెంటనే పరిగెత్తుకుని వెళ్ళిపోయింది. నేను వెనకే ప్యూనను పంపించాను. ఆ అమ్మాయి కనిపించలేదు."

"ఆ తరువాత విజయ్ లేచి వెళ్ళాడు. సాయంత్రంలోగా వస్తాడనుకున్నాను. ఇదిగో యింతవరకూ రాలేదు" అన్నాడు.

మాస్టారుకు ఆవిడపట్ల కోపం వుందా! లేక క్షమించేశాడా? తనను నిర్దాక్షిణ్యంగా వదిలి తన సుఖాన్ని తాను చూసుకుని వెళ్ళిపోయి ఈనాడు తిరిగి, మాస్టారు ముందే అతిదీనంగా, హీనంగా నిలబడినందుకు బాధపడ్డాడా? లేక సంతోషించాడా? శాంతిని ఆ పరిస్థితిలో చూసి ఆవిడ్ని వెదుక్కుంటూ వెళ్ళలేదు కదా? వెళ్ళి... ఆవిడ్ని తన జీవితంలోకి తిరిగి ఆహ్వానిస్తాడా? ఆవిడ వస్తుందా? అతను... ఆ డాక్టరు ఏమయ్యాడు? శాంతి ఈ స్థితికి ఎలా వచ్చింది? ఏమిటో ఎందుకిలా జరుగుతోంది? మాస్టారుకు సుఖంగా బ్రతికేయోగం లేనట్టు... ఓ సమస్య సమసిపోగానే మరోటి.

శాంతిని మాస్టారు ఎంతగా ప్రేమించారో తనకు తెలుసు. తను విడిచి వెళ్ళిన శాంతి గురించి తెలిసిన వాళ్ళంతా అవహేళన చేస్తుంటే-ముందుగా నమ్మలేక నమ్మిన తరువాత శాంతిని నిందించలేక, శాంతికోసం, శాంతిలేని తన జీవితాన్ని చూసి ఎంతగా కుమిలిపోయాడు? ఎంతగా బాధపడ్డాడు.

శాంతిని మరువలేని మాస్టారూ...మరో మనిషికి తన జీవితంలో చోటివ్వలేక అలాగే వుండిపోయారు. అది చాలు...శాంతి అంటే మాస్టారుకు ఎంత ఇష్టమో తెలుసుకోవడానికి.


బాబుగారి మాటవల్ల ఈ మధ్యే మాస్టారూ కొంచెం మారారని అనిపిస్తుంది. మార్పువచ్చిన జీవితం మధురమైన మలుపు తిరిగే సమయంలో మళ్ళీ ఈ ఆవాంతరం ఏమిటి?

తను స్వార్థంగా ఆలోచిస్తుందా?-తనను తాను ప్రశ్నించుకుంది కరుణ.

లేదు... లేదు. మాస్టారుకు శాంతిలోనే ప్రశాంతత దొరికితే... తాను....

---

## పుట్టినరోజు



లేడీ రిసెప్షనిస్టు పోస్టుకు ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి.

"మీ పుట్టినరోజు మే పది...అని ఉంది. ఏ సంవత్సరమో రాయలేదు!" ఓ అభ్యర్థిని అడిగాడు ఇంటర్వ్యూ కమిటీ మెంబరు.

"ప్రతి సంవత్సరం!" ఠక్కున జవాబు చెప్పిందా యువతి! —జూపిటర్

---

తాను సంతోషంగా పక్కకు తొలగిపోతుంది. తనకు కావల్సింది మాస్టారు ఆనందంగా సుఖంగా వుండడమే

మాస్టారు నిర్ణయం ఎలావున్నా తనకు అంగీకారమే

కరుణ అలా ఆలోచిస్తూనే ఎంతసేపు కూర్చుందో గోడగడియారం పన్నెండు గంటలు కొట్టడంతో ఉలిక్కిపడుతూ గుమ్మంవైపు చూసింది.

విజయ్ రాలేదు

రాజు నిద్రపోతున్నారు తన గదిలో.

రాఘవయ్య వాలుకుర్చీలోనే గాఢనిద్రలో మునిగిపోయాడు.

ఆ రాత్రంతా మేలుకొని వున్నా విజయ్ రాలేదు.

మర్నాడు పగలంతా విజయ్ రాలేదు.

ఆ సాయంత్రం కూడా రాలేదు. రాత్రి పదిదాటాకా యింటికి వచ్చిన విజయ్ ఎవరితో మాట్లాడకుండా తన గదిలోకి వెళ్ళిపోయాడు. పీక్కుపోయిన ముఖంతో ఎర్రబారిన కళ్ళు, రేగిపోయిన తలతో. మాసిపోయిన బట్టలతో అలాగే మంచంమీద వాలిపోయాడు

ఆ గది-

చాలా చిన్నగావుంది. ఆ గదిలోనే ఓ ప్రక్క నవారు మంచంమీద సుదర్శనం కూర్చొని వున్నాడు. ఆ మూల... వంటసామాను చాలా పరిమితంగా వున్నాయ్ కిటికీలో చిన్న కూజా, ప్రక్కనే ఓ గ్లాసు వున్నాయ్. మంచంమీద ఓ దుప్పటి తప్ప మరేంలేదు నేలమీద ఓ చాప పరిచివుంది. దండెంమీద, బాగా వెలిసిపోయిన రెండు చీరలు ఓ లుంగి, వున్నాయ్.

మంచం మీద కూర్చున్న సుదర్శనం వొంటిమీది బనీను చిరిగిపోయి వుంది. లుంగీ కూడా అక్కడక్కడ చిరుగులతో మాసిపోయి వుంది అతని మొహం గుమ్మం వైపు తిరిగివుంది. అతని చూపు గుమ్మంలోనే వుంది.

విజయ్ గుమ్మంలో నిలబడి తనవంకే చూస్తున్న సుదర్శనం వైపు చూసాడు. తననే చూస్తున్నట్టుగా వున్న ఆ కళ్ళు... తనను గుర్తించలేదా? గుర్తించి. గుర్తించ నట్టు నటిస్తున్నాడా? తన సుఖాన్ని, ఆనందాన్ని, కర్కశంగా లాక్కున్న ఇతడు ఈ స్థితిలో వున్నందుకు-తనకు ఊహకు కూడా సంతోషం కలగడంలేదు ఎందుకు? తన శాంతిని తనకు కాకుండా చేసిన ఇతనంటే కోపం, ద్వేషం, అసహ్యం ఎందుకు కలగడం లేదా?

ఆలోచిస్తే-

అతని తప్పులేదు.

తప్పంతా... తనదే

శాంతిని సుఖపెట్టలేకపోయాడు.

ప్రాణంమీద ఆశ వొదులుకునే జబ్బు తెచ్చుకున్నాడు.

తాను చచ్చిపోతే-

శాంతి గతేం అయ్యేది ?

ఏమో ? ఎవరూ ఆదరించేవారు కాదు.

తాను చచ్చిపోతాననే కదూ... శాంతి ఇతనితో వచ్చేసింది. శాంతిని ఆదరించి, అన్యాయం చేయకుండా చూసుకుంటున్నాడు.

డబ్బులేకపోవచ్చు. పేదరికం కావొచ్చు. అయినా...శాంతికి ఆపదలో తీయగా నీడగా నిలిచాడు

శాంతిని తాను ప్రేమించినట్టే ఇతను ప్రేమించాడేమో ఏమో...కానీ...యిలా ఎందుకయ్యారు ఎలా జరిగింది ?

గుమ్మంలో అడుగుల చప్పుడుకు...

ఎవరూ...ఎవరది...ప్రియా... అతను తడుముకుంటూ గుమ్మంలోకి రావడంతో ప్రక్కకు తప్పుకున్నాడు విజయ్.

ష్...అంటూ పిలిచి ఆదేశించినట్టు ఓసారి అటు తిరిగి తడుముకుంటూ వెళ్ళి కూర్చున్నాడు.

అప్పుడుకాని...గుమ్మాన్ని చూస్తున్నట్టున్న అతని కళ్లు తన వెందుకు గుర్తించలేదో అర్థం అయింది విజయ్‌కు.

వెనక్కి తిరిగి వచ్చేసాడు విజయ్. రాత్రంతా యింటికి వెళ్ళలేదు శాంతి యిల్లు



## ఒక్కరు చాలు !

చైనాలో ప్రస్తుతం పదహారు మిలియన్ జంటలు పిల్లల్ని కనే ప్రయత్నంలో ఉన్నారట! అందులో అరవయి మూడు శాతం మంది తాము ఒక్క సంతానం చాలనే ప్రభుత్వ ప్రచారానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారట ! అలా ఒక్కరితో సరిపెట్టుకునే వారికి నెలవారీ బోనస్‌లూ, ఇళ్ళ కేటాయింపులో ప్రత్యేకత, తమ బిడ్డకు చదువు వైద్యం నిమిత్తం ఎన్నో సదుపాయాలూ కల్గజేయడానికి చైనా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అదే...ఇద్దరు లేక ముగ్గురు పిల్లలూ ఉన్నవారు అనేక సదుపాయాల్ని కోల్పోతున్నారు. అంతేకాదు వారికి ప్రభుత్వం జరిమానా వెయ్యొచ్చు. వారి రేషన్ తగ్గించవచ్చు. మనదేశంలో కూడా ఇలాంటి పద్ధతి ప్రవేశపెడ్తే బాగుంటుందేమో !

-జూపిటర్

వెదుక్కుంటూవచ్చి తీరా ఇప్పుడు చూసింది. ఇది–పిచ్చిగా రోడ్లన్నీ నడిచి నడిచి, రాత్రికి యింటికి చేరుకున్నాడు.

మనసంతా శాంతి ఆలోచనలే.

నన్ను కాదని వెళ్ళినందుకు...ఏం సుఖపడుతున్నావ్ శాంతి! ఎక్కడ వున్నా సుఖంగా వున్నావనుకున్నాను. హాయిగా పిల్లాపాపలతో కాపురం చేసుకుంటున్నావనుకున్నానుగాని...మరింత దురదృష్టాన్ని పెంచుకున్నావని అనుకోలేదు శాంతి...శాంతీ...

దిండులో మొహందాచుకొని ఏడుస్తున్న విజయ్ తలమీద ఎవరిదో చేయి... ఓదార్చుతున్నట్టుగా మెత్తగా చల్లగా తాకింది.

తలఎత్తి చూసాడు కరుణ.

"కరుణా!...శాంతి జీవితం ఎలా అయిందో చూసావా? దీనికంతా కారణం... శాంతి నన్ను పెళ్ళిచేసుకోవడమే కరుణా" అంటూ కరుణ గుండెల్లో తలదాచుకుని ఏడ్చేడు విజయ్

"మాస్టారూ!" కరుణ అతడ్ని పొదివిపట్టుకుంటూ, భయపడి ఏడుస్తూన్న పసిపిల్లాడిని వీపుతట్టూ చేయివేసి, లాలించే తల్లిలా కరుణ అతడ్ని ఓదారుస్తూ–

"మాస్టారూ! జరిగిపోయినదానికి బాధ్యులు ఎవరనేదికాదు యిప్పుడు ప్రశ్న! జరిగిందానికి తప్పంతామీదికాదు అసలు మీ తప్పులేదు. అనవసరంగా బాధపడకండి".

"శాంతిపట్ల మీకు కోపం, ద్వేషం లేనందుకు నాకు సంతోషంగావుంది మాస్టారూ? ఆవిడ్ని మీరు క్షమించగలిగారంటే...మీరెంతో గొప్పవారు".

"లేదు కరుణా! నేను...దురదృష్టవంతుణ్ణి. నువ్వనుకునే గొప్పతనం నాలో లేదు కాని...కరుణా! శాంతి అలా నన్ను విడిచి వెళ్ళిపోయినందుకుకాదు నేను బాధపడింది. శాంతి వెళ్ళిందని తెలిసికూడా బ్రతికున్నందుకు... ఈనాడు అంతే–నావల్లే శాంతి వెళ్ళిపోయింది కరుణా!"

"ప్రేమించగలిగావేతప్ప ఆమె కోరికలు, ఆశలు తీర్చలేని అసమర్థుణ్ణయిపోయాను. జీవితం ఇరుకుగా, హీనంగా తయారు చేసాను. శాంతి భరించలేకపోయింది. ఒంటరితనం, పేదరికం అలవాటైన నేను... ఆ పరిస్థితులకు రాజీపడగలిగాను కాని...శాంతి రాజీపడలేకపోయింది"

"అందుకని...మిమ్మల్ని వొదలివెళ్ళాలా మాస్టారూ? అంతేనా ప్రేమ అంటే? అదేనా ప్రేమించడం అంటే? భార్యాభర్తల మధ్య వుండాల్సిన అనుబంధం అంతేనా? దుఃఖాలకు, సుఖాలకు సంతోషాలకేనా పరిమితం! పేదరికానికి, కష్టాలకు వుండదా?"

కరుణ మాటలకు విజయ్ ఉలిక్కిపడ్డట్టుగా చూసాడు.

"ఆవిడని మీరు క్షమించగలిగే ఉదాత్తులు. ఆడదాని అమాయకత్వాన్ని క్షమించగలిగే సహృదయులు మీరు. ఆలా అని యిప్పుడు మీరేం చేయాలనుకుంటున్నారు మాస్టారూ?"

సూటిగా అడగాలనుకుంది కరుణ. కాని...అలా అడగడంలో విజయ్ తనను స్వార్థపరురాలిననుకుంటాడని, అడగలేకపోయింది.

కాని–

రాఘవయ్య అడిగాడు.

"బాధపడి ప్రయోజనం ఏమిటి విజయ్! నువ్వు ఆ అమ్మాయికి ఉద్యోగం ఇవ్వు కాదంటే డబ్బు సహాయం చెయ్...కాని..."

"కాని..." తలెత్తి చూసాడు

"ఆవిడను నమ్ముకొనివున్న ఆ అంధుడిని విడిచి రమ్మని మాత్రం కోరకు" అన్నాడు లేచి నిలబడి మరోవేపుకు తిరిగి.


"మాస్టారూ!" నిశ్చేష్టుడైపోయాడు విజయ్.

"అవును...విజయ్! నిన్ను నమ్ముకొని కరుణ వుంది. నువ్వు కాదంటే కరుణకు మరో సంబంధం దొరుకుతుదేమోకాని...అతడ్ని వొదిలివస్తే... అతనికి దిక్కెవరు?"

అతని మాటలకు విజయ్ ఆలోచనలోపడ్డాడు. తానా విషయం ఆలోచించలేదు.

"అంతేకాదు, ఆవిడ నీ పిలుపుని మన్నిస్తుందని అనుకోను" అన్నాడు రాఘవయ్య.

విజయ్ మాట్లాడలేదు



అతడి మౌనాన్ని మరోలా అర్థంచేసుకుంది కరుణ.

రాఘవయ్య మరోలా అర్థం చేసుకున్నారు.

విజయ్ ఆఫీసుకు వెళ్ళిపోయాడు

కరుణ చాలా నిర్లిప్తంగా వుండిపోయింది.

మధ్యాహ్నం భోజనానికి కూడా విజయ్ రాలేదు.

ఆఫీసుకు ఫోన్‌చేసే విజయ్ ఓ గంటక్రితమే ఆఫీసులోనుండి వెళ్ళిపోయాడని చెప్పారు

శాంతి!

ఈ ఉద్యోగం నీ కివ్వటంలో నీ మీద జాలిపడి యిస్తున్నాననో, అనుమానించాలనీ యిస్తున్నాననో అనుకోకు. చాలా బాధపడ్డాను శాంతి. నిన్నీ స్థితికి తీసుకువచ్చింది... ఓవిధంగా నేనే...ఆనాడే నీ ప్రేమను కాదంటే—నువ్వు నన్ను పెళ్ళిచేసుకోకా మీ నాన్న తెచ్చిన సంబంధం చేసుకుని హాయిగా వుండేదానివి కదూ!

గతం చాలా చిత్రమైంది శాంతి! గుర్తుకొచ్చి బాధపెట్టడమే కాదు...మన తప్పులు దిద్దుకునే అవకాశంకూడా ఇస్తుంది.

జీవితంలో నువ్వుకానీ, నేనుగానీ చేసినపొరపాటు మళ్ళీ ఎప్పుడూ చేయకూడదనే...నీకీ ఉద్యోగం ఇస్తున్నాను. శాంతి! తప్పకుండా చేరు నీ బాస్‌గా ఆఫీసుకు నేనెన్నడూ రాను. విజయ్‌గా అసలుమాట్లాడను. నీ కసలు నేను కనుపించను.

నువ్వు తప్పకుండా చేరతావనే, నాయీ చివరిమాటను మన్నిస్తావనే అనుకుంటున్నాను శాంతి

విజయ్!

పోస్ట్‌మాన్ ఇచ్చాడంటూ, సుదర్శనం అందించిన కవరు చదివిన శాంతికి పోస్టింగ్ ఆర్డరుతోపాటు ఆ ఉత్తరం చదివి బొమ్మలా బిగుసుకుపోయింది. "అంటే విజయ్ తనను క్షమించాడా?"

"ఎక్కడినుండి ప్రియా?" సుదర్శన ప్రశ్నకు ఉలిక్కిపడుతూ కాగితం అందించింది

"నే నెలా చదవగలను ప్రియా! నీ కళ్ళతో నేను చదువుకోవాలి..." అన్నాడు ఆమెను వెతుక్కుంటూ

"సుధా! నాకు ఉద్యోగం వచ్చింది" అంది.

"నిజంగానా....దేవుడు చాలామంచివాడు ప్రియా!"

"అవును...దేవుడు నన్ను క్షమించాడు. నా తప్పును మన్నించాడు మరో సారి ఆ తప్పు చేస్తానని...నాకు దారి చూపించాడు" అంది శాంతిప్రియ కళ్లు గట్టిగా తుడుచుకుంటూ

* * *

"మాస్టారూ! నేను మద్రాసులోని మన బ్రాంచికి వెళ్ళిపోదామనుకుంటున్నాను"



ఆ రాత్రి భోజనం చేస్తూ అన్నాడు విజయ్

"నేను ఆమాటే సీతతో చెప్పాలనుకుంటున్నాను విజయ్. నేను వస్తాను సీతో" అన్నాడు రాఘవయ్య

"..........."

"కరుణను ఈ యింట్లో వుండమన్నాను. వుండనంటోంది. వాళ్ళ ఊరు వెడతానంటోంది రాజు యిక్కడే వుంటాడు" అన్నాడు.

విజయ్ మాట్లాడలేదు.

"వింటున్నావా విజయ్! గట్టిగా అడిగాడు రాఘవయ్య"

"ఆఁ..." అంటూ తలూపి లేచిపోయాడు విజయ్.

కాంతి జీవితం కుదురుకున్నా విజయ్ జీవితం మారేలా లేదు అనుకున్నాడు రాఘవయ్య.

"కరుణా!" చీకట్లో...గదిలో ఒంటరిగా కిటికీ దగ్గర నిలబడి బయటకు చూస్తోన్న కరుణ కళ్ళు తుడుచుకుంటూ, వెనిక్కి తిరిగింది.

ఎదురుగా రాఘవయ్య. అతడ్ని చూసి చిన్నగా నవ్వ ప్రయత్నిస్తూ "మీరింకా నిద్రపోలేదా బాబుగారూ" అంది.

"లేదమ్మా! నువ్వింకా కొన్నాళ్ళు మాతో వుండకూడదూ కరుణా! విజయ్‌కున్న ఒక్క బాధకు పరిష్కారం లభించింది. యిక మారవచ్చు"

కరుణ నవ్వి—"మాస్టారూ మారితే–నేను ఎక్కడున్నా వచ్చేస్తారు బాబుగారు!" అంది. అతను చెప్పాలనుకున్నది ఎంతోవున్నా కరుణ జవాబు విని మౌనం వహించారు.

ఆ మర్నాడు సాయంత్రం ట్రెయిన్‌కే కరుణ బయలుదేరుతానంది.

రాజు, రాఘవయ్య ట్రెయిన్ ఎక్కించడానికి స్టేషన్‌కి వెళ్ళారు

కనీసం స్టేషన్‌కైనా విజయ్ వస్తాడనుకుంది కరుణ కాని విజయ్ రాలేదు.

ట్రెయిన్ కదిలే చివరిక్షణం వరకు ఎదురుచూసింది కరుణ.

విజయ్ రాలేదు

కరుణ కళ్ళనిండా నీళ్ళు...చివరిసారిగా రాఘవయ్య దగ్గర, రాజు దగ్గర సెలవు తీసుకొని, కంపార్టుమెంటు లోపలికి వెడుతూ కరుణ...

"కరుణా!" ఎవరిదో పిలుపుగాలిలో ఆర్తనాదంలా వినిపించి వెనతిరిగింది.

దూరంగా విజయ్.

రైలు మెల్లిగా కదిలింది.

ఒక్క నిమిషంలో విజయ్ దగ్గరికి రావడం ట్రెయిన్ వేగం పెరగడం ఒకేసారి జరిగింది.

చాచిన విజయ్ చేతిని అందుకున్న కరుణ ఒక్కసారి గాలిలోకి లేచింది, కళ్ళు రెండు గట్టిగా మూసుకుంది.

ఆమెకు తెలుస్తోంది. తను క్రిందపడలేదు. విజయ్ చేతుల్లో బొమ్మలా.... ఆ తరువాత అతని కౌగిలిలో గువ్వలా వొదిగిపోతున్నానని

ఎవరిదగ్గరో వున్న ట్రాన్సిస్టర్‌లో నుండి మధురంగా వినిపిస్తోంది ఘంటసాల గొంతు–విజయ్ ఊహకు ప్రతిరూపంగా.

మనసున మనసై బ్రతుకున బ్రతుకై తోడొకరుండిన

అదే భాగ్యము.

అదే స్వర్గము...

(అయిపోయింది) *